తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

గురువారం 31.07.2025 | సంపుటి :12 సంచిక : 12 | పేజీలు :12 వెల : రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## భారత్‌పై అమెరికా ట్యాక్స్‌వార్

### మన దేశ వస్తువులపై 25 % టారీఫ్‌ల విధింపు

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టు నెగ్గించుకున్నాడు. భారత్‌పై సుంకాల చర్యలకు ఉపక్రమించారు. మన దేశ వస్తువులపై 25శాతం సుంకాలు విధిస్తున్నట్లు- ప్రకటించారు. ఆగస్టు 1 నుంచి ఇవి అమల్లోకి రానున్నట్లు- చెప్పారు. అమెరికా వస్తువులపై భారత్ ఎక్కువ సుంకాలు విధిస్తోందన్నారు. భారత్ మిత్రదేశమే అయినా.. సుంకాలు ఎక్కువగా ఉన్నందున మిగతా 3 లో..


- నేటి అమల్లోకి రానున్నట్లు ప్రకటించిన డోనాల్డ్ ట్రంప్
- ఉక్రెయిన్‌పై రష్యా దాడులను ప్రపంచమంతా ఖండిస్తోంది
- కానీ భారత్ మాత్రం ఆ దేశం నుంచి చమురు దిగుమతి చేసుకుంటోంది
- అందుకే సుంకాలకు అదనంగా పెనాల్టీ కూడా విధిస్తున్నాం :అమెరికా అధ్యక్షుడు
- భారత్ మిత్రదేశమే అయినా.. సుంకాలు ఎక్కువగా ఉన్నందున వారితో పరిమిత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్నామని వెల్లడి

## దేశ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం

### అందుకోసం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటాం

### ట్రంప్ సుంకాల ప్రకటనపై భారత్ స్పందన

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్‌పై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. పెనాల్టీతో కలిపి ఇవి ఆగస్టు 1 నుంచి ఇవి అమల్లోకి రానున్నట్లు చెప్పారు. దీనిపై భారత్ స్పందించింది. మిగతా 2 లో..



## బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో పోరు

### ఉద్యమానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్న కాంగ్రెస్

### ఆగస్టు 5న పార్లమెంటులో ఎంపీల వాయిదా తీర్మానం, చర్చకు పట్టుబట్టాలని నిర్ణయం

### 6న జంతర్ మంతర్ వద్ద ధర్నా..7న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి వినతిపత్రం

- కార్యక్రమాల్లో సీఎం రేవంత్‌తో పాటు పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు, బీసీ సంఘాల నేతలు
- పార్టీలో ఉత్సాహం నింపేందుకు నేటి నుంచి వచ్చే నెల 4 వరకు మీనాక్షి పాదయాత్ర
- ముఖ్యమంత్రితో భేటి అయిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- పాదయాత్రతో పాటు పలు అంశాలపై సమావేశంలో చర్చ

హైదరాబాద్(జనంసాక్షి):సీఎం రేవంత్‌రెడ్డితో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు భేటీ అయ్యారు. రాష్ట్రంలో పార్టీ నిర్మాణం, పాద యాత్ర, బీసీ రిజర్వేషన్‌లపై ఢిల్లీలో పోరాడేందుకు కార్యాచరణపై చర్చించారు..ఆగస్టు 5, 6, 7 తేదీల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదానికి ఢిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణ వీరి మధ్య చర్చకు వచ్చింది. ఆగస్టు 5న పార్లమెం టులో ఎంపీల వాయిదా తీర్మానం, చర్చకు పట్టుబ ట్టాలని నిర్ణయించారు. ఆగస్టు 6న జంతర్ మంతర్ వద్ద ధర్నాలో సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు, బీసీ సంఘాల నేతలు పాల్గొననున్నారు. 7నరాష్ట్రపతిని కలిసి వినతి పత్రం ఇవ్వనున్నారు. ప్రత్యేక రైలులో మిగతా 2 లో..

## తెలంగాణలో మరో కొత్త డిస్కం ఏర్పాటు

### విద్యుత్‌శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

వార్త 2 లో

## రష్యాతీరంలో భారీ భూకంపం

### ప్రకంపనల ధాటికి ఆ దేశంతోపాటు జపాన్‌నూ తాకిన సునామీ



### రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 8.8గా నమోదు

- భారీగా ఎగిసిపడ్డ రాకాసి అలలు.. అత్యవసర హెచ్చరికలు జారీ
- సైరన్ల మోతతో వీధుల్లోకి వచ్చిన జనం
- ఘటనతో ప్రపంచ దేశాల అప్రమత్తం
- అమెరికాలోనూ ప్రభావం
- ప్రజలను అప్రమత్తం చేసిన ఆయా దేశాలు
- సముద్ర తీరంలో ఎగిసి పడుతున్న రాకాసి అలలు
- చైనాలోనూ వాతావరణ బీభత్సం..
- తీరానికి కొట్టుకు వచ్చిన తిమింగలాలు
- సునామీ హెచ్చరికలతో భారత్ అప్రమత్తం
- తక్షణమే స్పందించిన అమెరికాలోని భారత కాన్సులేట్ జనరల్
- ప్రజలంతా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన






మాస్కో/టోక్యో(జనంసాక్షి):రష్యాలో భారీ భూకంపం బుధవారం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 8.8గా నమోదైనది. రష్యా తీరంలోని కమ్చట్కా ద్వీపకల్పంతో పాటు- జపాన్‌కు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మిగతా 2 లో..



## గొర్రెల కుంభకోణంలో ఈడీ సోదాలు

### హైదరాబాద్‌లో పలువురి ఇళ్లలో తనిఖీలు

హైదరాబాద్(జనంసాక్షి):గొర్రెల పంపిణీ కుంభకోణం కేసులో హైదరాబాద్‌లోని ఆరుచోట్ల ఈడీ సోదాలు చేపట్టింది. పశుసంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ రామచందర్ నాయక్, ప్రధాన నిందితుడు మొయినుద్దీన్, పలువురి ఇళ్లలో అధికారులు తనిఖీలు చేశారు. తొలుత ఈ కుంభకోణంపై ఏసీబీ కేసు నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. గొర్రెల పంపిణీతో రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు ఏసీబీ గుర్తించింది. 2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వేల మంది లబ్ధిదారులకు సుమారు రూ.4వేల కోట్ల విలువైన గొర్రెలను పంపిణీ చేసినట్లు- గణాంకాలు చెబుతున్నాయి. ఈ పథకంలో మొదటి నుంచి అధికారులు, దళారులు కుమ్మక్కయి నిధులు స్వాహా చేసినట్లు- ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. కొంత మంది విక్రేతలకు డబ్బులు చెల్లించినట్లు- మిగతా 2 లో..



## నిప్పులు చిమ్ముతూ నింగికి..


### జీఎస్‌ఎల్‌వీ- ఎఫ్16 ప్రయోగం విజయవంతం..

### నిర్దేశిత కక్ష్యలోకి 'నైసార్' ఉపగ్రహం


### భారత్ అమెరికా అంతరిక్ష సహకారంలో తొలి అడుగు

**'నైసార్' ప్రత్యేకతలు..**

*ఈ రెండు రాడార్లు భారీ డిష్ ఆకారంలో ఉంటాయి. ఇవి భూమి పైకి మైక్రోవేవ్, రేడియో సంకేతాలు పంపి.. తిరిగివచ్చిన వాటిని విశ్లేషించి చిత్రాలను తయారుచేస్తాయి. ఈ యాంటీన్నా 12 చదరపు మీటర్ల*



తిరుపతి(జనంసాక్షి):అంతరిక్ష రంగంలో భారత్ మరో కీలక ముందడుగు వేసింది. 'నాసా, ఇస్రో సింథటిక్ ఎపెర్చర్ రాడార్' భూపరిశీలన ఉపగ్రహం ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్- షార్ నుంచి నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్‌ఎల్‌వీ-ఎఫ్16 వాహక నౌక.. 2,393 కిలోల బరువున్న 'నైసార్' ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో-నాసా కలిసి ప్రయోగించిన తొలి ఉపగ్రహం ఇదే. అత్యంత ఖరీదైన ఉపగ్రహంగానూ నిలిచింది. దీని కోసం నాసా 1.16 బిలియన్ డాలర్లను సమకూర్చగా.. భారత్ 90 మిలియన్ డాలర్లను ఇచ్చింది. మిగతా 2 లో..



## పీవోకేను తిరిగి స్వాధీనం చేసుకుంటాం

### పహల్గామ్ దాడిలో లష్కరే తోయిబా హస్తం

### రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా అమిత్ షా

- కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు
- యూపీఏ పాలనలో బాంబు పేలుళ్ల జరగని నగరమే లేదు: జేపీ నడ్డా
- పాక్ ఉగ్రవాదాన్ని విడిచిపెట్టే వరకు సింధూ జలాల ఒప్పందం నిలిపివేత: జైశంకర్
- ఆపరేషన్ సిందూర్ పేరెలా పెడతారు.. జయాబచ్చన్ విమర్శలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పహల్గాం ఉగ్రదాడిలో లష్కరే తోయిబా హస్తం ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు. ఆపరేషన్ మహదేవ్ చేపట్టి అంతం చేసిన ముగ్గురు ఉగ్రవాదులు ఆ ఉగ్రసంస్థకు చెందినవారేనని స్పష్టం చేశారు. వాస్తవానికి పహల్గాం దాడి వెనుక ఉన్న ఉగ్రవాదుల తలపై కాల్చి చంపాలని ప్రజలు కోరుకున్నారని, యాదృచ్ఛికంగా ఆ ముగ్గురు ఉగ్రవాదులను మన బలగాలు తలపైనే గురిచూసి కాల్చాయని ఆయన రాజ్యసభలో చెప్పారు. మహిళలు, పిల్లల ముందు మతం అడిగి మరీ చంపేశారని, ఇంత అనాగరిక నేరం ఇంతకు ముందు ఎన్నడూ జరగలేదని అమిత్‌షా అన్నారు.కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కంటే రాజకీయాలే ముఖ్యమైపోయాని అమిత్? షా విమర్శలు గుప్పించారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో కాంగ్రెస్ సంతృప్తి పడుతోందని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లను పాకిస్థాన్‌కు ఇచ్చేసిందని, కానీ బీజేపీ దానిని తిరిగి భారత్‌లో చేరుస్తుందని అమిత్ షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాల వల్లే ఉగ్రవాదం వృద్ధి చెందిందని ఆయన విమర్శించారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఉంటే, ఉగ్రవాదులపై చర్య తీసుకునే బదులు పత్రాలను పంపి ఉండేదని ఆయన ఆరోపించారు. భారత్‌లో ఉగ్రవాదం పూర్తిగా అంతరించే దిశలో ఉందని, మిగతా 2 లో..

## రైతుల విషయంలో రాజకీయాలా?



### సవాళ్లు విసరడం కాదు.. తెలంగాణకు ఎంత యూరియా సరఫరా చేశారో ముందు తెలుసుకోండి

### రైతులు తిప్పలు పడుతుంటే చేయని గొప్పలు చేసినట్లుగా చెప్పుకొంటున్నారు

### రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిపై మంత్రి తుమ్మల ఆగ్రహం

హైదరాబాద్(జనంసాక్షి):రైతుల విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావివ్వకూడదని ఎన్నిసార్లు తాను విన్నవించినా.. బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు వైఖరి మారడం లేదని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి రాష్ట్ర రైతాంగం యూరియా కోసం క్షేత్రస్థాయిలో తిప్పలు పడుతుంటే చేయని గొప్పలు చేసినట్లుగా చెప్పుకొంటున్నారని, అది వారి అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. వ్యవసాయ రంగంపై కనీస అవగాహన లేకుండా భాజపా నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రానికి 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేంద్రం సరఫరా చేసిందన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. ఒక రాష్ట్రానికి పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడు తున్నారని అసహనం వ్యక్తం చేశారు. రామచంద్రరావుకు, భాజపాకి తెలంగాణ రైతాంగం పట్ల ఉన్న నిబద్ధతను ఏంటో తెలుస్తోందని ఎద్దేవా చేశారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ మొత్తానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే కేటాయించిందని గుర్తు చేశారు. ఇది తెలియ కుండా 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసిందని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని భాజపా నాయకులకు హితవు పలికారు. ఇప్పటికే ఎన్నో సార్లు క్షేత్రస్థాయి పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటు-న్న ఇబ్బందులు, ఇతర లెక్కలతో సహా కేంద్ర రసాయన ఎరువులశాఖ మంత్రి, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మిగతా 2 లో..

## టీఆర్‌ఎఫ్‌పై ఆంక్షలకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఓకే..

న్యూయార్క్(జనంసాక్షి):జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ కు చెందిన ఉగ్రవాదులు విచక్షణారహితంగా దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే.దీన్ని ఉగ్రసంస్థగా ప్రకటించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని భారత్ ఎప్పటినుంచో డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. టీఆర్‌ఎఫ్‌పై ఆంక్షలు విధించేందుకు యూఎన్‌ఎస్సీ అంగీకరించినట్లు తెలుస్తోంది. ఇటీవలే దీన్ని అమెరికా ఉగ్రసంస్థగా ప్రకటించిన సంగతి తెలిసిందే.యూఎన్‌ఎస్సీ పర్యవేక్షణ కమిటీ తన తాజా నివేదికలో టీఆర్‌ఎఫ్ గురించి అధికారికంగా ప్రస్తావించింది. పహల్గాంలో మిగతా 2 లో..



## మీ తప్పు లేకుంటే ముందే ఎందుకు స్పందించలేదు?

### నోట్ల కట్టల కేసులో జస్టిస్ వర్మపై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ(జనంసాక్షి): నోట్ల కట్టల వ్యవహారం కేసు జస్టిస్ యశ్వంత్ వర్మను వెంటాడుతోంది. ఇక త్రిసభ్య విచారణ కమిటీ- ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై బుధవారం సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీం కోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది. నోట్ల కట్టలు వర్మవిగా కమిటీ- తేల్చింది. అయితే కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.వర్మ తరఫున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. న్యాయమూర్తిని తొలగించాలని అంతర్గత విచారణ ప్యానెల్ చేసిన సిఫార్సు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. మీ ప్రవర్తన నమ్మశక్యంగా లేదని.. రాజ్యాంగ విరుద్ధమని భావిస్తే విచారణకు ఎందుకు హాజరయ్యారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై ముందే సవాల్ చేయాల్సింది మిగతా 9 లో..

## ఇందిరమ్మ ఇళ్లలో వెట్టి చాకిరి కార్మికులకు అత్యంత ప్రాధాన్యత

### వారి సమస్యలను సీఎం దృష్టికి సమస్య తీసుకెళతా: మంత్రి వివేక్

2 లో

## 43 ఓటీటీలను నిషేధించాం

### అశ్లీల కంటెంట్‌పై కేంద్రం కొరడా

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఓటీటీ వేదికల్లో విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న అభ్యంతరకర వీడియోలను కట్టడి చేయడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు చేపడుతోంది. అశ్లీలత, అనైతికత, హింసను ప్రోత్సహించే కంటెంట్‌ను ప్రసారం చేసే పలు ఓటీటీ వేదికలపై కొరడా ఝుళిపిస్తోంది.ఇటీవల 24 యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధించగా.. ఇప్పటివరకు 43 ఓటీటీ వేదికలను బ్లాక్ చేసినట్లు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ సహాయమంత్రి డా.ఎల్. మురుగన్ లోక్‌సభకు వెల్లడించారు. అశ్లీలత, హింస, సాంస్కృతిక అంశాలపై సున్నితమైన కంటెంట్‌ను మిగతా 9లో..

## తెలంగాణలో మరో కొత్త డిస్కం ఏర్పాటు



హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో మరో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఉండగా.. మరో డిస్కం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిం చాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి, ప్రభుత్వ విద్యా సంస్థలకు, గృహజ్యోతి పథకానికి ఇచ్చే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. విద్యుత్‌శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "రాష్ట్రంలో విద్యుత్ శాఖ ప్రక్షాళన కోసం సంస్కరణలు చేపట్టాలి. కొత్త డిస్కం ఏర్పాటు వల్ల ఇప్పుడున్న విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరు మెరుగుపడి.. జాతీయ స్థాయిలో రేటింగ్ పెరుగుతుంది. డిస్కంల పునర్వ్యవస్థీకరణతో పాటు విద్యుత్ సంస్థలపై ఇప్పుడున్న రుణభారం తగ్గించాలి. రుణాలపై పది శాతం వరకు వడ్డీలు చెల్లిస్తూ డిస్కంలు డీలా పడ్డాయి. తక్కువ వడ్డీలు ఉండేలా రుణాలను రీస్ట్రక్చర్ చేసుకునేలా వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యుత్ సంస్థల్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని అందుబాటులోకి తేవాలి. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం అనువైన భవనాలను గుర్తించే బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలి" అని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిప్పులు చిమ్ముతూ నింగికి..

అంతరిక్షంలోకి ఇప్పటివరకు చేర్చిన అత్యంత శక్తిమంతమైన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్లలో ఇది ఒకటిగా నిలిచింది.ఈ ఉపగ్రహాన్ని ఇస్రో, నాసాలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. దీంతో నైసార్ అని పేరు పెట్టారు. వివిధ పరిశోధనల్లో కొత్త ఒరవడిని ఇది తీసుకురానుంది. రెండు సింథటిక్ అపర్చర్ రాడార్లు (సార్) అమర్చిన తొలి ఉపగ్రహం ఇదే. ఇస్రో-నాసా కలిసి ప్రయోగిస్తున్న తొలి ఉపగ్రహం ఇదే. భారత్ అమెరికా అంతరిక్ష సహకారంలో దీనిని తొలి అడుగుగా భావిస్తున్నారు. ఇప్పటికే యాక్సిమ్ మిషన్ కింద భారత వ్యోమగామి శుభాంశు శుక్లాను అమెరికా అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే.

**'నైసార్' ప్రత్యేకతలు..**

వైశాల్యం ఉటుంది. దీనిని మడతపెట్టి అంతరిక్షంలోకి పంపిస్తారు. ఇది భూమిపై దాదాపు 20 కిలోమీటర్ల వైశాల్యంలోని ప్రదేశాలను చిత్రీకరించగలదు. ఇస్రోకు చెందిన రిశాట్ సిరీస్‌లో ఒక 'సార్'ను అమర్చిన ఉపగ్రహాలు ఇప్పటికే అంతరిక్షంలో ఉన్నాయి. నైసార్‌కు ఉన్న రెండు రాడార్లలో ఒకటి ఎల్-బ్యాండ్ ఫ్రీక్వెన్సీ, మరొకటి ఎస్-బ్యాండ్ ఫ్రీక్వెన్సీల్లో పనిచేస్తాయి.

## దేశ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం

ట్రంప్ ప్రకటించిన సుంకాల ప్రభావం ఏ మేరకు ఉంటుందనేదానిపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. రైతులు, వ్యాపారవేత్తలతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంది.

## గొర్రెల కుంభకోణంలో ఈడీ సోదాలు

రికార్డుల్లో చూపించి, ఆ నిధుల్ని ఈ ముఠా స్వాహా చేసింది. ఈ నిధుల్ని బినామీ ఖాతాల్లోకి మళ్లించి అంతా కలిసి వాటాలు పంచుకున్నట్లు వెల్లడైంది. ఈ కుంభకోణంలో కొందరు పెద్దల పాత్ర కూడా ఉన్నట్లు- ఏసీబీ, ఈడీ అనుమానిస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో 10 చోట్ల ఈడీ దాడులు కొనసాగుతుండటం హాట్ టాపిక్‌గా మారింది. సికింద్రాబాద్, బోయిన్ పల్లి, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఈడీ సోదాలు చేపట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీలో రూ.700 కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలతో గతంలో ఏసీబీ కేసు నమోదు చేసింది. అనంతరం ఈడీ రంగంలోకి దిగి ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారడం, ఇతర రాష్ట్రాలకూ లింకులు ఉన్నాయనే ఆరోపణలు రావడంతో ఈడీ రంగంలోకి దిగింది. అందుకే మనీ లాండరింగ్ కేసుగా ఈడీ విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారంలో అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ హస్తమూ ఉందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.


## ఇందిరమ్మ ఇళ్లలో వెట్టి చాకిరి కార్మికులకు అత్యంత ప్రాధాన్యత

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణను వెట్టి చాకిరీ విముక్తి రాష్ట్రంగా తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించిన కార్మికులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తుందని, ఆర్థిక సహకారం కూడా అందిస్తుందని ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ప్రతి ఏడాది కేటాయిస్తున్న 3500 ఇందిరమ్మ ఇళ్లలో వెట్టి చాకిరి విముక్తి కార్మికులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరుతానని మంత్రి పేర్కొన్నారు. జాతీయ వెట్టి చాకిరి విముక్తి దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ, తెలంగాణ అసంఘటిత కార్మికుల సంఘం, స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు బుధవారం నగరంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి వెట్టిచాకిరి, అక్రమ రవాణా సంబంధిత ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ను 8069 434343 ఆవిష్కరించారు. వెట్టి చాకిరిని నిషేధించి దశాబ్దాలు గడుస్తున్నా.. ఇప్పటికి కొనసాగడం అత్యంత దురదృష్టకరమని, మానవత్వానికి మచ్చ అని అభివర్ణించారు. ఇకనుంచి ఫిబ్రవరి 9న వెట్టి చాకిరి విముక్తి దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని మంత్రి ప్రకటించారు.





# రష్యా తీరంలో భారీ భూకంపం



3 మీటర్ల ఎత్తులో అలలు వచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అమెరికాలో 2011లో సంభవించిన తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద భూకంపం అని అధికారులు పేర్కొన్నారు. సముద్ర తీర ప్రాంతాల ప్రజలు అలర్ట్‌గా ఉండాలని రష్యా ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. భూకంపనాలకు ప్రజలు భయాందోళనతో వీధుల్లోకి పరుగులు తీశారు. ఇళ్లలోని క్యాబినెట్‌లు కూలిపోవడం, అద్దాలు విరిగిపోవడం, రోడ్లపై నిలిపిన కార్లు ఊగడం వంటి సిసి టివి ఫుటేజీలు విడుదల అయ్యాయి. భూకంపం తర్వాత కొద్ది సమయంలోనే రష్యా, జపాన్ తీర ప్రాంతాలను సునామీ తాకింది. పలుచోట్ల రాకాసి అలలు ఎగసిపడ్డాయి వీటితో పాటు- ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు, దీవులకు సునామీ ముప్పు పొంచి ఉంది. అమెరికాలోని ద్వీప రాష్ట్రం హవాయి మొత్తానికి సునామీ హెచ్చరిక జారీ అయింది. అలలు ఆరు అడుగుల ఎత్తు వరకు ఎగసిపడ్డాయిరాష్ట్రం మొత్తం సునామీ సైరన్లు వినిపించాయి. దాంతో పర్యాటకులు, స్థానికులు తమ స్వస్థలాలను వీడి ఎత్తైన ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఒక్కసారిగా రాష్ట్ర ప్రజలంతా తరలుతుండటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్లన్నీ కారులతో బారులు తీరాయి. ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇక అలస్కాలోని కొన్ని ప్రాంతాలను అమెరికా వాతావరణ విభాగం అప్రమత్తం చేసింది. అమెరికా వాతావరణ విభాగం కీలక హెచ్చరిక జారీ చేసింది. సునామీ తీవ్రతను తేలిగ్గా తీసుకోవద్దని, ఫొటోల కోసం తీరానికి వెళ్లొద్దని చెప్పింది. ఒక్క అలతో సునామీ రాదని, అలలు పెద్దసంఖ్యలో వస్తాయని, సముద్రం నుంచి తీరానికి వచ్చే నీటి పరిమాణం భారీగా ఉంటుందని వెల్లడించింది. ఇదిలాఉంటే.. జపాన్ తీర ప్రాంతంలోని 9 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. చైనాకు ఈ ప్రకృతి విపత్తు ముప్పు పొంచి ఉంది. సునామీనే కాకుండా సైక్లోన్ ప్రమాదమూ ఉంది. దాంతో షాంఘైలోని 28 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విమానాలు, బోట్ సర్వీసులను నిలిపివేశారు. ప్రస్తుతం తూర్పు చైనాలో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తున్నాయి. రష్యాలో తూర్పు ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున వచ్చిన భారీ భూకంపం కారణంగా దాంతోపాటు- చుట్టు-పక్కల దేశాలపై సునామీ అలలు విరుచుకు పడ్డాయి. అలలు తాకిన దీవుల్లో రష్యా అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఈ సునామీ వల్ల ఆయా ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. పలు నిర్మాణాలు దెబ్బతిన్నాయి. సునామీ దెబ్బకు భారీ తిమింగలాలు తీరానికి కొట్టుకొచ్చి పడ్డాయి. రష్యా లో తూర్పు ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున వచ్చిన భారీ భూకంపం కారణంగా చుట్టుపక్కల దేశాలపై సునామీ అలలు విరుచుకుపడ్డాయి. పసిఫిక్ సముద్రంలో పుట్టుకొచ్చిన సునామీ జపాన్‌ను కూడా తాకింది. సముద్రంలో కల్లోలం తీవ్రతకు నీటి మధ్యలో ఉండాల్సిన భారీ తిమింగలాలు తీరంలోకి విసిరేసినట్లు పడ్డాయి. జపాన్‌లోని చింబా తీరంలోని దృశ్యాలు వైరల్‌గా మారాయి. మరోవైపు ఇప్పటికే రేడియేషన్ లీకేజీతో సమస్యాత్మకంగా మారిన ఫుకుషిమా డయాచీ అణుకేంద్రం నుంచి ఉద్యోగులను బయట సురక్షిత ప్రదేశాలకు తరలించారు. ఇప్పటికే జపాన్‌లోని పసిఫిక్ తీరంలో ఉన్న కొన్ని దీవులను సునామీ అలలు చేరుకొన్నాయి. టొకచాయ్ పోర్టులో 40 సెంటీమీటర్ల అలలు రాగా.. ఎరిమో పట్టణంలో 30 సెంటీమీటర్ల మేర అలలు వచ్చాయి. దీంతోపాటు- థోకు, కాంటో ప్రాంతాల్లో కూడా భారీ అలలు కనిపించాయి. హన్సంకిలో 30 సెంటీమీటర్ల ఎత్తున అలలు వచ్చినట్లు- ఎన్‌హెచ్‌కే పేర్కొంది. ఇషినోమొకి పోర్టులో 50 సెంటీ-మీటర్ల అలలు వచ్చాయి. ఇక తీర ప్రాంతాలకు సమీపంలో ఉన్న జపాన్ ఎయిర్ పోర్టులు కూడా సునామీ హెచ్చరికలతో అప్రమత్తమయ్యాయి. ఈశాన్య జపాన్‌లోని సెందాయ్ విమానాశ్రయాన్ని మూసివేశారు. ఈ ప్రాంతానికి వచ్చే విమానాలను దారి మరల్చారు.

సునామీ హెచ్చరికలతో భారత్ అప్రమత్తం రష్యాలో బుధవారం ఉదయం భారీ భూకంపం సంభవించడంతో రష్యా, జపాన్‌తో పాటు ఉత్తర పసిఫిక్‌లోని పలు తీర ప్రాంతాలను సునామీ తాకింది. ఈ నేపథ్యంలో అమెరికాలోని భారత కాన్సులేట్ జనరల్ అప్రమత్తమైంది. ప్రజలంతా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.సునామీ ముప్పును శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. కాలిఫోర్నియా, హవాయితో పాటు అమెరికా పశ్చిమ తీర రాష్ట్రాల్లో నివసిస్తున్న భారత పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. అమెరికా అధికారులు జారీ చేసే అలర్ట్‌లను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పాటించాలి. సునామీ హెచ్చరికలు జారీ అయితే.. వెంటనే ఎత్తైన ప్రాంతాలకు తరలి వెళ్లండి. తీర ప్రాంతాలకు దూరంగా ఉండండి. అత్యవసర పరిస్థితికి సిద్ధమవ్వండి. మీ ఎలక్ట్రానిక్ పరికరాలకు ఛార్జింగ్ ఉండేలా చూసుకోండి. సాయం కోసం ఎమర్జెన్సీ నంబర్లను సంప్రదించండని కాన్సులేట్ జనరల్ 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. మరోవైపు, తాజా పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. పసిఫిక్ మహా సముద్రంలో భారీ భూకంపం కారణంగా హవాయి ప్రాంతానికి సునామీ అలర్ట్ జారీ అయ్యింది. అమెరికాలోని పసిఫిక్ తీర ప్రాంతాలకూ ముప్పు పొంచి ఉంది. ప్రజలంతా ధైర్యంగా ఉండండి. సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లండి. అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు పాటించండని అధ్యక్షుడు సూచించారు. రష్యా తీర ప్రాంతమైన పెట్రోపావ్లోవ్స్క్-కామ్చాట్స్కీ లో బుధవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 8.8గా నమోదైంది. దీంతో రష్యాలోని కురిల్ దీవులు, జపాన్ దీవులను సునామీ తాకింది. రాకసి అలలు భారీగా ఎగసిపడుతున్నాయి. భూకంపం కారణంగా అనేక భవనాలు కొన్ని నిమిషాల పాటు- కదిలాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. మరోవైపు, సునామీ నేపథ్యంలో ఇప్పటికే పలు తీర ప్రాంతాలను వరద ముంచెత్తినట్లు- తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.



## భారత్‌కు బుద్ధుడి పవిత్ర అవశేషాలు

**- 127 ఏళ్ల అనంతరం స్వదేశానికి..**

**- దేశ సాంస్కృతిక వారసత్వానికి సంతోషకరమైన రోజు: ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):బ్రిటిష్ హయాంలో భారత్ నుంచి తరలిపోయిన బుద్ధుని పవిత్ర అవశేషాలను 127 ఏళ్ల తర్వాత స్వదేశానికి తిరిగి తీసుకొచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దేశ సాంస్కృతిక వారసత్వానికి సంతోషకరమైన రోజుగా పేర్కొన్నారు. 1898లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని పిపర్‌హవా ప్రాంతంలో చేపట్టిన తవ్వకాల్లో బయటపడిన ఆ పవిత్ర అవశేషాలను.. వలస పాలన సమయంలో మన దేశం నుంచి తరలించారని గుర్తుచేశారు."బుద్ధుని పవిత్ర 'పిపర్‌హవా' అవశేషాలు 127 ఏళ్ల తర్వాత తిరిగి భారత్‌కు తీసుకురావడం దేశవాసులందరికీ ఎంతో గర్వకారణం. బుద్ధుడు, ఆయన బోధనలతో దేశానికి ఉన్న అనుబంధాన్ని ఈ పవిత్ర అవశేషాలు చాటిచెబుతున్నాయి. అదేవిధంగా అద్భుతమైన సంస్కృతిని పరిరక్షించడం పట్ల మన నిబద్ధతను చాటుతున్నాయి. ఈ అవశేషాలు 1898లో వెలుగులోకి వచ్చాయి. కానీ.. వలసపాలనలో భారత్ నుంచి వేరే ప్రాంతానికి తరలించారు. ఈ ఏడాది ప్రారంభంలో ఓ అంతర్జాతీయ వేలంలో అవి కనిపించాయి. దీంతో వాటిని తిరిగి స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. ఇందులో భాగమైన వారందరికి అభినందనలు" అని అన్నారు

# బీసీ రిజర్వేషన్ కోసం ఢిల్లీలో పోరు

ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది నేతలు, కార్యకర్తలు ఢిల్లీకి వెళ్లనున్నారు. ఢిల్లీ పర్యటన అనంతరం కాంగ్రెస్ పాదయాత్ర యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు.

**స్థానిక విజయం లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహం**

బిసి రిజర్వేషన్లు ప్రకటించినా..రాష్ట్రపతి ఇంకా ఆమోదించలేదు. దీనిపై కేంద్రాన్ని నిందిస్తూ కాంగ్రెస్ ఉద్యమకార్యాచరణకు సిద్ధం అవుతోంది. ఢిల్లీలో ఆందోళన చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. 42శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోంది. బిజెపి మాత్రం ఇది ఆమోదయోగ్యం కాదనిచెబుతోంది. అందులో ముస్లిం రిజర్వేషన్లు తొలగించాలని చెబుతోంది. మొత్తంగా ఎవరి రాజకీయం వారిది. ఎవరి ఆలోచన వారిది. ఈ క్రమంలో ఆర్డినెన్స్ పాస్ కాకుంటే.. మావ్యూహం మాకుందని సిఎం రేవంత్ పదేపదే చెబుతున్నారు. అదేంటన్నది ఇప్పుడే తెలియదు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాల్లో విజయం సాధించాల్సిందేనని పట్టుదలతో కాంగ్రెస్ పనిచేస్తోంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు సందేశాలు వెళ్లాయి. మరోవైపు ఏఐసిసి నాయకురాలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ జూలై31 గురువారం నుంచి పాదయాత్రకు సిద్ధం అవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టు-కుని ఈ నెల 31 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ తొలి విడత పాదయాత్ర, పల్లె నిద్ర, శ్రమదానం చేయడానికి త్రిముఖ వ్యూహాన్ని ఆమె ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యే క్వార్టర్‌లో సమావేశమయ్యారు.పది ఉమ్మడి జిల్లాల పార్టీ ఇన్‌ఛార్జిలు, పార్లమెంటు వారీగా నియమితులైన ఇన్‌ఛార్జిలుగా నియమితులైన ఉపాధ్యక్షులు, పిసిసి ప్రధాన కార్యదర్శులు, జిల్లా పార్టీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. పాదయాత్రలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని, జన సమీకరణ, భారీ ఏర్పాట్లు-, పెద్ద ఎత్తున కార్యకర్తల సమావేశం ఏర్పాటు- చేయడం గురించి మీనాక్షి సూచన చేశారు. ఈ నెల 31న రంగారెడ్డి జిల్లా పరిగిలో సాయంత్రం 5 గంటలకు పాదయాత్రకు ఆమె శ్రీకారం చుట్టనున్నారు. మీనాక్షి నటరాజన్‌తో పాటు- పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పార్టీ నాయకులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లూ పాదయాత్రలో పాల్గొంటారు. దీనిని విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే పార్టీ నాయకులను, కార్యకర్తలు ఆమె పరుగులు పెట్టిస్తున్నారు.

## రైతుల విషయంలో రాజకీయాలా?

మంత్రి, సహాయ మంత్రికి లేఖలు రాశామని.. తాజాగా రామచంద్రరావుకు కూడా లేఖ రాసినట్లు- తుమ్మల పేర్కొన్నారు. పంటల కాలాలు, ఎరువుల కేటాయింపు, సరఫరాలపై బీజేపీ నేతలు అవగాహన పెంచుకోవాలని సూచన చేశారు. బీజేపీ నేతలు చేస్తున్న రాజీనామ సవాళ్లు రాజకీయల కోసం కాకుండా ఎరువుల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తేవడానికి వాడాలని హితవు పలికారు. తమ ప్రభుత్వం ప్రస్తుత ఖరీఫ్ కోసం కేటాయించిన ఎరువులు గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. కానీ రాష్ట్ర బీజేపీ నాయకులు మాత్రం అరిగిపోయిన గ్రామ ఫోన్ లాగా పదే.. పదే.. 2024-25 యాసంగి గురించి మాట్లడటం వారి అవివేకానికి అద్దం పడుతుందని విమర్శించారు.

## టీఆర్ఎఫ్‌పై ఆంక్షలకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఓకే..

జరిగిన దాడి ప్రదేశానికి సంబంధించిన ఫొటోను టీఆర్ఎఫ్ తన వెబ్‌సైట్లో ప్రచురించినట్లు అందులో తెలిపింది. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రసంస్థ లష్కరే తయిబా మద్దతు లేకుండా ఈ దాడి జరగలేదన్న వాదనలను కూడా ప్రస్తావించింది. ఉగ్రవాద గ్రూపులు ప్రాంతీయ ఉద్రిక్తతలకు కారణమవుతాయని ఈసందర్భంగా హెచ్చరించింది. ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు ముందస్తు చర్యలు అవసరమని నొక్కి చెప్పింది. ఈ నివేదిక తదుపరి యూఎన్ఎస్సీ ఆంక్షల కమిటీ పరిశీలించనుంది. అనంతరం టీఆర్ఎఫ్‌పై ఆంక్షలు విధించాలనే ఆలోచనలో కూడా ఈ కమిటీ ఉన్నట్లు తెలుస్తోంది.





## నిక్కచ్చితనం, నిజాయితీకి నిలువుటద్దం గౌస్ బాబా

**34 ఏండ్ల పాటు పోలీసు అధికారిగా విశేష సేవలు**

**ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మానంలో కొనియాడిన సన్నిహితులు**

**కరీంనగర్ బ్యూరో, జూలై 30 (జనంసాక్షి) :** దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు పోలీసు విభాగంలో విశేష సేవలందించిన ఇంటలిజెన్స్ విభాగం కరీంనగర్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గౌస్ బాబా ఎందరికో ఆదర్శమని పలువురు సన్నిహితులు, శ్రేయోబిలాషులు పేర్కొన్నారు. గౌస్‌బాబా ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగింది ఈ సందర్భంగా ఏసీబీ రిటైర్డ్ డీఎస్పీ రమణమూర్తి, హుస్నాబాద్ డీఎస్పీ సదానందం మాట్లాడుతూ.. మూడున్నర దశాబ్దాల పాటు పోలీసుగా సేవలందించిన గౌస్ బాబా ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని ఆకాంక్షించారు. ఆయన తదుపరి జీవితం కూడా ఆనందంగా కుటుంబ సభ్యులతో గడపాలని కోరారు. జనంసాక్షి ఎడిటర్ ఎంఎం రహమాన్ మాట్లాడుతూ.. 34 ఏండ్లుగా నిజాయితీ, అంకితభావంతో వివిధ జిల్లాల్లో విధులు నిర్వర్తించిన గౌస్ బాబా నేటికీ ఇల్లు కూడా కట్టుకోలేని స్థితిలో ఉండటం బాధాకరమన్నారు. ఎంతోమంది ఉద్యోగులకు మార్గదర్శకంగా ఆయన పనిచేశారని గుర్తుచేశారు. ఇలాంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకుని మిగతా పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా గౌస్ బాబా ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు, పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది సహకారంతోనే తాను ఇన్నేండ్ల పాటు సేవలందించానని, వీరే తనకు బంధుమిత్రులు, కుటుంబ సభ్యులని గౌస్ బాబా అన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. అతిథులుగా టీఎన్‌జీవో కరీంనగర్ ప్రెసిడెంట్ ధారం శ్రీనివాస్ రెడ్డి, టీజీవో కరీంనగర్ ప్రెసిడెంట్ కె చరణ్ గౌడ్, గౌస్ బాబ సన్నిహితులు, మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పీవోకేను తిరిగి స్వాధీనం చేసుకుంటాం

అది కచ్చితంగా అంతం అవుతుందని అమిత్ షా అన్నారు. హిందువులు ఎప్పటికీ ఉగ్రవాదులు కాలేరని, ఈ విషయాన్ని ప్రపంచానికి గర్వంగా ప్రకటిస్తున్నానని తెలిపారు.మరోవైపు అమిత్ షా మాట్లాడడం ప్రారంభించగానే ప్రతిపక్ష పార్టీలు నిరసనలు వ్యక్తం చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడాలని డిమాండ్ చేశాయి. కానీ సభాధ్యక్షులు విపక్షాల డిమాండ్‌ను అంగీకరించలేదు. దీంతో వారు వాకౌట్ చేశారు. అమిత్‌షా ప్రసంగాన్ని కొనసాగిస్తూ, కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర హోంమంత్రి చిదంబరంపై విమర్శలు గుప్పించారు.'చిదంబరం నా రాజీనామా కోరారు. పహల్గాంలో దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు పాకిస్థాన్?కు చెందినవారని రుజువు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు ఆపరేషన్ సిందూర్ సమర్థతను కూడా చిదంబరం సవాల్ చేశారు. అంటే కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కన్నా రాజకీయాలు ముఖ్యం. అది ఓటు బ్యాంకు రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాల్లో మునిగిపోయింది. కాంగ్రెస్ మనస్తత్వాన్ని చిదంబరం ప్రపంచానికి బహిర్గతం చేశారు. ఓటు బ్యాంకు కోసం వారు పాకిస్థాన్, లష్కరే తోయిబాతో సహా ఉగ్రవాదులు అందరికీ మద్దతు ఇస్తారు' అని అమిత్ షా విమర్శల వర్షం కురిపించారు.ఉగ్రవాదులను ఏరివేసేందుకు చేపట్టిన ఆపరేషన్‌కు 'ఆపరేషన్ మహాదేవ్' పేరు పెట్టడాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చౌహాన్‌ను అమిత్‌షా ఎద్దేవా చేశారు. "శివాజీ మహారాజ్? మొఘలులపై పోరాడినప్పుడు, ఆయన యుద్ధ నినాదం హరహర మహాదేవ్. వాస్తవానికి భారతీయ సైనికులు వివిధ యుద్ధ నినాదాలు మతాలపై ఆధారపడి ఉంటాయి. అయితే వాటికి హిందూ, ముస్లింలతో సంబంధం లేదు. ఉగ్రవాదులను తుదముట్టించేందుకు మన సీఆర్?పీఎఫ్, సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు చాలా కృషి చేశారు. కష్టతరమైన భూభాగంలో ఉంటూ, డ్రోన్?ల ద్వారా పంపే ఆహారాన్ని తిన్నారు. ఇలా ఉగ్రవాదులను వెంబడించి వారికి తుదముట్టించారు.'అని రాజ్యసభలో అమిత్ షా చెప్పారు.కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనలో బాంబు పేలుళ్లు జరగని నగరమే లేదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా దుయ్యబట్టారు. వారి హయాంలో ఉగ్రవాదాన్ని చూసీచూడనట్లుగా వదిలేశారని మండిపడ్డారు.రాజ్యసభలో జరుగుతున్న 'ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో భాగంగా ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పహల్గాం ఉగ్ర దాడికి ఆపరేషన్ సిందూర్‌తో గట్టి బదులిచ్చిన భారత్.. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేసి పాకిస్థాన్‌కు షాక్ ఇచ్చింది.దాయాది దేశం ఉగ్రవాదాన్ని వదిలి పెట్టేవరకు ఆ నిలిపివేత కొసాగుతుందని బుధవారం రాజ్యసభలో విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టంచేశారు. నీరు, రక్తం కలిసి ప్రవహించవని మరోసారి తేల్చిచెప్పారు. ఈ ఒప్పందం కుదుర్చుకొన్న సమయంలో అధికారంలో ఉన్నవారు భారత రైతుల కంటే పాకిస్థాన్ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని దుయ్యబట్టారు.అలాగే గత కాంగ్రెస్ పాలనలో తీసుకున్న నిర్ణయాలను తప్పుపట్టారు. "60 ఏళ్లపాటు మాజీ ప్రధాని నెహ్రూ నేతృత్వంలోని ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దలేమని చెప్తూ వచ్చారు. కానీ వాటిని మార్చవచ్చని మోదీ ప్రభుత్వం చూపించింది. అందుకు ఉదాహరణలే.. ఆర్టికల్ 370 రద్దు. ఇప్పుడు సింధూ జలాల ఒప్పందాన్ని సరిదిద్దుతున్నాం" అని వెల్లడించారు. అలాగే పహల్గాం దాడికి కారణమైన ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌ను తన నివేదికలో ఐరాస తొలిసారి ప్రస్తావించిందని జైశంకర్ వెల్లడించారు. 1960ల్లో భారత్, పాక్‌ల మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దాంతో సింధూ నదితో పాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును న్యూదిల్లీ నిలిపివేసింది. ఇది దాయాదికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది ఈ ఒప్పందం నిలిపివేత పాకిస్థాన్‌ను ఎండబెట్టే అవకాశాలున్నాయి. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపై ఆధారపడింది. అక్కడ వ్యవసాయానికి వాడే నీటిలో 80శాతం ఈ ఒప్పందం కింద లభించేదే. పాకిస్థాన్ జీడీపీలో 25శాతం ఈ నదుల నుంచే లభిస్తోందంటే.. భారత నిర్ణయం ఆ దేశాన్ని భవిష్యత్తులో ఎలా ప్రభావితం చేయనుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు

# ఘనంగా పంద్రాగస్ట్ వేడుకల నిర్వహణ

- **గోల్కొండ కోటలో పకడ్బందీగా ఏర్పాట్లు**
- **అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు**




**హైదరాబాద్, జూలై30 (జనంసాక్షి) :** పంద్రాగస్ట్ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సీనియర్ అధికారులతో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళులు అర్పించనున్నారని, అనంతరం చారిత్రాత్మక గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారని, అందుకు కావాల్సిన ఏర్పాట్లపై అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని, ఈ కార్యక్రమానికి ప్రముఖులు హాజరవుతున్న సందర్భంగా తగిన భద్రత ఏర్పాట్లు-, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా తెలంగాణ శాసనసభ, హైకోర్టు, రాజ్ భవన్, సచివాలయం, తెలంగాణ తల్లి విగ్రహాలు వంటి ప్రముఖ ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలో జరిగే అధికారిక వేడుకల్లో భాగంగా రాష్ట్ర వారసత్వం, దేశభక్తిని ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సాంస్కృతిక శాఖను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను దృష్టి పెట్టు-కొని అందుకు అవసరమైన అగ్నిమాపక భద్రతా సిబ్బంది, అగ్నిమాపక పరికరాలను అందుబాటు-లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించారు.దినోత్సవ వేడుకలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల గౌరవం మరియు వైభవాన్ని కాపాడటానికి ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సమాచారశాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## ఈడి అదుపులో మాజీ మంత్రి
# తలసాని ఓఎస్‌డీ కళ్యాణ్

- **సోదాల్లో భారీగా నగదు పట్టివేత**





**హైదరాబాద్, జూలై 30 (జనంసాక్షి) :** మాజీ మంత్రి తలసాని ఓఎస్‌డీ కళ్యాణ్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంది. కళ్యాణ్ ఇంట్లో సోదాలు అనంతరం నేరుగా ఈడీ కార్యాలయానికి తీసుకొచ్చారు. పశుసంవర్థక శాఖ మాజీ డైరెక్టర్ రామచందర్ నాయక్, కాంట్రాక్టర్ మొయినుద్దీన్ తోకలిసి అక్రమాలకు పాల్పడినట్లు తేల్చారు. రూ. 700 కోట్లు స్కామ్ జరగడంతో మనీ లాండరింగ్ కోణంలో విచారణ చేస్తున్నారు. ఈడీ కార్యాలయంలో కళ్యాణ్‌ను ప్రస్తుతం విచారిస్తున్నారు. మాజీ మంత్రి తలసాని ఓఎస్‌డీ కళ్యాణ్ ఇంట్లో ఈడీ సోదాలు కొనసాగాయి. కళ్యాణ్ ఇంట్లో భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు.. నగదు లెక్కింపు మెషిన్లు తీసుకెళ్లిన ఈడీ అధికారులు లెక్కింపు చేపడుతున్నారు.. నగదుతో పాటు పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. 2015లో అప్పటి ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ప్రజలకు సుమారు రూ.4,000 కోట్ల విలువైన గొర్రెలను పంపిణీ చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అయితే, ఈ పథకాన్ని అమలు చేయడంలో ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నట్లు అవినీతి నిరోధక శా తన దర్యాప్తులో గుర్తించింది. గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించిన తొలినాళ్ల నుంచే కొంతమంది అధికారులు, మధ్యవర్తులు కలిసి ప్రభుత్వ నిధులను దారి మళ్లించినట్లు సమాచారం. అసలు లబ్ధిదారులకు నిధులు అందకుండా బినామీ ఖాతాల్లోకి చేరినట్టు ఆధారాలు లభించాయి. కొంతమంది విక్రేతలకు డబ్బులు చెల్లించినట్లు రికార్డుల్లో చూపించి ఆ మొత్తాన్ని అంతా కలిసి వాటాలు పంచుకున్నట్లు ఏసీబీ దర్యాప్తులో తేలింది.

# తహాఫుజ్ ఖత్మే నబువ్వత్ ఆధ్యాత్మిక సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

**హుజురాబాద్‌లో ఒక రోజు వర్క్ షాప్ ను విజయవంతం చేయండి**

**తహాఫుజ్ ఖత్మే నబువ్వత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ పిలుపు**



**కరీంనగర్, జూలై 30 (జనంసాక్షి) :** మజ్లీస్ తహాఫుజ్ ఖత్మే నబువ్వత్ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 9,10వ తేదీల్లో నిర్వహించే ఒక రోజు ఆధ్యాత్మిక సదస్సు (క్రియాశీలక వర్క్ షాపును) విజయవంతం చేయాలని తహాఫుజ్ ఖత్మే నబువ్వత్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మోహియోద్దీన్ ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. హుజురాబాద్ పట్టణంలోని జామియా మస్జిద్ ఆవరణలో ఈఆధ్యాత్మిక సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువతను ఇస్లాం నుంచి తప్పుదారి పట్టించి, ముస్లిం విద్యావంతులను ప్రలోభాల గురిచేసే ఇస్లాం వ్యతిరేక వర్గాల నుంచి మేల్కొకొలపడనికి, ముస్లిం సమాజాన్ని అప్రమత్తం చేయడానికి, ఈమాన్ విశ్వాసాన్ని సురక్షితంగా ఉంచడానికి ఈ వర్క్ షాపు ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఇస్లాంలో ప్రవక్తల పరంపర ముగింపు..ముస్లిం యువత మేలుకొలుపు అనే అంశంపై వర్క్‌షాప్ ను, ఆగస్టు 9వ తేదీ శనివారం సాయంత్రం అసర్ నమాజ్ నుంచి మొదలై ఆగస్టు10వ తేదీ ఆదివారం ఇషా నమాజ్ వరకు కార్యక్రమం హుజురాబాద్ జామియా మస్జిద్ లో నిర్వహించబడుతుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో, ప్రస్తుత యుగంలో విశ్వాసాన్ని ప్రేరేపించే ప్రలోభాలు తలెత్తుతున్నాయని, ముఖ్యంగా ఫిత్నా ఖాదియానీ, ఫిత్నా షకిలిత్, ఫిత్నా ఫయాజిత్, ఫిత్నా గోహర్ షాహి, ఫిత్నా ముంకరీన్ హదీస్, ఫిత్నా ఇంజనీర్ మహమ్మద్ అలీ మీర్జా అనే వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా, ప్రస్తుత సమాజంలో ఇస్లాం పేరుమీద చేస్తున్న ఇస్లాం వ్యతిరేక దురాఘతాలను ముస్లిం సమాజానికి, యువతకు, విద్యావంతులకు కూలంకషంగా వివరించడానికి ఈ వర్క్ షాపును ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణా, ఆంధ్ర రాష్ట్రాల్లో మతభ్రష్టత్వం గురించి మాట్లాడే ప్రముఖ పండితులు ఈ మతభ్రష్ట ప్రలోభాల నుండి తమ విశ్వాసాన్ని ముస్లింలు ఎలా కాపాడుకోవాలో పూర్తిస్థాయిలో వివరిస్తారన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండవసారి హుజురాబాద్ వేదికగా ఈబృహత్తర అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముఫ్తీ ఘియాస్ తెలిపారు. ముస్లింల విశ్వాసాలను రక్షించడం, ప్రలోభాలకు గురై ఈమాన్ నుంచి ముస్లింలు ఏవిధంగా వైదొలుగుతున్నారో.. ప్రజలకు తెలియజేయడం ఈ వర్క్ షాప్ ముఖ్యఉద్దేశ మన్నారు. మజ్లిస్ తహాఫుజ్ ఖత్మే నబువ్వత్ కరీంనగర్ కమిటీ, ముస్లిం సోదరులందరూ, ముఖ్యంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని జమ్మికుంట, హుజురాబాద్, వీనవంక, చల్లూర్, శంకరపట్నం, ఎల్కతుర్తి, ఇల్లందకుంట, సైదాపూర్, చిగురుమామిడి హుస్నాబాద్ ప్రాంత ముస్లిం ఉపాధ్యాయులు, విద్యావంతులైన యువకులు, ఐటి, ప్రభుత్వ ఉద్యోగులు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు, వైద్యులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తలు, మీ విశ్వాసం, ప్రస్తుత, భవిష్యత్ తరాల ఈమాన్ ను, ఇస్లాంను పరిరక్షించే ఈ బృహత్తర యజ్ఞంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు హాఫిజ్ అహ్మద్ హిఫ్జి, కలీమ్ షరీఫ్, అబ్దుల్ రాఫె, తౌహీద్, మౌలాన షేక్ నయిమ్ హుస్సామి ముఫ్తి షాకిరోద్దీన్, హాఫిజ్ ఇమ్రాన్ బేగ్, హాఫిజ్ ఫహీం, మౌలాన సోహెల్, మౌలాన నజీర్ ఖురేషి, మౌల్వీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# హౌజింగ్ బోర్డులో భూములు బంగారమే

**ఎకరాకు రూ.65.34 కోట్లు పలికిన వేలం ధర**



**హైదరాబాద్, జూలై30 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ మరోమారు వార్తల్లోకి ఎక్కింది. గతంలో ఇక్కడ ఏకంగా రెండు లక్షల వరకు గజం వేలంలో అమ్ముడయ్యింది. తాజాగా ఓపెన్ ప్లాట్ల ధర రికార్డు సృష్టించింది. కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్‌లోని వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎకరా స్థలాన్ని రూ.65.34 కోట్లకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెన్సీ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు ఆన్‌లైన్ వేలం ద్వారా కొనుగోలు చేశారు. హౌసింగ్ బోర్డు అధికారులు బుధవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో 11 బిడ్లు దాఖలయ్యాయి. నలుగురు బిడ్డర్లు వేలం ప్రక్రియలో పాల్గొన్నారని హౌసింగ్ బోర్డు వైస్‌ఛైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. మరోవైపు హైదరాబాద్ పరిసరాల్లోని రాజీవ్ స్వగృహ గేటెడ్ కమ్యూనిటీల్లోని ఫ్లాట్ల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.26కోట్ల ఆదాయం వచ్చిందని హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు.

## శంషాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

**హైదరాబాద్, జూలై30 (జనంసాక్షి) :** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.40 కోట్ల విలువైన హైడ్రోఫోనిక్ గంజాయిని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు పట్టు-కున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలి వద్ద 40 కిలోల గంజాయి ఉన్నట్లు- అధికారులు గుర్తించారు. దీంతో ఆమెను అదుపులోకి తీసుకొని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి భారత్‌లోని వివిధ ప్రాంతాలకు నేరుగా విమాన సర్వీసులున్నా.. అనుమానం రాకుండా ఉండేందుకు ఆమె బ్యాంకాక్ నుంచి దుబాయ్ మీదుగా భారత్‌కు వచ్చినట్లు- అధికారులు తెలిపారు. దీనిపై అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# స్కూల్ గేట్ వద్ద విద్యార్థిని కిడ్నాప్..



**లక్నో (జనంసాక్షి) :** స్కూల్‌కు వచ్చిన విద్యార్థినిని ఒక వ్యక్తి గేటు వద్ద అడ్డుకున్నాడు. ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించి కిడ్నాప్ చేశాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో కొన్ని గంటల్లోనే నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఉదయం 6.45 గంటలకు సెక్టార్ 53లోని గిజోడ్ ప్రాంతంలో ఉన్న మదర్ థెరిసా స్కూల్ వద్దకు కొంత మంది బాలికలు చేరుకున్నారు. కాగా, ఆ స్కూల్ గేటు బయట ఒక వ్యక్తి కారుతో ఉన్నాడు. అక్కడకు చేరుకున్న ఒక బాలికను అతడు అడ్డుకున్నాడు. ఆమెతో మాట్లాడిన ఆ వ్యక్తి బలవంతంగా కారులోకి ఎక్కించాడు. అక్కడి నుంచి కారులో తీసుకెళ్లి కిడ్నాప్ చేశాడు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించారు. ఆ స్కూల్ వద్ద ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. కారు నంబర్ ఆధారంగా కొన్ని గంటల్లోనే బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఆ కారును స్వాధీనం చేసుకున్నారు. స్కూల్ బాలికను ఆ వ్యక్తి ఎందుకు కిడ్నాప్ చేశాడు అన్నది దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



## రాజనర్సక్కకు నివాళులర్పించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**రామకృష్ణాపూర్, జులై 30 (జనంసాక్షి):** ఇటీవల అనారోగ్యంతో మరణించిన విప్లవ నాయకురాలు కంది రాజనర్సక్కకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నివాళులర్పించారు. బుధవారం ఆమె నివాసంలో చిత్ర పటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సింగరేణి కార్మిక ఉద్యమాలతో పాటు రైతాంగ ఉద్యమాల్లో పాల్గొని అటు కార్మికులను, ఇటు రైతులను చైతన్యం చేసిన వీరనారి అని ఆయన కొనియాడారు. 1980 దశకంలో భర్త రాజరత్నంతో కలిసి నక్సలైట్ ఉద్యమ బాట పట్టి జీవితమంతా ప్రజా పోరాటాలకు అంకితం చేసిన ఘనత రాజనర్సక్క కుటుంబం దన్నారు. ప్రజా సమస్యలే పరిష్కార దిశగా సాహసవంతమైన ఉద్యమాలను చేసిన వీరనారికి జోహార్లు చెప్పారు.

# పోస్టుమార్టం గదిని వినియోగంలోకి తీసుకురావాలి

**ఆస్పత్రిలో సీపీఎం ఆందోళన**




**పాలకుర్తి, జూలై 30(జనంసాక్షి) :** గతంలో ప్రారంభించిన పోస్టుమార్టం గదిని వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కమిటీ బుధవారం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్గం గది ఎదుట ఆందోళన చేసింది. ఈ సందర్భంగా అ పార్టీ మండల కార్యదర్శి మాచెర్ల సారయ్య, చిట్యాల సోమన్న మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్మించిన పోసుమారం గదిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు ప్రారంభించారని దానిని వినియోగం లోకి రాసుకురావడంలో విఫలం అయ్యారని అన్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పోస్టుమార్టం గదిని వినియోగంలోకి తీసుకువచ్చి ఈ ప్రాంత ప్రజలకు భారం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమ సత్యం, ఏదునూరి మదార్, మాసంపల్లి నాగయ్య ఉన్నారు.

# శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయ అభివృద్ధి పనుల పరిశీలన



**ములుగు ప్రతినిధి/తాడ్వాయి, జులై 30(జనంసాక్షి) :** శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం ఎస్-ఎస్ తాడ్వాయి మండలంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం లో జరుగుతున్న షేడ్ నిర్మాణ పనులను, క్యూలైన్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2026 మహా మేడారం జాతర కు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు వెడల్పు, గద్దెల ప్రాంగణంలో క్యూలైన్లు మార్పులు చేర్పుల ఏర్పాట్లు, మాస్టర్ ప్లాన్ పై ఎండోమెంట్, పోలీస్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, పూజారుల తో కలెక్టర్ చర్చించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తాడ్వాయి పరిధిలోని మేడారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్య సిబ్బందితో మాట్లాడుతూ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తతతో ఉండి, మలేరియా డెంగ్యూ వ్యాధులను నియంత్రించాలని, ఫీవర్ సర్వే చేయాలని, ఇంటింటి సందర్శనలో దోమల లార్వాను కలిగిన నీటిని తొలగించాలని, ప్రతి జరపీడుతులకు మలేరియా డెంగ్యూ ఆర్డిటి రక్త పరీక్షలు చేయాలని ఆరోగ్య సిబ్బందినీ ఆదేశించారు. ఉచిత వైద్య శిబిరానికి వచ్చి వైద్య సేవలు తీసుకున్న వారి వివరాలను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సేవలను అందించి ప్రజల మన్ననలను పొందాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, ఎండోమెంట్ ఈవో వీరస్వామి, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, సమ్మక్క సారలమ్మ గోవిందరాజు పగిడిద్దరాజు పూజారులు, ఎంసిహెచ్ టీం డాక్టర్ కీర్తి, స్టాఫ్ నర్స్ మమత, సూపర్వైజర్ సరస్వతి ఆరోగ్య కార్యకర్త రాజ్యలక్ష్మి తిరుపతయ్య, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అప్పల కోసం భూమి అమ్మేందుకు యత్నం

**ఆగ్రహించి తండ్రిపై కత్తితో దాడి చేసిన కొడుకు**



**జగిత్యాల, జూలై30 (జనంసాక్షి) :** కర్కోటకుడిగా మారిన కొడుకు కన్న తండ్రినే దారుణంగా పొడిచేశాడు. 10 గుంటల భూమి కోసం ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో దారుణం చోటు- చేసుకుంది.. 10 గుంటల భూమి కోసం ఓ తనయుడు తండ్రిని కత్తితో పొడిచాడు. మండల కేంద్రానికి చెందిన లక్ష్మీనర్సయ్యకు ఇద్దరు కూతుళ్లు ఒక కుమారుడు. చిన్న కూతురు వివాహానికి చేసిన అప్పులు తీరక పోవడంతో 10 గుంటల భూమిని అమ్మేందుకు ఆ తండ్రి సిద్ధమయ్యాడు. భూమి అమ్ముతున్నాడని రాజేందర్ తండ్రిపై కోపం పెంచుకున్నాడు. స్నేహితుడితో కలిసి తండ్రి లక్ష్మీనర్సయ్యపై గత రాత్రి కత్తులతో దాడి చేశాడు. లక్ష్మీనర్సయ్యకు కడుపులో 8 చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నర్సయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# భారత్‌పై అమెరికా ట్యాక్స్‌వార్

**మన దేశ వస్తువులపై 25 శాతం టారీఫ్‌ల విధింపు**

**నేటి అమల్లోకి రానున్నట్లు ప్రకటించిన ట్రంప్**

**ఉక్రెయిన్‌పై రష్యా దాడులను ప్రపంచమంతా ఖండిస్తోంది**

**కానీ భారత్ మాత్రం ఆ దేశం నుంచి చమురు దిగుమతి చేసుకుంటోంది**

**అందుకే సుంకాలకు అదనంగా పెనాల్టీ కూడా విధిస్తున్నాం: అమెరికా అధ్యక్షుడు**



భారత్ మిత్రదేశమే అయినా.. సుంకాలు ఎక్కువగా ఉన్నందున వారితో పరిమిత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్నాం. వారితో పరిమిత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్నాం. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. ఏ దేశంలో లేని విధంగా వాణిజ్యపరంగా అక్కడ అడ్డంకులున్నాయి. రష్యా నుంచి భారీ స్థాయిలో సైనిక ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్‌పై దాడులను ప్రపంచమంతా ఖండిస్తోంది. భారత్, చైనాలు మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటు-న్నాయి. అందుకే భారత్‌పై 25శాతం సుంకాలు అదనంగా పెనాల్టీ కూడా విధిస్తున్నాం. ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్నాయని 'ట్రూత్ సోషల్' వేదికగా ప్రకటించారు. ఇటీవల భారత్ సహా పలు దేశాలపై ప్రతీకార సుంకాలు ప్రకటించిన ట్రంప్.. ఆగస్టు 1ని డెడ్‌లైన్‌గా విధించిన విషయం తెలిసిందే. వీటికి సంబంధించి ఏప్రిల్‌లోనే ప్రకటన చేసినప్పటికీ.. చర్చల కోసం వీటి అమలుకు గడువు ఇచ్చారు. ఇక భారత్‌పై సుంకాల విషయంలో ఇటీ-వల స్కాట్లాండ్ పర్యటన సందర్భంగా మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారత్ సుంకాలు విధిస్తోందని, అలా చేయడం తగదన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
31 జూలై 2025

# రాడికల్ హ్యూమనిజం

## సమకాలీన సమాజంలో దాని ఔచిత్యం



రాడికల్ హూమనిజం అనేది మానవ కేంద్రీకృత దృక్పథం, ఇది మానవ స్వేచ్ఛ, వివేకం, సెక్యులర్ నీతి, అలాగే ఆదర్శ సమాజ నిర్మాణంపై దృష్టి సారిస్తుంది. ఈ సిద్ధాంతం మానవుని స్వాతంత్ర్యం, సృజనాత్మకత, జీవిత ఔన్నత్యాన్ని ప్రోత్సహిస్తూ, సమాజంలో న్యాయం, సమానత్వం,సహకార భావాన్ని స్థాపించే లక్ష్యాన్ని కలిగి ఉంటుంది. సమకాలీన సమాజంలో, సామాజిక అసమానతలు, రాజకీయ అస్థిరత, పర్యావరణ సంక్షోభం వంటి సవాళ్ల నేపథ్యంలో, రాడికల్ హ్యూమనిజం ఒక ప్రత్యామ్నాయ దృష్టికోణాన్ని అందిస్తుంది.

రాడికల్ హూమనిజంలో స్వేచ్ఛ అనేది మానవ జీవనంలో కేంద్ర బిందువు. ఇది కేవలం బాహ్య నిర్బంధాల నుండి విముక్తి మాత్రమే కాదు, వ్యక్తి తన సృజనాత్మక సామర్థ్యాలను, ఆలోచనలను, ఆకాంక్షలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే స్థితిని కూడా సూచిస్తుంది. స్వేచ్ఛ అనేది వ్యక్తి యొక్క ఆత్మగౌరవాన్ని, స్వయం నిర్ణయాన్ని పెంపొందిస్తుంది. సమకాలీన సమాజంలో, రాజకీయ అణచివేత, సామాజిక నియంత్రణలు, మరియు ఆర్థిక అసమానతలు స్వేచ్ఛను అడ్డుకుంటాయి. రాడికల్ హూమనిజం ఈ అడ్డంకులను తొలగించి, ప్రతి వ్యక్తికి సమాన అవకాశాలను కల్పించే సమాజాన్ని ఆకాంక్షిస్తుంది.

### మానవ వివేకం: మూలాలు - విలువ:

మానవ వివేకం రాడికల్ హూమనిజం యొక్క మూలస్తంభం. ఇది మానవుని ఆలోచనా సామర్థ్యం, విమర్శనాత్మక దృష్టి, సమస్యలను పరిష్కరించే సామర్థ్యంపై ఆధారపడుతుంది. వివేకం మానవుని స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని, సామాజిక సమస్యలను అర్థం చేసుకునే జ్ఞానాన్ని అందిస్తుంది. సమకాలీన సమాజంలో,దురాశ, అజ్ఞానం, మరియు సమాచార అతిభారం వివేకాన్ని దెబ్బతీస్తున్నాయి. రాడికల్ హూమనిజం వివేకాన్ని పెంపొందించడానికి విద్య, స్వతంత్ర ఆలోచన, మరియు సామాజిక సంభాషణలను ప్రోత్సహిస్తుంది.

రాడికల్ హూమనిజం సెక్యులర్ నీతిని ఒక మార్గదర్శిగా పరిగణిస్తుంది. ఇది మతపరమైన లేదా ఆధ్యాత్మిక ఆధారాల నుండి స్వతంత్రంగా, మానవ సంక్షేమం, న్యాయం, మరియు సమానత్వంపై ఆధారపడిన నీతి విలువలను స్థాపిస్తుంది. సమకాలీన సమాజంలో, మతపరమైన చీలికలు రాజకీయ ధ్రువీకరణ సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తున్నాయి. సెక్యులర్ నీతి, మానవ హక్కులు, సామాజిక న్యాయం, అలాగే సమానత్వంపై దృష్టి సారించడం ద్వారా ఈ సమస్యలను పరిష్కరించే మార్గాన్ని అందిస్తుంది.

రాడికల్ హూమనిజం జీవిత ఔన్నత్యాన్ని, అంటే, మానవ జీవనం యొక్క అర్థవంతమైన మరియు సంతృప్తికరమైన జీవనాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది వ్యక్తి యొక్క సృజనాత్మకత, సామాజిక సంబంధాలు, ఆనందాన్ని పెంపొందిస్తుంది. సమకాలీన సమాజంలో, ఆర్థిక ఒత్తిడి, మానసిక ఒత్తిడి, సామాజిక ఒంటరితనం జీవిత ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నాయి. రాడికల్ హూమనిజం, సమాజంలో సామూహిక సంక్షేమం అలాగే వ్యక్తిగత సంతోషం మధ్య సమతుల్యతను సాధించే లక్ష్యాన్ని కలిగి ఉంటుంది.

### ఆదర్శ సమాజం - అవశ్యకతలు:

ఆదర్శ సమాజం అనేది సమానత్వం, న్యాయం, మరియు సహకారంపై ఆధారపడిన సమాజం. రాడికల్ హూమనిజం ప్రకారం, ఇటువంటి సమాజం నిర్మాణానికి విద్య, సామాజిక న్యాయం, మరియు స్వేచ్ఛాయుత వాతావరణం అవసరం. సమకాలీన సమాజంలో, అసమాన ఆర్థిక వ్యవస్థలు, అసమర్థ రాజకీయ వ్యవస్థలు, సామాజిక అసమానతలు ఆదర్శ సమాజ నిర్మాణానికి అడ్డంకులుగా ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, రాడికల్ హూమనిజం సామాజిక సంస్కరణలను, సమాన అవకాశాలను, సహకార ఆర్థిక విధానాలను ప్రోత్సహిస్తుంది.

### నిర్మాణాత్మక ప్రజాస్వామ్యం:

రాడికల్ హూమనిజం నిర్మాణాత్మక ప్రజాస్వామ్యాన్ని సమర్థిస్తుంది, ఇది ప్రజల భాగస్వామ్యంపై ఆధారపడిన రాజకీయ వ్యవస్థ. ఇది కేవలం ఓటు హక్కును మాత్రమే కాకుండా, ప్రజలు నిర్ణయాధికారంలో పాలుపంచుకునే వ్యవస్థను కోరుకుంటుంది. సమకాలీన సమాజంలో, రాజకీయ అవినీతి, అధికార కేంద్రీకరణ, ప్రజాస్వామ్య సంస్థల బలహీనత వంటి సమస్యలు నిర్మాణాత్మక ప్రజాస్వామ్యాన్ని సవాలు చేస్తున్నాయి. రాడికల్ హూమనిజం ఈ సమస్యలను పరిష్కరించడానికి వికేంద్రీకృత నిర్ణయాధికారం మరియు పారదర్శక రాజకీయ వ్యవస్థను సూచిస్తుంది.

### సహకార ఆర్థిక విధానం, వికేంద్రీకృత ప్రణాళిక:

రాడికల్ హూమనిజం సహకార ఆర్థిక విధానాన్ని సమర్థిస్తుంది, ఇది సామాజిక సంక్షేమం, సమానత్వంపై ఆధారపడుతుంది. వికేంద్రీకృ త ప్రణాళిక ద్వారా, స్థానిక సమాజాలు తమ ఆర్థిక అవసరాలను స్వయంగా నిర్ణయించుకునే అవకాశం కల్పిస్తుంది. సమకాలీన సమాజంలో, ఆర్థిక అసమానతలు మరియు పెట్టుబడిదారీ విధానాలు సామాజిక అసంతృప్తిని పెంచుతున్నాయి. సహకార ఆర్థిక విధానం ద్వారా, రాడికల్ హూమనిజం స్థానిక సమాజాలకు అధికారాన్ని అందించడం ద్వారా సమతుల్య ఆర్థిక వ్యవస్థను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

### సమకాలీన సమాజంలో ఔచిత్యం:


సమకాలీన సమాజంలో, రాడికల్ హూమనిజం ఒక ప్రత్యామ్నాయ దృష్టికోణాన్ని అందిస్తుంది. ప్రపంచీకరణ, టెక్నాలజీ పురోగతి, మరియు సామాజిక అసమానతలు సమాజాన్ని సంక్లిష్టంగా మార్చాయి. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి, రాడికల్ హూమనిజం మానవ స్వేచ్ఛ, వివేకం, మరియు సహకారంపై ఆధారపడిన సమాజ నిర్మాణాన్ని సూచిస్తుంది. ఇది వ్యక్తి మరియు సమాజం మధ్య సమతుల్యతను సాధించడం ద్వారా, న్యాయమైన, సమాన, మరియు ఆదర్శవంతమైన సమాజాన్ని సృష్టించే మార్గాన్ని చూపిస్తుంది. రాడికల్ హూమనిజం మానవ కేంద్రీకృత సిద్ధాంతంగా, స్వేచ్ఛ, వివేకం, సెక్యులర్ నీతి, మరియు సహకార ఆర్థిక విధానాల ద్వారా సమకాలీన సమాజ సవాళ్లను పరిష్కరించే దిశగా మార్గనిర్దేశం చేస్తుంది. ఇది నిర్మాణాత్మక ప్రజాస్వామ్యం మరియు వికేంద్రీకృత ప్రణాళిక ద్వారా ఆదర్శ సమాజ నిర్మాణానికి దోహదపడుతుంది.

సమకాలీన సమాజంలో, ఈ సిద్ధాంతం ఒక సమతుల్య, న్యాయమైన, మరియు మానవ కేంద్రీకృత భవిష్యత్తును సృష్టించడానికి అవసరమైన దిశానిర్దేశాన్ని అందిస్తుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# భారతీయ విద్యా రంగానికి.. డా.జాకీర్ హుస్సేన్ సేవలు



***డాక్టర్ జాకీర్ హుస్సేన్ (1897-1969) భారతదేశ చరిత్రలో ఒక అసాధారణ వ్యక్తిత్వం గల విద్యావేత్త. రాజకీయ నాయకుడు. భారత రాష్ట్రపతిగా గుర్తింపు పొందిన వ్యక్తి. ఆయన జీవితం,రచనలు, రాజకీయ ప్రస్థానం అలాగే ఆయన విద్యా రంగంలో చేసిన కృషి భారతదేశ ఆధునికీకరణలో కీలక పాత్ర పోషించాయి. ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చి, భారత రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన జాకీర్ హుస్సేన్ జీవితం స్ఫూర్తిదాయకం.***

1897 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో జన్మించిన జాకీర్ హుస్సేన్, పష్టున్ కుటుంబంలో పుట్టారు. ఆయన తండ్రి ఫిరోజ్ ఖాన్ ఒక వైద్యుడు. ఆయన తల్లి నజీన్ బేగం గృహిణి. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన జాకీర్, కష్టాల మధ్య పెరిగారు. అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంలో (ఏ.ఎం.యు.) విద్యాభ్యాసం చేసి, ఆ తర్వాత బెర్లిన్ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. ఈ విదేశీ విద్య ఆయన ఆలోచనలను విస్తృతం చేసింది. భారతదేశంలో విద్యా సంస్కరణలపై ఆయన దృష్టి సారించడానికి దోహదపడింది.

జాకీర్ హుస్సేన్ జీవితంలో స్వాతంత్ర్య సమరం కీలక భాగం. గాంధీజీ యొక్క అహింసా సిద్ధాంతాల నుండి స్ఫూర్తి పొందిన ఆయన, జాతీయవాద ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఆయన సామాజిక సమానత్వం, మత సౌహార్దం, విద్య ద్వారా దేశాభివృద్ధి అనే సిద్ధాంతాలకు కట్టుబడి జీవించారు.

డాక్టర్ జాకీర్ హుస్సేన్ రచనలు- విద్య సామాజిక సంస్కరణలపై దృష్టి:
డాక్టర్ జాకీర్ హుస్సేన్ రచనలు ప్రధానంగా విద్య, సామాజిక సంస్కరణలు, ఆర్థిక అభివృద్ధిపై కేంద్రీకృతమై ఉన్నాయి. ఆయన రచనలలో "దీ డైనమిక్ యూనివర్సిటీ" "ఎడ్యుకేషన్ అండ్ ద నేషన్" వంటి గ్రంథాలు ప్రముఖమైనవి. ఈ రచనలలో ఆయన విద్యను ఒక సామాజిక పరివర్తన సాధనంగా చూపారు. ఆయన అభిప్రాయం ప్రకారం, విద్య అనేది కేవలం జ్ఞానాన్ని అందించడం కాదు, సమాజంలో సమానత్వం, నైతిక విలువలు, జాతీయ ఐక్యతను పెంపొందించే సాధనం.

ఆయన రచనలలో భారతీయ సంస్కృతి ఆధునిక విద్యను సమన్వయం చేయడంపై ప్రత్యేక దృష్టిని నిల్పింది. ఆయన తన రచనల ద్వారా, విద్యా సంస్థలు స్వాతంత్ర్య ఆలోచనలను ప్రోత్సహించాలని, అదే సమయంలో సాంస్కృతిక విలువలను కాపాడాలని వాదించారు. ఈ రచనలు ఆ కాలంలో విద్యా సంస్థలకు మార్గదర్శకంగా నిలిచాయి.

### డాక్టర్.జాకీర్ హుస్సేన్ రాజకీయ ప్రస్థానం:

జాకీర్ హుస్సేన్ రాజకీయ ప్రస్థానం విద్యా రంగంలో ఆయన సేవలతో ముడిపడి ఉంది. 1920లో జామియా మిలియా ఇస్లామియా స్థాపనలో కీలక పాత్ర పోషించిన ఆయన, 1926 నుండి 1948 వరకు దాని వైస్-ఛాన్సలర్ గా పనిచేశారు. స్వాతంత్ర్యం సిద్ధి తర్వాత, ఆయన అలీగఢ్ ముస్లిం విశ్వ విద్యాలయం వైస్-ఛాన్సలర్‌గా (1948-1956) బాధ్యతలు నిర్వహిం చారు. ఈ సమయంలో ఆయన విద్యా సంస్థలను ఆధునికీకరించ డంలోనూ, విద్యార్థులలో జాతీయవాద భావనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారు. 1957లో ఆయన బీహార్ గవర్నర్‌గా నియమితులయ్యారు. 1962లో భారత ఉప-రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 1967లో ఆయన భారత రాష్ట్రపతిగా ఎన్నికై, ఆ స్థానంలో మొదటి ముస్లిం రాష్ట్రపతిగా చరిత్ర సృష్టించారు. రాష్ట్రపతిగా ఆయన కార్యకాలంలో, ఆయన రాజ్యాంగ విలువల ను గౌరవిస్తూ, రాజకీయ ఒత్తిడులకు లొంగకుండా నిర్ణయాలు తీసుకున్నా రు. ఆయన రాజకీయ ప్రస్థానం, సామాజిక సమానత్వం, జాతీయ ఐక్యతకు కట్టుబడిన ఒక నాయకుడి స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది.

### విద్యా రంగంపై డాక్టర్ జాకీర్ హుస్సేన్ భావాలు:

డాక్టర్ జాకీర్ హుస్సేన్ విద్యను "ఒక దేశం అనే భవన నిర్మాణానికి పునాదిగా" భావించారు. ఆయన అభిప్రాయం ప్రకారం, విద్య అనేది కేవలం వృత్తిపరమైన నైపుణ్యాలను అందించడం మాత్రమే కాదు. మానవత్వం, నైతికత, అలాగే సామాజిక బాధ్యతను నేర్పించే సాధనం. ఆయన భారతీయ విద్యా వ్యవస్థలో సాంస్కృతిక విలువలను సమగ్రపరచడం, ఆధునిక శాస్త్రీయ జ్ఞానాన్ని అందించడం మధ్య సమతుల్యతను సాధించాలని వాదించారు. ఆయన జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో అమలు చేసిన విద్యా విధానాలు, విద్యార్థులలో స్వాతంత్ర్య ఆలోచనలను ప్రోత్సహించడంతో పాటు, జాతీయవాద భావనలను పెంపొందించాయి. ఆయన విద్యా సంస్థలు సమాజంలోని అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండాలని, విద్య ద్వారా సామాజిక అసమానతలను తొలగించవచ్చని గట్టిగా నమ్మారు. ఈ ఆలోచ నలు ఆ కాలంలో విప్లవాత్మకమైనవి. ఈ రోజు కూడా ఆదర్శవంతమైనవి.

భారత విద్యా రంగానికి చేసిన సేవలు :
డాక్టర్ జాకీర్ హుస్సేన్ భారత విద్యా రంగానికి అందించిన సేవలు అపారమైనవి. జామియా మిలియా ఇస్లామియా స్థాపన, దాని అభివృద్ధికి ఆయన అత్యంత ముఖ్యమైన సహకారం అందించారు. ఈ విశ్వవిద్యాల యం, స్వాతంత్ర్య సమరంలో భాగంగా స్థాపించబడినప్పటికీ, ఆయన నాయకత్వంలో ఒక ప్రముఖ విద్యా సంస్థగా రూపొందింది. ఆయన అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంలో వైస్-ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో, ఆ సంస్థలో ఆధునిక విద్యా పద్ధతులను ప్రవేశపెట్టి, విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించారు.

ఆయన రాష్ట్రపతిగా ఉన్న సమయంలో, విద్యా సంస్కరణలను ప్రోత్సహించ డానికి అనేక కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన నాయకత్వంలో, భారత విద్యా వ్యవస్థలో సమగ్రత మరియు బహుముఖ విద్యను ప్రోత్సహించే ప్రయత్నాలు జరిగాయి. ఆయన సేవలకు గుర్తింపుగా, 1963లో ఆయనకు భారతరత్న పురస్కారం లభించింది. ఇది ఆయన విద్యా రంగంలో చేసిన కృషికి ఒక నిదర్శనం.

డాక్టర్ జాకీర్ హుస్సేన్ జీవితం ఒక సామాన్య వ్యక్తి అసాధారణ లక్ష్యాలను సాధించగలడని నిరూపించే సజీవ సాక్ష్యం. ఆయన రచనలు, రాజకీయ ప్రస్థానం,విద్యా రంగంలో చేసిన సేవలు భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి. విద్య ద్వారా సామాజిక పరివర్తన సాధ్యమని నమ్మిన ఆయన, జామియా మిలియా ఇస్లామియా మరియు అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం వంటి సంస్థల ద్వారా తన ఆలోచనలను ఆచరణలో పెట్టారు. ఆయన జాతీయవాదం, మత సౌహార్దం, విద్యా సంస్కరణల పట్ల కట్టుబడిన జీవితం ఈ రోజు కూడా యువతకు స్ఫూర్తిదాయకం. భారత విద్యా రంగంలో ఆయన అందించిన సేవలు ఒక దీపస్తంభంగా నిలిచి, భవిష్యత్ తరాలకు మార్గదర్శనం చేస్తాయి.

దండెబోయిన అశోక్ యాదవ్,
గెజిటెడ్ హెడ్మాస్టర్, పెద్దమడూర్,
జనగాం. 9440521990.

# ఆపరేషన్ సిందూర్!?




2025 జులై 29న భారత పార్లమెంటు వర్షకాల సమావేశాల సందర్భంగా, పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అంశా లపై లోక్‌సభ, రాజ్యసభలోనూ తీవ్ర చర్చ జరిగింది. విపక్షా లు, ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియా ంకా గాంధీ వాద్రా, మల్లికార్జున్ ఖర్గే, ఇతర ప్రతిపక్ష నాయకు లు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని పలు కీలక ప్రశ్నలతో ఇరుకున పెట్టారు. ఈ చర్చలు భారత్-పాకిస్తాన్ సంబంధాలు, చైనా జోక్యం, ట్రంప్ వ్యాఖ్యలు, కేంద్ర ప్రభుత్వం భద్రతా వైఫల్యాల చుట్టూ కేంద్రీకృతమయ్యాయి.

### పహల్గాం ఉగ్రదాడి, భద్రతా లోపాలు:

2025 ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 28 మంది పర్యాటకులు మరణించారు, 20 మందికి పైగా గాయపడ్డారు. ఈ దాడిని ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్), లష్కరే తోయిబాతో అనుబంధం కలిగిన ఉగ్రవాద సంస్థ, బాధ్యత వహించింది. ఈ ఘటన భారత్-పాకిస్తాన్ సంబంధాలలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. పార్లమెంటులో, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా ఈ దాడి ఎలా జరిగిందని ప్రశ్నించారు. "జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకం వృద్ధి చెందుతున్న సమయంలో, ఇంత పెద్ద భద్రతా వైఫల్యం ఎలా సంభవించింది? నిఘా వ్యవస్థలు ఎందుకు విఫలమయ్యా యి?" అని ఆమె నిలదీశారు. ఈ ప్రశ్న భద్రతా ఏర్పాట్లలోని లోపాలను మరియు ప్రభుత్వ బాధ్యతను లేవనెత్తింది.

పహల్గాం దాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులను చేసింది. ఈ ఆపరేషన్‌ను కేంద్ర ప్రభుత్వం విజయవంతమైనదిగా ప్రకటిం చినప్పటికీ, విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దీనిని "ప్రధాన మంత్రి మోదీ యొక్క పీఆర్ వ్యాయామం" గా అభివర్ణించారు. రాహుల్ గాంధీ ఈ ఆపరేషన్ యొక్క పారదర్శకతను ప్రశ్నించారు, "ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళాల చేతులు కట్టివేయబడ్డాయి, దీని వల్ల మనం జెట్‌లను కోల్పోయాము. ఈ ఆపరేషన్‌లో నిజంగా ఏం జరిగింది?" అని అడిగారు. ఈ విమర్శ ఆపరేషన్ యొక్క విజయం, వైమానిక నిర్వహణపై సందేహాలను రేకెత్తించింది.

### ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ నిశ్శబ్దం:

మాజీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణలో తాను మధ్యవర్తిత్వం వహించానని 24 సార్లు పేర్కొన్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభలో ఆరోపించారు. ఖర్గే, "ట్రంప్ అబద్ధం చెప్పాడని మోదీ ఎందుకు స్పష్టంగా చెప్పలేదు?" అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కూడా ఈ అంశాన్ని లేవనెత్తి, "మోదీ ట్రంప్ వాదనలను ఖండించకపోవడం దేశ గౌరవాన్ని ప్రశ్నార్థకం చేస్తుంది" అని విమర్శించారు. ఈ ప్రశ్నలు భారత విదేశాంగ విధానంలో అంతర్జాతీయ జోక్యం కాదా అని ప్రభుత్వాన్ని నిలదీశాయి.

### చైనా జోక్యం - విదేశాంగ విధాన వైఫల్యం:

రాహుల్ గాంధీ భారత విదేశాంగ విధానంపై తీవ్ర విమర్శలు చేశారు. చైనా, పాకిస్తాన్ కు సైనిక సహకారాన్ని అందించిన సందర్భంలో భారత విదేశాంగ విధానం విఫలం చెందటం కాదా అని ప్రశ్నించారు. అతను ఆర్మీ చీఫ్ ఆధారాలను ఉదహరిస్తూ, "చైనా శత్రువుకు (పాకిస్తాన్) సహాయం చేస్తోందని దేశానికి తెలుసు, కానీ మోదీ ఈ విషయంపై నిశ్శబ్దంగా ఉన్నారు" అని విమర్శించారు. ఈ ఆరోపణలు చైనా-పాకిస్తాన్ సహకారం అలాగే భారత విదేశాంగ విధానం యొక్క సమర్థతను ప్రశ్నించాయి.

### ఇతర విపక్ష నాయకుల ప్రశ్నలు:

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పహల్గాం దాడి అలాగే ఆపరేషన్ సిందూర్ గురించి ప్రభుత్వం నుండి వివర ణాత్మక సమాచారం అందించాలని డిమాండ్ చేశారు. రాజ్య సభలో ప్రతిపక్ష నాయకుడు గులాం నబీ ఆజాద్, "కాశ్మీరీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది" అని విమర్శించారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, పహల్గాం దాడి నేపథ్యంలో భారత్-పాకిస్తాన్ దౌత్య సంబంధా లపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రశ్నించారు.

విపక్షాల ప్రశ్నలు భద్రత, విదేశాంగ విధానం, కేంద్ర ప్రభుత్వ బాధ్యత యొక్క మూడు కీలక అంశాలపై దృష్టి సారించాయి. మొదట, పహల్గాం దాడి భద్రతా లోపాలను బహిర్గతం చేసిం ది, దీనిపై ప్రియాంకా గాంధీ సూటిగా ప్రశ్నలు సంధించారు. రెండవది, ఆపరేషన్ సిందూర్‌ను రాహుల్ గాంధీ పీఆర్ వ్యాయామంగా అభివర్ణించడం ద్వారా ప్రభుత్వ చర్యల పారదర్శకతపై సందేహాలను లేవనెత్తారు. మూడవది, ట్రంప్ వ్యాఖ్యలు, చైనా జోక్యంపై మోదీ నిశ్శబ్దం విదేశాంగ విధానం లో బలహీనతలను బయటపెట్టింది. ఈ ప్రశ్నలు బీజేపీ ప్రభుత్వాన్ని రక్షణాత్మక స్థితిలో నిలిపాయి. అయితే, అఖిలపక్ష సమావేశంలో రాహుల్ గాంధీ ప్రభుత్వ చర్యలకు మద్దతు ఇస్తామని హామీ ఇవ్వడం ద్వారా జాతీయ ఐక్యతను కూడా చాటారు. ఈ రోజు పార్లమెంటు చర్చలు భారత రాజకీయా లలో విపక్షాల దూకుడును అలాగే ప్రభుత్వ బాధ్యతను ప్రశ్నించే సామర్థ్యాన్ని ప్రదర్శించాయి. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, ఖర్గే, ఇతర విపక్ష నాయకులు అడిగిన ప్రశ్నలు భద్రతా వైఫల్యాలు, విదేశాంగ విధానం, అంతర్జాతీ య జోక్యంపై ప్రభుత్వ సామర్థ్యం లోపాలను ఎండగట్టాయి. ఈ చర్చలు భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతలు... కేంద్ర ప్రభుత్వం భద్రతా వైఫల్యాల పై సంధించిన పదునైన ప్రశ్నలు దేశవ్యాప్త చర్చను రేకెత్తించాయి. ప్రభుత్వం ఈ ప్రశ్నలకు ఎలా స్పందిస్తుందనేది రాబోయే రోజుల్లో మోదీ సమాధానాలు రాజకీయ దిశను నిర్ణయించవచ్చు.

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

# చదువులు నేర్పిన సంస్కారం ఇదేనా?

దారితప్పిన లోకంలో మానవత్వం కూడా అదృశ్యమైనది. హృదయంలో పెల్లుబికిన ఆవేదనలు మిన్నంటుతున్నాయి. జన్మ ప్రదాతలు దారుణంగా మోసపోతున్నారు.వృద్ధాప్యం వెక్కిరిస్తున్నది. ఆఖరి మజిలీ అత్యంత ఘోరంగా మారుతు న్నది. కన్నవారిని కడదశలో చిన్న పిల్లల్లా చూసుకోవాలనే ఇంగితం నేటి తరం మరచింది.తల్లిదండ్రులను ప్రత్యక్ష దైవాలుగా చూడాలని ప్రవచన కర్తలు ఉద్బోధిస్తారు. అయితే సాటి మనిషిని మనిషిగా చూడలేని వర్తమాన సమా జంలో పాత సామెతలను,ఆర్యోక్తులను కొరగానివిగా భావిస్తున్నారు. కనీసం సొంత వారినే పట్టించుకోలేని నేటి వ్యవస్థను గూర్చి ఎంతగా బాధపడినా ప్రయోజనం శూన్య ం. కనిపెంచిన వారి పట్ల కఠినత్వం ప్రదర్శించడం అమానుషత్వం కాదా? బ్రతికుండగానే చావాలని కోరుకో వడం ఏ చదువు నేర్పిన సంస్కారం? తమ అభివృద్ధికి బాటలు వేసిన తల్లిదండ్రులను,పెద్దలను తృణీకార భావం తో చూడడం మనోక్లేశాన్ని కలిగిస్తున్నది. దారితప్పిన మనుషులు, గాడి తప్పిన చదువులు కేవలం ధనార్జన కోస మే పరుగులు పెట్టే యాంత్రిక యుగాన్ని సృష్టించి, మానవ త్వాన్ని, సంస్కారాన్ని,బాధ్యతను గుదిబండలుగా మార్చేసా యి. తల్లిదండ్రులను భారంగా భావించే నేటి తరం తన పతనాన్ని తానే కొని తెచ్చుకుంటున్నది. మానవ జన్మకు పరమార్థం మహిలో ఉన్నతంగా జీవించడమే. ఉన్నత జీవనమంటే కోట్లు గడించడం కాదు.వ్యక్తిత్వంతో వికసించ డం. మూలాలను మరచి పోయి, సంస్కారం లోపించి, కృతజ్ఞత మరచి జీవించడం వలన జీవితానికి సార్థకత చేకూరదు. జంతూనాం నరజన్మ దుర్లభం అంటారు. సకల జీవరాశుల్లో మానవ జన్మకున్న విశిష్టత ఏ ఇతర జీవరాశు లకు లేదు. ఇలాంటి ఉత్కృష్టమైన మానవ జన్మకు సార్థకత చేకూరాలి. మనుషులుగా పుట్టి, ఏదో విధంగా బ్రతికేసి, చివరికి మట్టి పాలు కావడం వలన ఫలితమేమి? నిండైన వ్యక్తిత్వంతో, మానవీయ విలువలతో, మానవ సంబంధాల మధ్య జీవించడంలోనే మానవ జన్మకు సార్థకత సమకూ రుతుంది. మన జన్మకు పరిపూర్ణత చేకూర్చిన వారిని మర వడం అమానవీయం. నేడు మనం అనుభవిస్తున్న జీవి తం, సకల సుఖాలు ఎవరి వల్ల ప్రాప్తించాయో, వారిని కూరలో కరివేపాకులా తృణీకరించి,ఆవలికి గెంటడం దుర్మార్గం. జన్మ ప్రదాతలను జ్ఞాన ప్రదాతలను గౌరవించ డంలోనే మన వ్యక్తిత్వం ఇనుమడిస్తుంది, వికసిస్తుంది. కనిపెంచిన వారిని నిర్లక్ష్యం చేయడం అమానుషం. అమ్మ ఆప్యాయత, నాన్న బాధ్యత పిల్లల ఉన్నతికి సోపానాలు. "నాస్తి మాతృ సమం దైవం" అన్న మాట అక్షరసత్యం. అవనికి అందం "అమ్మ". అమ్మలేని సృష్టికి అర్థం లేదు. నవమాసాలు మోయడమే కాదు, నడకనేర్పి, నడత నేర్పి, ఆలనా పాలనాచూసి, లాలించి,గోరు ముద్దలు తినిపించి మన బ్రతుకుకొక అర్థం చెప్పి,బ్రతుకు దెరువు కు మార్గం చూపించి మరబొమ్మలాంటి మనల్ని మనిషిగా తీర్చిదిద్దే మహిమాన్విత శక్తి కేవలం అమ్మ కే స్వంతం.తల్లితో పాటు తండ్రి స్థానం మరువరాదు. బాల్యంలో తప్పటడుగులను సరిచేసిన తల్లి దండ్రులు తమ బిడ్డలు యవ్వనదశలో వేసే తప్పటడుగులను సరిదిద్దలేదు కదా! పెంచి,పెద్దవారిని చేసి, విద్యాధికులను చేసి,తన బిడ్డ గొప్పవాడైతే చూడాలని తపించే తల్లిదండ్రులను నడిరోడ్డు పాలు చేసి,నగుబాటు చేయడం తగునా? పెరిగి పెద్దయ్యాక,సమాజంలో మనకం టూ ఒక స్థానం కల్పించిన తల్లిదండ్రులు తమ స్థోమతకు సరితూగరని త్యజించడం అత్యంత అమానవీయం. కన్నవారి విలువను చంపేసి,మానసిక వ్యథకు గురిచేసి, ఆనందించమని ఎవరు నేర్పారు? కన్నవారిని వదిలించు కోవాలని చూసే ప్రబుద్ధులు మానవత్వానికే మాయని మచ్చ. వార్ధక్యంలో వృద్ధాశ్రమాలకు అంకితమిచ్చే వారు కొందరైతే, కనీసం కలలో సైతం పట్టించుకోని కఠినాత్ములు మరికొంతమంది నేటి సమాజంలో అగుపిస్తున్నారు. తామూ మనుషులమేనని భ్రమిస్తూ, వారిని గౌరవిస్తున్నా మనే భ్రమ కలిగిస్తూ ఏడాదికోసారి వారిని సందర్శించి, హడావిడి చేస్తే చేసిన పాపం పోతుందా? తల్లిదండ్రులను హింసించడం అమానవీయం. జన్మ ప్రదాతల హృదయ ఘోష మానవాళికే శాపం. వారిని వేధించకూడదు- మానవత్వం తో మెలగాలి. మానవీయ విలువలను ధ్వంసం చేసే ఆధునిక ప్రపంచంలో జీవిస్తూ కన్నవారికి పట్టెడు మెతుకులు విదిల్చలేని దుస్థితి నేటి తరానికి సోకిన జాడ్యం. బ్రతికుండగానే తల్లిదండ్రులను అప్యాయతతో మనశ్శాంతిగా జీవించే విధంగా తగిన వాతావరణం కల్పించాలి. బ్రతికుండగానే మానసికంగా చంపేసి, చనిపోయాక గొప్పలకోసం శిలా విగ్రహాలు పెట్టి తల్లిదం డ్రులను స్మరించడం భావ్యం కాదు. తల్లిదండ్రుల మీద మమకారం లేని వారిని పుట్టలోని చెదలతో పోల్చిన వేమన శతకపద్యం నేటి యువతకు శిరోధార్యం. పొలంలోని కలుపు మొక్కలు పంటకు నష్టం... పెద్దలకు విలువ నీయని యువతరం ధరిత్రికే భారం. విదేశీ వ్యామోహం లో, పరిపక్వత లేని ప్రేమల మాయా మోహంలో పడి తల్లిదండ్రులను, పెద్దలను అగౌరవ పరిచే ప్రబుద్ధుల బుద్ధులను సరిదిద్దే వారెవ్వరు? తమకోసం అహర్నిశలూ శ్రమించిన పెద్దలను పూచిక పుల్లల్లా తీసిపారేసే నైజం ప్రబలింది. పెళ్లిళ్ళు కాగానే మాయామోహంలో చిక్కుకుని, పెద్దలను 'ప్రైవసీ' పేరుతో అత్యంత అమానవీయమైన రీతిలో నిర్లక్ష్యం చేస్తున్న యువతను చూస్తున్నాం.జీవిత చరమాంకంలో జన్మనిచ్చిన తల్లిదండ్రులను అనాథలు గా వదిలివేసే వారు కొందరైతే- తమ అ(నాగరికత) కు సరి తూగరనే భ్రమలో, పెద్దలను బలవంతంగా వదిలించుకుని అత్యంత అవమానకరమైన రీతిలో వారిని వృద్ధాశ్రమాలకు తరలించే వారు మరికొందరు.విదేశీ సంస్కృతిని అలవరచు కుని" తల్లిదండ్రుల దినోత్సవం" పేరుతో సంవత్సరానికొక సారి మొక్కుబడిగా వారిని పరామర్శించడం అనాగరిక పోకడలకు నిదర్శనం. అవసానదశలో అవయవాలు పని చేయక ,దిక్కూమొక్కూ లేని దౌర్భాగ్య పరిస్థితుల్లో దారి తెన్నూ దొరకని నైరాశ్యంలో అనాథలై ఆత్మహత్యల పాలౌ తున్న అభాగ్యులకు వృద్ధాశ్రమాలే దిక్కవడం కడు శోచనీ యం. వృద్ధాశ్రమాలు తిండి పెట్టగలవేమో గాని, తమ స్వంత ఇంట్లో ఉన్న సంతృప్తి వృద్ధాశ్రమాల్లో లభిస్తుందా? తమ కోసం సర్వం త్యాగం చేసి, చివరకు మెడబట్టి గెంటించుకునే దుస్థితి హృదయశల్యమే కదా! ఎవరికి వారే స్వార్థబుద్ధులతో, సంకుచితమైన మనస్తత్వాలతో ప్రవర్తించ డం అత్యంత హేయం. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంతరించిన నేపథ్యంలో ఎవరికి వారే గిరిగీసుకుని,తమ పరిధిలో తాము బ్రతకాలను కోవడం సంకుచితత్వం. ఈ ధోరణి మానవ సంబంధాలకు తిలోదకాలివ్వడమే. బంధా లకు, సంబంధాలకు, అనుబంధాలకు, ఆప్యాయతలకు, ఆత్మీయతలకు చరమగీతం పలకడమే. ఎన్నో కష్టాలను అనుభవించి,తమ జీవితాలను ధారవోసి, చివరికి కన్నీళ్ళతో చెలిమి చేసి, కఠినాత్ముల చేతుల్లో కాలధర్మం చేస్తున్న వర్తమాన మానవ వికృత చర్యలను చూసి హృదయమున్న,చలనమున్న స్పందించే గుణమున్న ప్రతీ ఒక్కరూ చలించక తప్పదు. ప్రతీ ఒక్కరూ చక్కని వ్యక్తిత్వం కలిగి ఉండాలి. విచక్షణతో కూడిన స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సమర్థత కలిగి ఉండాలి. ఇతరుల దర్శకత్వంలో నడుస్తూ, భ్రష్టులుగా, అసమర్థులుగా మిగిలి పోయి, సమాజం దృష్టిలో చులకన కావడం వంటి దురదృష్టక రమైన సంఘటనలు ఎన్నో నేటి ఆధునిక మానవ సమాజంలో చోటు చేసుకుంటున్నాయి.ఇక నైనా మనం మేల్కొని, రేపు మన గతి కూడా ఇంతేనన్న స్పృహ తో మెలగవలసిన అవసరం ఎంతైనావుంది. నేటి యువతరమే రేపటి వృద్ధతరమన్న కనీస పరిణితి నెలకొనాలి. విద్యార్థి దశలోనే పెద్దలను ఎలా గౌరవించాలో, తల్లిదండ్రులను అవసాన దశలో ఎలా సంరక్షించాలో పాఠ్యాంశాలలో చేర్చాలి- నేర్పాలి. బిడ్డల భవిష్యత్తు కోసం తపించి, శ్రమించిన తొలి గురువులు జన్మప్రదాతలు. "అలాంటి వారికి ముదిమి వయసులో జరుగుతున్న పరాభవాలు, ఈసడింపులు నీతిబాహ్యమైనవి. చదువుకున్న వారే పెద్దల ను గౌరవించక, విస్మరించి,అనాథలుగా అవతలికి గెంటే యడం అత్యంత హేయం. నేటి సమాజంలో అడుగడుగు నా ఇలాంటి దృశ్యాలే కనబడుతున్నాయి. ఒక వైపు వార్ధక్యం...మరో వైపు అనారోగ్యం. ఇంకో వైపు ఆర్థిక బాధలు వెంటాడుతుంటే ఒంటరి జీవితంలో ఒడిదుడుకు లను ఎదుర్కొంటూ, బిడ్డలు ఉచ్ఛస్థితిలో ఉన్నా, తిండిలేక భిక్షాటన చేస్తున్న తల్లిదండ్రులెంతో మంది మనకు తారసపడుతున్నారు. కనిపెంచిన వారు క్లేశాలు పడుతుంటే చలించని మనస్తత్వాలు శిలాసదృశాలు. తల్లిదండ్రుల పట్ల ప్రదర్శిస్తున్న వింత వికృత ప్రవర్తనను సమాజం భరిస్తుం దా? కన్నవారికి విలువివ్వని వారిని గౌరవమిస్తుందా? పెద్దలను గౌరవించని చదువులు,ఉద్యోగాలు శుద్ధదండగ. మనిషిని మనిషిగా గౌరవించని అవివేకం వ్రేళ్ళూనుకోవ డం దురదృష్టకరం. ఇదొక సామాజిక రుగ్మత.ఇలాంటి రుగ్మతలను నివారించడం నేటి యువత కనీస సామాజిక బాధ్యత. ఈ సందేశాన్ని నేటి యువతరానికి అందించాలి. మనిషి మరణించినా మనిషి ఆశయాలు సజీవంగా బ్రతకాలి. బ్రతుకుతూ మరణించడం కంటే మరణించి జీవించడం మేలు.భావి తరాలకు వెలుగు నిచ్చే అనుభవ పాఠాలు పెద్దల వద్దనున్న నిగూఢమైన అస్తిపాస్తులు. భావితరాలకు ప్రతినిధులైన నేటి విద్యార్థులను సరైన దారిలో తీర్చిదిద్దే విద్యాధనం ఉపాధ్యాయుల వద్ద పుష్కలం గా ఉంది. జీవిత అనుభవాల సారాంశాన్ని ప్రబోధించే విలువైన సంపద పెద్దల వద్ద మెండుగా ఉంది.విద్యార్థులకు సరైన మార్గాన్ని నిర్దేశించి,వారిని క్రమశిక్షణ గల సైనికులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు,గురువులు బాధ్యత తీసుకోవాలి. ఆనాడే తల్లిదండ్రుల పేరుతో జరుగుతున్న మనసులేని మనుషులు జరిపే కృత్రిమమైన ప్రచార ఆర్భాటాలకు స్వస్తి వాక్యం చెప్పగలము. గతించిన వారిని కలలో స్మరించడం వలన ఫలితం శూన్యం. ఎదిగిన బిడ్డలు తల్లిదండ్రుల హృదయాంతరంగాన్ని స్పృశించాలి. వారి ప్రేమాభి మానాలు, ఆశీర్వచనాలు బిడ్డల భవిష్యత్తుకు శ్రీరామరక్ష.

- సుంకవల్లి సత్తిరాజు.
(సామాజిక విశ్లేషకులు,మోటివేషనల్ స్పీకర్)
మొ : 9704903463



# ప్రభుత్వ భూములను కబ్జాకు గురికాకుండా కాపాడాలి



**మల్కాజిగిరి, జూలై 30 (జనంసాక్షి) :** మల్కాజిగిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, ప్రభుత్వభూముల పరిరక్షణ, ప్రజా అవసరాలకు అనుగుణంగా భూముల కేటాయింపులు వంటి పలు విషయాలను స్థానికులతో కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రభుత్వ భూములు కబ్జాలకుగురవుతున్నాయని, కబ్జాల నుంచి కాపాడి ప్రజా ఉపయోగపడే విధంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లుకు కేటాయించాలని నియోజకవర్గంలో ఆరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు, లైబ్రరీలకు 15వ ఫైనాన్స్ కమిషన్ ప్రకారం నిధులు ఉన్నాయి, ప్రభుత్వ భూములు కేటాయిస్తే జిహెచ్ఎంసి ద్వారా యూపీహెచ్ సీ లు కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లకు కోసం భూములు కేటాయించాలని నియోజకవర్గంలోని ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించడం జరిగిందని ఆ ఖాళీ స్థలాలను స్వాధీనంచేసుకుంటే జిహెచ్ఎంసి ద్వారా నిర్మించుకోవడానికి వీలవుతుందని అన్నారు. ముస్లిం, క్రిస్టియన్లకు స్మశాన వాటికల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని,ఇటీవల జరిగిన దిశ సమావేశంలో, గతంలో జరిగిన దిశ మీటింగ్ లో పేర్కొన్న అంశాలను పరిగణలకు తీసుకొని వాజ్ పాయ్ నగర్ లో ఉన్న ఇంటర్మీడియట్ కాలేజ్ , డిగ్రీ కాలేజ్ లో ఉన్న పరిస్థితులను వివరించినప్పుడు అర్థం చేసుకొని సందర్శించి వెంటనే రెండున్నర కోట్ల నిధులను కేటాయించడం జరిగింది. అలాగే అదనపు తరగతి గదులు నిర్మించడానికి చర్యలు తీసుకున్నారు. మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించి మెరుగైన వసతులకు కృషి చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. బ్రాహ్మణ కమ్యూనిటీ భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని మల్కాజిగిరి లో అత్యధికంగా బ్రాహ్మణ కులస్తులు ఉండడంతో వారు కర్మకాండలు చేసుకోవాలనుకున్న పెళ్లిలు చేసుకోవాలనుకున్న, పేద బ్రాహ్మణులకు అవసరాలకు వాడుకునే విధంగా బ్రాహ్మణ కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని కోరారు. జీవో 58, 59 ద్వారా దరఖాస్తు చేసుకున్న పేదలను గుర్తించి అవకతవకలు జరగకుండా పరిశీలించి జీవో 59 ద్వారా డబ్బులు చెల్లించిన వారికి స్థలం రెగ్యులరైజేషన్ చేయాలని,ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయని కాపాడాలని, గతంలో ఇచ్చిన దరఖాస్తులకు చర్యలు తీసుకొని, ముఖ్యమంత్రి కార్యాలయం నుండి స్పందన లభించడం జరిగింది అక్కడినుంచి యాక్షన్ టేకెన్ రిపోర్ట్ పంపించాలని కలెక్టర్ ను కోరడం జరిగిందని అన్నారు. కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు, సర్వేనెంబర్ 844 హైదరాబాద్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ల మధ్య, మల్కాజిగిరి మారేడుపల్లి మండలాలు భౌగోళిక సరిహద్దులు సూచించకపోవడంతో దాదాపు 55 ఎకరాల స్థలం కబ్జాలకు గురి అవుతున్నాయని అలాంటి స్థలంలో నవోదయ స్కూల్లో ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని,ఎడి సర్వే చేయించాలని కోరినట్లు వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మంత్రి శ్రీధర్ బాబు ను కలిసి సబ్ రిజిస్టర్ ఆఫీస్, డిగ్రీ కాలేజ్ స్థలం కేటాయించాలని కోరగా కలెక్టర్ ను ఆదేశిస్తూ రాసిన లేఖలను అందజేశామని అన్నారు. సర్వే నెంబర్ 844 హిల్ టాప్ కాలనీలో ప్రభుత్వ భవనమును అంగన్వాడీ సెంటర్ కు లేదా మహిళా భవన్ కేటాయించాలని సర్వేనెంబర్ 278 టెలికం కాలనీ వినోబా నగర్ లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని అదేవిధంగా యాప్రాల్ సర్వేనెంబర్ 171 లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించి ప్రజలకు ఉపయోగపడే విధంగా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ల నిర్మించాలని, సర్వేనెంబర్ 582, 583 ప్రభుత్వ స్థలాన్ని కబ్జాలకు గురికాకుండా పరిరక్షించాలని, అల్వాల్ జొన్న బండ ప్రాంతంలో సర్వేనెంబర్ 22 , 23లో ప్రజలు కొనుక్కున్న ప్లాట్లను కబ్జా చేసి ప్రైవేటు వ్యక్తులు రాక్ ల్యాండ్ ఎవెన్యూ అపార్ట్మెంట్లు నిర్మిస్తున్నారని ప్లాట్లు కొనుక్కున్న వారికి న్యాయం చేయాలని, మౌలాలి ప్రాంతంలో వోక్స్ బోర్డ్ భూములలో రిజిస్ట్రేషన్స్ జరిగేలా కృషి చేయాలని పేద మహిళలకు ఉపాధి కల్పన కొరకు కుట్టుమిషన్లు అందజేయాలని వినతి పత్రంలో కోరి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత రాము యాదవ్, తోట నరేందర్ రెడ్డి,డోలి రమేష్, చిన్న యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్ రెడ్డి,లక్ష్మణ్ యాదవ్, హేమంత్ పటేల్,యాదగిరి గౌడ్, రాజశేఖర్ రెడ్డి, రాజు, విజయ్ శేఖర్, జనార్ధన్, అరవింద్, అరుణ్, విజయ్, ఉష శ్రీ, సూర్యకుమారి, పర్వీన్ వివిధ కాలనీ ,బస్తీ వాసులు, కుల సంఘాల నాయకులు, మహిళలు కార్యకర్తలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- పెద్దెముల్ జూనియర్ కాలేజీ లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ఎస్సై వేణు కుమార్



**పెద్దెముల్, జూలై 30 (జనం సాక్షి) :** మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నివారణ నార్కోటిక్స్ డ్రగ్స్ పదార్థాలకు బానిస కావద్దని, బుధవారం పెద్దెముల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించిన పెద్దెముల్ ఎస్సై వేణు కుమార్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు రాకుండా అరికట్టేందు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రతి పాఠశాలలో, కాలేజీలలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. మత్తు పదార్థాలు ఎలా తయారు చేస్తారు, వాటిని వాడితే ఏం అవుతుంది అని దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ముఖ్యమని తెలిపారు,పాఠశాలలు,కాలేజీలలో అలాగే పెద్దెముల్ మండల కేంద్రంలో ప్రజలకు నిత్యము అవగాహన కల్పించేందు కృషి చేస్తామన్నారు. గ్రామాలలో వ్యవసాయ, ఉద్యాన, అలాగే ఇతరత్రా పంటలను ఎక్కడైనా గంజాయి ఇతర మత్తు పదార్థాల సాగు చేస్తే సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. కానిస్టేబుల్ జగన్. ప్రవీణ్. ముంతాజ్ బేగం. మక్బూల్. అన్వర్. మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, జూలై 30 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా ను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశం జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, పోలీస్, వైద్య, అగ్రికల్చర్, విద్య, సంక్షేమ, డ్రగ్ ఇన్స్పెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాను మాదకద్రవ్యాలు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని చెప్పారు. జిల్లాలో గంజాయి సాగు చేస్తున్నట్లు పట్టుబడి కేసులు నమోదు అయితే అటువంటి వారిపై ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ పథకాలు పూర్తిగా రద్దు అవుతాయన్నారు.. మనోరాబాద్ తూప్రాన్ ఏరియాలో పరిశ్రమల ఉంటాయని వలసవాదులు, యువత కంపెనీలలో పనిచేస్తూ డ్రగ్స్ సేవించడం కలిగి ఉండడం ఉంటాయన్నారు. చెక్ పోస్టు ఏర్పాటు చేసి రవాణాను అడ్డుకొని డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్ పంట సాగు చేయలేని సాగుకు యోగ్యంలేని ప్రదేశాల్లో ఎక్కువగా గంజాయి పండించే అవకాశం ఉందని అటువంటి వాటిపై వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ నిర్వహించి నివేదికల సమర్పించాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో బాధ్యతగా పని చేయాలన్నారు. వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. పోలీస్, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ల సమన్వయంతో గతంలో గంజాయి పండించే సరఫరా చేసిన వాటిపై నిగా పెంచాలన్నారు సీజ్ చేసిన డ్రగ్స్ ప్రాధాన్యత క్రమంలో డిస్పోస్ చేయాలన్నారు. చికెన్ సెంటర్స్, పాఠశాలలు, హాస్టల్ బిల్డింగ్స్ లలో సెలవు దినాల్లో యువత డ్రగ్స్ వాడే అవకాశం ఉన్నందున వాటిపై నిఘా పెంచాలన్నారు. తండాలు రిమోట్ ఏరియాలలో జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి డ్రగ్స్ నిర్మూలనకు తమ వంతు సహకారం అందించాలన్నారు జిల్లాలో అన్ని మద్యం షాపులలో 18 సంవత్సరాలు నిండని వారికి మద్యం అమ్మ రాదని బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామస్థాయి అభివృద్ధి కమిటీల ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనకు సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ నిషేధిత డ్రగ్స్ ను అమ్మకుండా నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు జిల్లాలో ఉన్న వైన్ షాపులు ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని ప్లాస్టిక్ వాడినా కలిగి ఉన్న కేసులు నమోదు చేస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా పోలీస్ యంత్రాంగం నిరంతర తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయడం జరుగుతుంది జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా రోడ్లను బాగు చేయండి

- బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి

**వికారాబాద్, జూలై 30 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లాలో అద్వాన్నమైన రోడ్ల పరిస్థితి బాగు చేయాలని బుధవారం నాడు రోడ్లు మరియు భవనాల శాఖ అధికారికి వినతి పత్రం ఇచ్చిన బిజెపి నాయకులు, ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోని ప్రధాన రోడ్డు మార్గాలు వికారాబాద్ తాండూర్, వికారాబాద్ పరిగి, సిద్దలూరు తంగడపల్లి మీదుగా హైదరాబాద్ రోడ్, తాండూర్ కొడంగల్, తాండూర్ చించోలి, తాండూర్ మర్పల్లి, మోమిన్ పేట్ మార్గం ఇలా జిల్లాలోని అనేక ముఖ్యమైన రహదారుల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందని దీనికి తోడు గతంలో ఈ రోడ్లను వేసిన వేయించిన అధికారులు నాయకులు కమిషన్లు ఇవ్వడం కోసం కాంట్రాక్టర్లు నాణ్యత లేని రోడ్లు వేసిన కారణంగా అవి ఒకటి లేదా రెండు సంవత్సరాల్లోనే పూర్తిగా ప్రయాణాలకనుగుణంగా లేకుండా తయారవుతున్నాయని, ప్రజా అవసరాల నిమిత్తం రోడ్డు మార్గాన్ని మీ ఆధ్వర్యంలో సమగ్రంగా పరిశీలించి ఎవరైతే ఇలాంటి రోడ్డును వేశారు వారి పైన చట్టపరంగా చర్యలు తీసుకొని ప్రజలకు సౌకర్యం కల్పించాల్సిందిగా అధికారులను కోరుతున్నామన్నారు, ముఖ్యంగా తాండూర్ కొడంగల్ మార్గంలో ఉన్న కాగ్న నదిపై గత రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమైన బ్రిడ్జి వర్షాల కారణంగా రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి దాని కారణంగా ఆ బ్రిడ్జి యొక్క పూర్తి సామర్థ్యం భయానక పరిస్థితి తయారయ్యే అవకాశం ఉంది కాబట్టి కాసులకు కక్కుర్తి పడి నాణ్యత లేకుండా బ్రిడ్జిని వేసిన కాంట్రాక్టర్ ను అప్పటి అధికారులను వెంటనే రీకాల్ చేసి ఆ బ్రిడ్జికి పూర్తిస్థాయిలో ప్రజా అవసరాలకు అనుగుణంగా తయారు చేయాలని, గ్రామాలకు వెళ్లాలంటే ప్రతీ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు కాబట్టి భారతీయ జనతా పార్టీ వికారాబాద్ జిల్లా తరఫున గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం ఉన్నప్పుడే గ్రామాల అభివృద్ధి చెందుతాయి అనే ఉద్దేశంతో అతిముఖ్యమైన సమస్యను రోడ్డు భవనాల శాఖ అధికారుల ముందు ఉంచుతున్నామని వెంటనే వికారాబాద్ జిల్లాలోని అన్ని రోడ్డులను ప్రత్యక్షంగా పర్యవేక్షించి ఆయా రోడ్ల పరిస్థితి కనుక్కొని వాటి మరమ్మతులో గాని నాణ్యతలో గానీ ఎక్కడ కూడా అవినీతికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా చర్యలు తీసుకుంటారాని ఆశిస్తున్నామన్నారు. కాగ్న నది బ్రిడ్జి నిర్మాణంలో విధులు నిర్వహించిన ఇంజనీర్లను సస్పెండ్ చేసి కాంట్రాక్టర్ పైన చట్టపరమైన చర్యలు తీసుకుని బ్రిడ్జ్ పునర్ నిర్మాణ ఖర్చును వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానంద్ రెడ్డి, నవీన్ అసెంబ్లీ ఇంచార్జ్, విజయ్ రాజ్ జిల్లా కార్యదర్శి, అమరేందర్ రెడ్డి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్, సాయి, బుజంగారెడ్డి జడ్పీ ఇన్చార్జ్, బిజెపి సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, జి శివరాజ్, సుధాకర్ ఆచారి, రవీందర్ రెడ్డి, మల్లేశం, వికారాబాద్ రూరల్ అధ్యక్షులు శివరాజ్ గౌడ్, మోమిన్ పేట్ మండల అధ్యక్షులు ఆశిరెడ్డి, బంట్వారం మండల అధ్యక్షులు మహేశ్, గోపాల్ ప్రధాన కార్యదర్శి, రాజు ప్రధాన కార్యదర్శి, వైస్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, బూత్ అధ్యక్షులు ఆనందం, పాండు రంగా రెడ్డి, శ్రీకాంత్, జగదీశ్, రాఘవేందర్ రెడ్డి, సంజీవ రెడ్డి, జగదీష్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాసమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి ఉద్యమాలు

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్ బాబు

**చేర్యాల, జూలై 30 (జనంసాక్షి) :** 42 శాతం బీసీ బిల్లుకు బిజెపి మోకాలు అడ్డుతుందని బీసీ ప్రధానమంత్రి అని ప్రగల్భాలు పలికే బిజెపి ఎందుకు పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టడం లేదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం రోజున సిద్దిపేట జిల్లా చేర్యాల, మద్దూర్,కొంరవెల్లి,ధూల్మిట్ట మండలాల రాజకీయ శిక్షణ తరగతులకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి ప్రిన్సిపాల్గా వ్యవహరించారు. ఈ శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. విద్వేషాలు రెచ్చగొట్టి మతాలు, కులాల మధ్య సృష్టిస్తూ ప్రజల ఐక్యతను విడదీసి దేశ ఐక్యతను దెబ్బ తీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర విద్వేశపూరితమైన మాటలతో, సమస్యలు పరిష్కారం చేయకుండా పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత,ను విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ విడుదల కాకపోవటంతో నానా ఇబ్బందులు పడుతిన్నారన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి



ఆముదాల మల్లారెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు నక్కల యాదవ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ళబండి శశిధర్,జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, ఆలేటి యాదగిరి, చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్ కుమార్, కొమురవెల్లి మండల కార్యదర్శి తాడురీ రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, అత్తిలి శారద, దాసరి ప్రశాంత్, జాలిగాపు శిరీష, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, మద్దూరు మండల పార్టీ కార్యదర్శి ఎండి షఫీ, దూల్మిట్ట మండల పార్టీ కార్యదర్శి పోతిరెడ్డి రాజు నాయకులు తేలు ఇస్తారి, బక్కిలి బాలకిషన్,పోలోజు శ్రీహరి, ఇపకాయల శోభ, తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ సమస్యలపై జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి

**రాజేంద్రనగర్, జూలై 30 (జనంసాక్షి) :** మైలర్‌దేవ్‌పల్లి డివిజన్‌లో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న అత్యవసర అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరుతూ బుధవారం జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ వెంకన్న కు ఆయన కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లేఖ ద్వారా తెలుపుతూ జిహెచ్ఎంసి లోనే అతిపెద్ద డివిజన్ ఐన మైలార్దేవ్పల్లిలో దిన దినాన జనసాంద్రత పెరుగుతున్నను అందుకు అనుగుణంగా శరవేగంగా జరగవలసిన అభివృద్ధి పనులు జరుగక అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందని, గత సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా చేపట్టవలసిన అభివృద్ధి పనులు అంచనా ప్రకారం రూ. 2.50.05 కోట్ల విలువగల సీసీ రోడ్డు పనులను,




పెండింగ్ పనులను త్వరగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్‌కు పలు విషయాలపై లేక ద్వారా తెలుపుతూ క్లుప్తంగా అవగాహన కల్పించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందజేస్తాం

- ప్రజా పాలనలో ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, జూలై 30 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేయనున్నట్లు ప్రజా పాలనలో ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు వస్తాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం లోని శాస్త్ర గార్డెన్స్ లో నిర్వహించిన రేషన్ కార్డుల కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండలం మరియు మున్సిపాలిటీ%ూ%అదిబట్ల మున్సిపాలిటి పరిధిలోని లబ్ధిదారులకు రేషన్ కార్డుల మంజూరు పత్రాలు అందచేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను 18 నెలలలోనే అమలు చేస్తున్నామని మిగతా పథకాలను కూడా అమలు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలు పాలించి ప్రజలకు రేషన్ కార్డులు ఇండ్లు ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమం- అభివృద్ధి పేరుతో పేదలకు పథకాలు అందచేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు చిలుక మధుసూదన్ రెడ్డి,కంబాలపల్లి గురునాథ్ రెడ్డి,వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, తాసిల్దార్ సునీత,మునిసిపల్ కమిషనర్లు సత్యనారాయణ రెడ్డి,బాలకృష్ణ తో పాటు ఆయా గ్రామాల కార్యదర్శులు వార్డు అధికారులు,ఇందిరమ్మ కమిటి సభ్యులు,కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో నిఘా కట్టుదిట్టం చేయాలి

- ప్రభుత్వ నిషేధిత గంజాయి సాగు, అక్రమ రవాణాపై ఉక్కు పాదం
- మల్టీ జోన్-2 ఇంచార్జ్ ఐ.జి తఫ్సీర్ ఇక్బాల్

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 30 (జనం సాక్షి) :** రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో నిఘా కట్టుదిట్టం చేయాలని మల్టీ జోన్-2 ఇంచార్జ్ ఐ.జి తఫ్సీర్ ఇక్బాల్ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయాన్ని మల్టీ జోన్-2 ఇంచార్జ్ ఐ.జి తఫ్సీర్ ఇక్బాల్ అన్నారు. ముందుగా జిల్లా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జిల్లా ఎస్పీతో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయం, పోలీసు పరేడ్ గ్రౌండ్, మోటార్ వెహికల్ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల నేరాలు, రోడ్డు ప్రమాదాలు నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి ఐ.జీ.కి వివరించడం జరిగింది. పోలీసు అధికారులనుద్దేశించి ఐ జి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలతో సరిహద్దులు కలిగి ఉండటం వలన పొరుగు రాష్ట్రాల నుండి ప్రభుత్వ నిషేధిత గంజాయి, పొగాకు, గుట్కా వంటివి అక్రమ రవాణా జరగటానికి అవకాశం ఉన్నందున వాహనాల తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లా మీదుగా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలో గంజాయి పండించినా, అక్రమ రవాణా చేస్తున్నట్లుగాని, మట్కా, పేకాట ఆడుతున్నట్లుగాని గుర్తించినట్లయితే అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని యస్.హెచ్.ఒ లకు సూచించారు. సంగారెడ్డి జిల్లా ముఖ్యంగా ఇతర రాష్ట్రాలను కలుపుతూ ప్రధాన రహదారులు ఉండటం



వలన నేరస్తులు సులభంగా జిల్లాలో ప్రవేశించి వివిధ రకాల ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఆస్తి సంబంధిత నేరాలకు సంబంధించి ఏ నిర్దిష్టమైన సమయంలో, అధికంగా నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, నిఘా కట్టుదిట్టం చేయాలని అన్నారు. ప్రతిరోజు పాపిలోన్ డివైస్ ను వినియోగించి, పాత నేరస్తులను గుర్తించాలని, గుర్తించబడిన నేరస్తుల వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని అన్నారు. పోలీసుల యొక్క విధులను ప్రతి ఒక్కరూ తెలుసుకొని సమర్థవంతంగా విధులను నిర్వహించాలని, సమాజంలో శాంతిని నెలకొల్పడంలో పోలీసుల పాత్ర చాలా కీలకం అన్నారు. అధికారులు సిబ్బంది తమ పరిధిలో గల గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా యువత ఎలాంటి చెడు అలవాట్లకు భానిసలవుతున్నారని గుర్తించాలన్నారు. జరిగిన నేరాన్ని ఛేదించడం కంటే, నేరం జరగకుండా నిరోదించడం చాలా ముఖ్యం అని అన్నారు. వృత్తిపరంగా ఉత్తమ విధులు నిర్వహించిన అధికారులకు ఉన్నత అధికారులచే గుర్తింపు లభిస్తుందన్నారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా పోలీసింగ్ లో మార్పులు తీసుకురావాలని, సిబ్బంది ప్రతి ఒక్కరు కంప్యూటర్ పరిజ్ఞానంపై దృష్టి సారించాలని అన్నారు. రానున్న లోకల్ బాడీ ఎలక్షన్స్ దృష్ట్యా తమ తమ ప్రాంతాలపై దృష్టి సారించాలని, ఎలక్షన్స్ సజావుగా జరగడానికి కావలసిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించిన వారిని, పాత నేరస్తులని గుర్తించి ముందస్తుగా బైండ్ ఓవర్ చేయాలని చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఇతర రాష్ట్రాలతో సరిహద్దులు కలిగి ఉండటం వలన ఆస్థి సంభందిత నేరాలు జరిగినప్పటికి అట్టి నేరాలను ఛేదించడడంలో సంగారెడ్డి జిల్లా పోలీసు మెరుగ్గా పనిచేస్తుందని, గంజాయి వంటి ఇతర మాదక ద్రవ్యాలను జల్లా నుండి అక్రమ రవాణా జరగకుండా నివారించడంలో, జరిగిన నేరాలను ఛేదించడంలో జిల్లా లో ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీంతో విజయాలను అందుకోవడం జరుగుతుంది అన్నారు. ట్రాఫిక్ సమస్యను నివారించడంలో సిగ్నల్స్ ఏర్పాటు, సిసి కెమెరాల ఏర్పాటు చేయడంలో జిల్లా ఎస్పీ చేస్తున్న కృషి, జిల్లా యంత్రాంగం పనితీరు అభినందనీయమని, సంగారెడ్డి జిల్లా పోలీసుల పని తీరు బేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎ.సంజీవ రావ్, డిటిసి అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావ్, సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, పటాన్ చెర్వు డియస్పి ప్రభాకర్, జహీరాబాద్ డియస్పి సైదా నాయక్, నారాయణఖేడ్ డియస్పి వెంకట్ రెడ్డి, డిటిసి డియస్పి సురేందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ. కళ్యాణి, ఎఆర్ డియస్పి నరేందర్, మరియు జిల్లా ఇన్స్పెక్టర్స్, సబ్-ఇన్స్పెక్టర్స్, ఆర్.ఐలు రామ రావ్, రాజశేఖర్, డానియెల్, శ్రీనివాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
31 జూలై 2025

# అన్ని దానాల కంటే అన్నదానం గొప్పది

**తూప్రాన్, జూలై 30 (జనం సాక్షి) :** సేవే మన ధర్మం. అన్నదానం మన ధ్యేయం అని తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త అన్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు ఆశాజ్యోతి డయగ్నాస్టిక్ సెంటర్ లో అమ్మ నాన్న వృద్ధాశ్రమం వారికి, పేషెంట్లకు అన్నదాన కార్యక్రమం ఇంటర్ నేషనల్ డైరెక్టర్ లయన్ ఘంటమనేని బాబురావు జన్మదిన సందర్భంగా ఘనంగా నిర్వహించారు. లయన్ ఘంటమనేని బాబురావు గారి జన్మదిన వేడుకతో క్లబ్ మరింత విశిష్ట స్థాయికి చేరిందన్నారు తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, లయన్ పచ్చిమట్ల మల్లేష్ గౌడ్ ల ఆధ్వర్యంలో ఆశా జ్యోతి డయాగ్నాస్టిక్ సెంటర్ వద్ద భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో వందలాది మందికి ఉచిత భోజనం అందించడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ లయన్ ఘంటమన్నే బాబురావు జన్మదిన వేడుకలు బర్త్ డే కేక్ కట్ చేసి కూడా ఘనంగా జరిపారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్ డాక్టర్ జి.బాబురావు జీవిత ప్రావీణ్యం, సేవా ప్రతిభను ప్రశంశిస్తు తూప్రాన్ లయన్స్ క్లబ్ తరపున ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక నిరుపేద అభాగ్యులకు, పేషెంట్లకు, వృద్ధ ఆశ్రమ వాసుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సామాజిక సేవా దృక్పథంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది అన్నార్తుల ఆకలి తీర్చడంలో నాణ్యమైన భోజనం వడ్డించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అనేది అన్నం అంటే ఆహారం, అది పరబ్రహ్మ స్వరూపంగా భావించబడుతుంది అని అన్నారు. భౌతికంగా మనకు కనిపించే



ఆహారం, దైవస్వరూపమే అని భావించడం. అన్నదానం అన్ని దానాలకంటే మిన్న. అన్న దానం అంటే ఆహారాన్ని దానం చేయడం. ఇది అన్ని దానాలలో అతి శ్రేష్ఠమైన దానం. ఎందుకంటే, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం వలన వారి ప్రాణాలను కాపాడినట్లే అవుతుంది. ఇతర దానాలు ధనదానం, విద్యాదానం, వస్త్రదానం మొదలైనవి ఎంతో మేలైనవే అయినా, ఆకలితో బాధపడుతున్న వ్యక్తికి ఆ సమయంలో అవసరం అన్నదే. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నం దైవస్వరూపం. అన్నదానం ప్రాణదానంతో సమానం, అందుకే అది అత్యుత్తమ దానం అని తెలిపారు. అందరికీ సేవా మార్గాన్ని తెలియజేసే ఒక బృహత్తరమైన గొప్ప పుణ్య కార్యం అన్నదానం అని అన్నారు. అన్న దానం అనేది అన్నం ఆహారం దానం చేయడం, అంటే ఆకలితో ఉన్నవారికి భోజనం అందించడం అని తెలిపారు. ఇది మన సంస్కృతి సంప్రదాయ పద్ధతిలో లో అత్యంత పవిత్రమైన, మేలు కలిగించే దానంగా పరిగణించబడుతుంది. అన్న దానానికి ఉన్న గొప్పతనం అన్నం పరబ్రహ్మ స్వరూపం, వేదాలలో అన్నాన్ని "పరబ్రహ్మ" అని చెప్పబడింది. జీవులకు బతకడానికి అవసరమైన ప్రాథమిక అవసరం అన్నం కాబట్టి, దానిని అందించడం అత్యున్నత సేవగా పరిగణించబడుతుంది అని తెలిపారు. అన్న దానానికి తుల్యమైన దానం లేదు, అన్న దానానికి మించిన దానం లేదని తెలిపారు. క్షణికంగా కాకుండా జీవితాంతం గుర్తుండే పుణ్యం పురుషార్థం కీర్తి ప్రతిష్టలు పెంపొందించు కోవడానికి దోహదపడుతుందని అన్నారు. అన్నదానం చేసినవారిని పొందినవారు జీవితాంతం ధన్యులుగా గుర్తుంచుకుంటారు అని తెలిపారు. భౌతిక మరియు ఆధ్యాత్మిక ఫలాలు, అన్న దానం వల్ల మనసుకు తృప్తి, కర్మ క్షయం, పుణ్యం లభిస్తాయన్నారు. సమాజ సేవలో ముఖ్య భాగం, ఇది పేదవారిని, అవసరమైన వారిని ఆదుకోవడంలో ఒక అద్భుతమైన సేవా మార్గం అని అన్నారు. క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ముఖ్యంగా లయన్ బాబురావు గారి అభిమానులు, లయన్స్ సభ్యుల సంయుక్తంగా చేసిన వినూత్న కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, లీడర్ షిప్ చైర్మన్ లయన్ బుడ్డ భాగ్యరాజు, లయన్ కుమ్మరి రమేష్, లయన్ బలరాం రెడ్డి, లయన్ డాక్టర్ ప్రదీప్ సింహ, లయన్ డాక్టర్ అప్సర్ భాయ్, లయన్ పుట్ట వెంకటేష్ డెకరేషన్, లయన్ వంగ భాస్కర్ రెడ్డి క్యాటరింగ్, లయన్ పల్లెర్ల బాలేష్ గుప్త, లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్, లయన్ నీల ప్రవీణ్ కుమార్ గుప్త, లయన్ నేతి సాగర్ గుప్త, లయన్ సి.ఆర్.ప్రవీణ్ కుమార్ గౌడ్, లయన్ నాగరాజు గుప్త, లయన్ మచ్చ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులపై దృష్టి సారించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, జూలై 30 (జనం సాక్షి) :** భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై తహశీల్దార్లు దృష్టిసారించి వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ సమావేశపు హాలులో భూ భారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు పరిష్కారానికి తీసుకున్న చర్యలపై తహశీల్దార్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ లతో మండలాల వారీగా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల క్షేత్ర స్థాయి విచారణ నిర్వహించి వెంటనే పరిష్కారం చేయాలని సూచించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన సక్సేషన్,పెండింగ్ మ్యుటేషన్,పిఓపి, డి.ఎస్.పెండింగ్ అన్ని దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉన్నందున దరఖాస్తుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులు పరిష్కారంలో వేగం పెంచాలని ఆదేశించారు. వచ్చేవారం చేపట్టిన చర్యలపై తిరిగి సమీక్షించడం జరుగుతుందని తెలిపారు.మీసేవ ద్వారా వచ్చే బర్త్, డెత్, ఆదాయ, రెసిడెన్సు, యాఫ్ - లైన్ సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని తహసీల్దారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీనారాయణ, ఆర్.డి.ఓ.అలివేలు, ఏఓ భూపాల్ రెడ్డి, తహశీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



**సదాశివపేట, జూలై 30 (జనం సాక్షి) :** అర్హులైన పేదలందరికీ సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలనేదే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు అన్నారు. బుధవారం పట్టణంలోని 1వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ పథకాన్ని సద్వినియోగం చేసుకొని సొంతింటి కలను నెరవేర్చుకోవాలన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ల సహకారంతో అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథం, హౌసింగ్ ఎడి, నాయకులు తుకారాం,లతీఫ్, వాజీద్,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## బొమ్మన్‌పాడ్ జెడ్పీ పాఠశాలను పరిశీలించిన కలెక్టర్

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 30 (జనం సాక్షి) :** నారాయణపేట మండలంలోని బొమ్మన్‌పాడ్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలను బుధవారం జిల్లా కలె క్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలిం చారు.ఈ సందర్భంగా పదో తరగతిలో ఎంతమంది విద్యా ర్థులు ఉన్నారని,వారిలో ఎంత మంది విద్యార్థులకు ఆధార్ లింకేజీ పూర్తి అయిం దని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ ఏ 1 కంప్లీట్ అయిందా ? లేదా ? అని అడిగారు. సామాన్య, బయో సైన్స్ క్లాస్‌లను పరిశీలించారు. ఖాన్ అకాడమీ ఫీజిక్స్ వాలాను విద్యార్థుల కు బోధిస్తున్నారా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం పదో తరగతిలో ఎంతమంది పాస్ అయ్యారని అడగగా 40 మంది లో 38 మంది విద్యా ర్థులు పాస్ అయ్యారని ఉపా ధ్యాయులు కలెక్టర్ కు తెలి పారు.ఈ సారి పదో తరగ తిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచిం చారు. తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక గోల్ పెట్టుకోవాలని దానిని సాధించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. 9వ తరగలోని ఇంగ్లీష్ క్లాసును ఆమె పరిశీలించారు. విద్యా ర్థులకు మెనూ ప్రకారం



భోజ నాన్ని అందించాలని ఉపా ధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశిం చారు. భోజనం మంచిగా ఉంటుందా ? లేదా ? అని విద్యార్థులను ప్రశ్నించగా బాగా ఉంటుందని విద్యా ర్థులు కలెక్టర్ కు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో ఫుడ్ కమిటీ చాలా కీలక పాత్ర పోషించాలని,తప్పనిసరిగా కమిటీ సభ్యులు భోజనం తిని మంచిగా ఉందని నిర్ధా రణ చేసిన తర్వాతే విద్యా ర్థులకు భోజనం వడ్డించాలని ఆమె సూచించారు. రోజూ వారీ మధ్యాహ్న భోజనం రుచి చూసి టేస్ట్ రిజిస్టర్ లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

## జడ్చర్లకు బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని వినతి

- ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని కలిసిన ఎంపి, ఎమ్మెల్యేలు..



**జడ్చర్ల, జూలై 30 (జనం సాక్షి) :** జడ్చర్ల పట్టణానికి నూతనంగా బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లు బుధవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్ నగర్ గుండా వెళ్లే జాతీయ రహదారి 167 నుంచి 44వ జాతీయ రహదారిని కలుపుతూ మరల 167 వ జాతీయ రహదారికి అనుసంధానం అయ్యేలా జడ్చర్ల చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మించాలని, వాహనాల రద్దీ నేపథ్యంలో జడ్చర్ల పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను కేంద్రమంత్రికి వివరించి మంజూరు చేయాలని, మహబూబ్ నగర్ బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యేల ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి జడ్చర్ల బైపాస్ రోడ్డు మంజూరు చేస్తామని, అందుకు సంబంధించిన డిపిఆర్‌ను స్టడీ చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని తెలిపారని ఎంపీ, ఎమ్మెల్యేలు తెలిపారు.

## పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



**కృష్ణ, జూలై 30 (జనం సాక్షి) :** పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని నిజామొద్దీన్ కోరారు.స్కూల్ కాంప్లెక్స్ సమావేశం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ కిషోర్ కుమార్ అధ్యక్షత వహించగా, శ్రీనివాస్ రిసోర్స్ పర్సన్‌లుగా సేవలందించారు.కాంప్లెక్స్ పరిధిలోని కృష్ణా, మాగనూర్, మక్తల్ మండలాల్లోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఈ సమావేశానికి హాజర య్యారు. సీఆర్‌పీ అమీన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నిజాముద్దీన్ ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. ఉత్తమ బోధనా విధానాలు, నూతన ఉపాధ్యాయ ధోరణులు, విద్యార్థి కేంద్రిత బోధనపై విలువైన సూచనలు చేశారు. కిషోర్ కుమార్ ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం అనేక ఉపయోగకరమైన సూచనలు ఇవ్వడమే కాక, సమావేశం సజావుగా కొనసాగేందుకు అవసరమైన అన్ని వసతులు అందించడంలో ముఖ్యపాత్ర పోషించారు. సమావేశం అనంతరం ఉపాధ్యాయులు తమ కృతజ్ఞతలు తెలియ జేస్తూ, ఈ సమావేశం నూతనోత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని తెలిపారు. ఈ సమావేశం ఉపాధ్యాయులందరినీ కొత్త ఉత్సాహంతో తమ పనిని కొనసాగించేలా ప్రేరేపించిం దని అభిప్రాయపడ్డారు.

## ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య



**రాయికోడు, జూలై 30 (జనం సాక్షి) :** మండల వ్యాప్తంగా మంజూరైన ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రముఖ న్యాయవాది జి అంజయ్య సూచించారు. బుధవారం మండల పరిధిలోని యూసుఫ్ పూర్ గ్రామంలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను డిసిఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధన్న పాటిల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలాజీ నర్సింలు లతో కలిసి టెంకాయ కొట్టి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా నిర్మించుకొని సకాలంలో బిల్లులు పొందాలని ఆయన సూచించారు.అతిథులందరికీ ఇసుపూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేదార్నాథ్ పాటిలు మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బస్వరాజ్ పటేల్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్ మాజీ ఎంపీటీసీ మహంకాళి సర్పంచుల పోరం మాజీ అధ్యక్షులు సతీష్ కుమార్, ఏపీవో రమేష్ గృహ నిర్మాణశాఖ అధికారులతో పాటు కాంగ్రెస్ నాయకులు చరణ్, ఆర్ రాజు,భద్రపా రమేష్,రాజ్ మహమ్మద్, జైపాల్ రెడ్డి, శివ రెడ్డి, కాజమియా, బక్కరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 30 (జనం సాక్షి) :** పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకొని భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణ కేంద్రంలోని శాసనపల్లి రోడ్డులో ఉన్న కాశీనాథేశ్వర కాలనీలో మంగళవారం కాలనీవాసులు, ఫౌండేషన్ సభ్యులతో కలిసి రాజ్ కుమార్ రెడ్డి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే తప్పనిసరిగా అందరూ మొక్కలను నాటాలని కోరారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు తమ ఫౌండేషన్ ద్వారా మొక్కలు నాటడం, అవగాహన కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. అదేవిధంగా ఫౌండేషన్ సభ్యులు, కాలనీవాసులతో మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పమ్మ, మధుసూదన్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, హన్మంతు ముదిరాజ్, చల్లా వెంకటేష్, నర్సింహనాయుడు, శివరాజ్, వై.సంతోష్, మన్నె గోపాల్, నర్సింహ, శ్రీనివాస్, ఎం.సంతోష్, వెంకటరావు, నాగురావు, రాజప్ప గౌడ్, బస్వరాజ్, విశాక్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# కోటకొండ పీహెచ్‌సీ పనితీరుపై కలెక్టర్ అసహనం

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 30 (జనం సాక్షి) :** కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరుపై జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అసహనం వ్యక్తం చేశారు.నారాయణపేట మండలం కోటకొండ గ్రామం లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ చాలా తక్కు వ ఉండటం గమనించిన కలెక్టర్ అక్కడి డాక్టర్ ను వివరణ కోరారు. అలాగే ఎన్ సీ డీ ప్రోగ్రాం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈడీడీ ఎన్ని ఉన్నాయని ప్రశ్నించా రు. దాదాపు 6 వేలకు పైగా జనాభా కలిగిన ప్రాంతంలో గత మార్చి, ఏప్రిల్ నెలలో ఒక్క డెలివరీ కాలేదని రిజిస్ట ర్ ను చూసి కలెక్టర్ అవాక్క య్యారు.ఈ డీ డీ అప్ డేట్ లేకపోవడం, జూలై నెలలో కేవలం రెండు డెలివరీలు మాత్రమే జరిగాయని తెలిసి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశా రు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకునేలా మహి ళలకు అవగాహన కల్పించా లని ఆమె సూచించారు. పీ హెచ్ సీ పరిధిలోని 10 సబ్ సెంటర్ల కు గాను 16 మంది డాక్టర్లు ఉన్నా ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎందుకు విజిట్ చేయడం లేదని డాక్టర్ ను ఆమె ప్రశ్నించారు. ఏ ఎన్ సీ, టీబీ, ఎన్ సీ డీ కార్యక్రమాల తీరు సక్రమంగా లేదన్నారు. పీ హెచ్ సీ పరిధిలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయని ఆరా తీసిన కలెక్టర్ ప్రతీ గురువారం ఐరన్ పోలిక్



యాసిడ్ టాబ్లె ట్లు ఇస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. టాబ్లెట్లు నిల్వ ఉన్నా ఎందుకు ఇవ్వడం లేదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో ఆస్పత్రి రిజిస్టర్లు అందుబాటులో లేకపోవడంపై వైద్య సిబ్బందిని నిలదీశా రు. సూపర్ వైజర్‌కు ఫోన్ చేసి బీరువాలో ఉన్న రిజి స్టర్లను తీసుకోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేస్తూ ప్రతీది సూపర్ వైజర్‌పై ఆధారపడితే ఎలాగని ప్రశ్నించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. గవద బిళ్ళల రుగ్మతతో బాధ పడు తున్న ఓ చిన్న పిల్లాడిని చూసిన కలెక్టర్ వెంటనే ఆ పిల్లాడికి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్ ను ఆదేశించారు. వ్యాక్సిన్ల ను కిట్లల్లో పెట్టడం చూసిన కలెక్టర్ ఐఎల్ఎఫ్ మిషన్ లేదా అని డాక్టర్ ను ప్రశ్నించ గా షాట్ సర్క్యూట్ వల్ల మిషన్ చెడిపోయిందని వైద్య సిబ్బంది సమాధానం ఇవ్వ డంతో మరీ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలాగని మండిపడ్డారు. పనితీరు మార్చుకోవాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ సున్నితంగా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కోటకొండ గ్రామంలోని బ్రాహ్మణ వాడలో శీలం రాజేశ్వరి అనే లబ్ధిదారు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రామానికి మొత్తం ఎన్ని ఇండ్లు మంజూ రు అయ్యాయని..? ప్రస్తుతం ఎన్ని పునాది, లెంటల్, స్లాబ్ స్థాయిలో ఉన్నాయని అధి కారులను అడిగి తెలుసుకు న్నారు. అయితే గ్రామానికి మొత్తం 31 ఇండ్లు మొదటి విడతలో మంజూరు కాగా, 28 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యా యని, వివిధ కారణాలతో మిగతా ఇండ్లు ప్రారంభించ లేదని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు బేస్‌మెంట్ లెవల్‌ను పూర్తి చేసుకుంటేనే డబ్బులు ఖాతాలో జమ అవుతాయని ఆమె తెలిపారు.

## రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



**ఉప్పునుంతల, జూలై 30 (జనం సాక్షి) :** సామాజిక ఆరోగ్య కేంద్రము(ఉప్పునుంతలను డిసిహెచ్‌ఎస్ జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ రామకృష్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో విధులకు హాజరైన వారి వివరాలను హాజరు పట్టిక పరిశీలించడం జరిగింది అని సిబ్బంది సమయపాలన పాటించాలని సమాచారం ఇవ్వకుండా విధులకు గైరాజ రైతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని వారన్నారు ఆసుపత్రికి వచ్చే రోగులపట్ల నిర్లక్ష్యం వహించరాదని ,వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉండేటట్లు చూడాలని ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ స్వప్న ,డాక్టర్ శివ లీల ,నర్సింగ్ ఆఫీసర్ ఉఫత్, నిర్మల, కుమారాచారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్న ప్రభుత్వం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి
- ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన కలెక్టర్



**భీమారం, జులై 30 (జనంసాక్షి) :** ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తుందని ప్రజల ఆరోగ్య దృష్ట్యా భీమారం మండల కేంద్రంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సతీష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో స్థానిక ప్రజలకు మరింత వేగవంతమైన మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. అధికారులు నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎస్.ఐ. శ్వేతతో కలిసి సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదులు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, శుద్ధమైన త్రాగునీటిని ఇవ్వాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రపరచుకోవడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో కొనసాగుతున్న మూత్రశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, విద్యార్థులకు మంజూరైన స్పోర్ట్స్ కిట్లను అందించి క్రీడారంగంలో రాణించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సమయం పాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి ఫెర్టిలైజర్ దుకాణాన్ని సందర్శించి స్టాకు నిల్వలు, ధరల పట్టిక, రశీదు పుస్తకాలను పరిశీలించారు. రైతులకు విక్రయించిన వాటికి సంబంధించి రశీదు జారీ చేయాలని, దుకాణం ఎదుట ధరల పట్టిక, స్టాకు నిల్వల వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువుల విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. డి.సి.ఎం.ఎస్. రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని బూరుగుపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా అంశాలను పరిశీలించారు. వర్షాకాలం అయినందున పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు నీటి నిల్వలను తొలగించడంతో పాటు ఆయిల్ బాల్స్, బయోటెక్ స్ప్రే పిచికారి చేయాలని తెలిపారు. ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిరుపేదల కొరకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ది పొందిన లబ్దిదారులు తమ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని, నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. అనంతరం, జిల్లా వ్యవసాయ అధికారి భుక్య ఛత్రు, తహసిల్దార్ సదానందంతో కలిసి మండలంలోని దాంపూర్ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పరిసరాలు, ఆహార నాణ్యత, రిజిస్టర్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా చర్యలు తీసుకుంటుందని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమయానుసారంగా పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన మందులు, పోషకాహారం అందించి సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గర్భిణులకు గర్భస్థ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వైద్య పరీక్షలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని గుర్తించేందుకు స్థల పరిశీలన చేశారు.



# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ఖానాపూర్ జూలై 30 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం మండలంలోని సత్తెనపెల్లి గ్రామ రైతు వేదికలో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త రేషన్ కార్డులు పేదలకు వరంగా మారాయన్నారు. మండలంలో మొత్తం 1,669 కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు 2,532 కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడం జరిగిందన్నారు. వచ్చే నెల నుంచే లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. ఇంకా అర్హులైన వారు మిగిలి ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటివరకు మండలంలో మొత్తం 4201 కొత్త కార్డులు మంజూరు అయినట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా కొత్త కార్డుల మంజూరులేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. పెన్షన్లు, రైతు రుణమాఫీ, యువకిరణాలు వంటి పథకాలు కార్డులు లేకపోవడంతో అర్హులకు మంజూరు కాలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహాలక్ష్మి ఫ్రీ బస్సు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, రూ.500కి గ్యాస్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కడెం ప్రాజెక్టు మరమ్మత్తులకు 9కోట్ల 40 లక్షలు, సదర్మాట్ కెనాల్ మరమ్మతులకు రూ.39 లక్షలు, ఖానాపూర్ పట్టణానికి త్రాగునీటి సదుపాయం కోసం అమృత్ పథకం కింద రూ.22 లక్షలతో పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే కలిసి మహిళలకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అలాగే మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇందిరా మహిళ పథకం కింద మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్, వైస్ చైర్మన్ మాజీద్, పి ఏ సి ఎస్ చైర్మన్ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డిఎస్ఓ రాజేందర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సునీతతో పాటు పలువురు అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కెనాల్ మరమ్మతు పనులు ప్రారంభం

- రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందడుగు వేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పెద్దవంగర, జులై 30 (జనంసాక్షి) :** మండలంలోని వడ్డేకోతపల్లి గ్రామంలో సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, స్వంత ఖర్చులతో కెనాల్ క్లినింగ్ పనులకు ప్రారంభం తెలిపారు. గ్రామ ప్రజల నుంచి వచ్చిన వినతిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకుని, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బుధవారం వడ్డేకోతపల్లి గ్రామానికి చేరుకుని కెనాల్ క్లినింగ్ పనులకు కొబ్బరికాయ కొట్టి శుభారంభం చేశారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి పాల్గొని వడ్డేకోతపల్లి కెనాల్ నుంచి చిన్న చెరువు వరకు సాగు నీరు దిగలేని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, మురుగు, మట్టి, చెత్త తొలగించి కాలువను శుభ్రపరచే పనులను చేపట్టారు. మండల జర్నలిస్టులు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని వినతి పత్రం అందించగా పరిశీలించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే స్పందన, ప్రజల పట్ల గల బాధ్యతాయుత వైఖరి యశస్విని రెడ్డి నాయకత్వానికి అద్దంపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, రంగు మురళి,జాటోత్ నెహ్రు నాయక్, మూతినేని శ్రీనివాస్,బండారి వెంకన్న, బానోత్ సీతారామ్ నాయక్, పొడిశెట్టి సైదులు,దంతలపల్లి రవి,ఉపేందర్, మోహన్ రావు,మల్లికార్జున చారి, ఒరిగంటి సతీష్, వేణు, ఎరుకల సమ్మయ్య, ఎండి జానీ, ధనంజయ్,గద్దల ఉప్పలయ్య, ముత్యాల పూర్ణచంద్రర్, మద్దెల యాకన్నా, దేశెట్టి శ్రీనివాస్, చాట్ల యాకన్నా, తదితరులు పాల్గొన్నారు.

# మిమ్స్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థిని తల్లిదండ్రుల, బంధువుల రాస్తారోకో
- అనుమతిలేని మిమ్స్ కళాశాల సీజ్ చేయాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్



**మంచిర్యాల ప్రతినిధి జూలై 30 (జనంసాక్షి) :** మంచిర్యాలలోని ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సహస్ర అనే విద్యార్థిని కాలేజీ బిల్డింగ్ మూడో అంతస్తుపై నుండి పడి మృతిచెందగా, విద్యార్థిని తల్లిదండ్రులు బంధువులు విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థిని మృతికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని రాస్తారోకో చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు లోని మిమ్స్ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సహస్ర అనే విద్యార్థిని లక్షెట్టిపేట మండలం కొత్తూరు గ్రామానికి కొత్తపల్లి రమేష్ వనిత దంపతుల కూతురు సహస్ర మిమ్స్ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. మంగళవారం సాయంత్రం సహస్ర కళాశాల బిల్డింగ్ మూడో ఫ్లోర్ నుండి కింద పడి తీవ్ర గాయాలపాలైంది . కళాశాల సిబ్బంది స్థానికులు వెంటనే మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు పరిస్థితి విషమంగా మారడంతో వెంటనే ఆమెను హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కళాశాల యజమాన్యం రాత్రి 10 గంటలకు విద్యార్థిని తండ్రి రమేష్‌కు ఫోన్ చేసి మీ అమ్మాయి మెట్ల మీద నుంచి జారి పడిందని చెప్పారని మృతురాలి తండ్రి పేర్కొన్నారు. తీర మంచిర్యాలకు వచ్చి చూసే సారికి తన కూతురు అపస్మారకస్థితిలోకి వెళ్లిందని కాలేజీ యజమాన్యంపై పలు అనుమానాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. మూడో అంతస్తు నుంచి కిందపడితే మెట్ల మీదనుండి జారి పడింది చెప్పడం వెనుక ఏదో ఆంతర్యం ఉందని ఆయన పేర్కొన్నారు. తన కూతురు చావుకు కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాలని తెలిపారు. కాలేజీ యజమాన్యం సిబ్బంది నిర్లక్ష్యం మూలంగానే తమ కూతురు మృతి చెందిందని విద్యార్థిని తల్లిదండ్రులు బంధువులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి ముందు రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు . తమ కూతురి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని రోడ్డుపై బైఠాయించి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిరసన కారులను శాంతింపజేసి కళాశాల యజమాన్యంతో మాట్లాడే ఏర్పాటు చేస్తానని చెప్పడంతో ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు.

**అనుమతిలేని మిమ్స్ కళాశాలను సీజ్ చేయాలి : విద్యార్థి సంఘాల డిమాండ్**

అనుమతి లేకుండా కళాశాల యాజమాన్యం హాస్టల్ నడుపుతున్నారని పలు మార్లు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘం నాయకులు పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణంలో చాలా కళాశాలలకు అనుమతి లేకుండానే నడుస్తున్నాయని కళాశాల యాజమాన్యం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ ఘటన జరిగిందని ఈ ఘటనకు బాధ్యులైన కళాశాల యజమాన్యం యజమాన్యం ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, కళాశాల సీజ్ చేయాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

# అధిక ధరలకు యూరియా అమ్మితే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- ప్రభుత్వ ఆసుపత్రి లోనే ప్రసవాలు జరగాలి
- చిల్పూర్ మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**స్టేషన్ ఘన్పూర్, జూలై 30 (జనం సాక్షి) :** కావాలని ఎరువుల కొరతనుసృష్టించిన,అధిక ధరలకు యూరియాను అమ్మిన సంబంధిత వారిపై కఠిన చర్య లు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టర్ చిల్పూర్ మండలంలో పలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా చిన్న పెండ్యాలలో పలు ఫర్టిలైజర్ షాపులను సంద ర్శించి, యూరియా స్టాక్ ను పరిశీలించారు.ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోజువారీగా స్టాకు వివరాలు బోర్డుపైన ప్రదర్శించాలన్నారు. జిల్లాలో ఎరువుల కొరతలేదని, ఎవరైనా కృత్రిమ ఎరువుల కొరతను సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని తెలియజే శారు. రైతులు డీలర్ల వద్ద కొనుగోలు చేసే విత్తనాలు ఎరువులకు సంబంధించిన రసీదులను విధిగా తీసుకో వాలని సూచించారు.ఫర్టిలైజర్ దుకాణదారులువిధిగా తమ స్టాక్ బోర్డును అందరికీ కనపడేవిధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎరువుల కొరత ఎవ్వరు సృష్టించకుండా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం కలెక్టర్ జడ్పీ హైస్కూల్ కి వెళ్లి మెనూ ప్రకారం వంటలు చేసారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.10 వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు.మధ్యాహ్నం భోజనగురించి విద్యార్థు లను అడుగుతూ మెనూ ప్రకారం పెడుతున్నారా ఏమై నా ఇబ్బంది ఉందా,అందరూ బాగాతింటున్నారా,ఏమై నా సమస్యలు ఉంటే చెప్పండి అని విద్యార్థులనుఅడి గారు. మెను ప్రకారం భోజనం పెడుతున్నారని, పరిశు భ్రంగానే వండుతున్నారని, రుచికరం గానే ఉంటుందని విద్యార్థులు తెలిపారు.అందరూ బాగా తినాలని,బాగా చదవాలని,ఏదైనా సబ్జెక్టులో ఇబ్బంది కలిగితే వెంటనే సంబంధిత ఉపాధ్యాయ దగ్గరికి వెళ్లి మరొకసారి ఆ చాప్టర్ ని ఒకటికి రెండుసార్లు చెప్పించుకోవాలన్నారు.

ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతోఎప్పటికప్పుడు మాట్లాడుతూ,వాళ్లు ఏ సబ్జెక్టులైతే వీక్ గా ఉంటారో ఆ సబ్జెక్టు పైన అదనపు తరగతులను నిర్వహించాల న్నారు.పదవ తరగతి పరీక్షలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని అందుకోసం ఇప్పటి నుండే ఒక కార్యాచ రణ రూపొందించుకోవాలని, స్పోకెన్ ఇంగ్లిష్ క్లాస్ కోసం ప్రత్యేక కార్యాచరణ తయారు చేయాలనీ ఉపా ధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. మల్కాపూర్ పీహెచ్సి ని కలెక్టర్ సందర్శించి సీజనల్ వ్యాధుల మీద తీసుకుంటున్న చర్యల గురించి వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓపి, సిబ్బంది అటెండెన్స్ తదితర రిజిస్టర్ లను,మందుల నిలవలను, ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న పెషేంట్ లను పరిశీలించారు.

మలేరియా,డెంగ్యూ, చికెన్ గున్యా, పరీక్షలు పెరగాల ని, వర్షాకాలం ముగిసేవరకు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం ఉంటేనే సిబ్బంది కి సెలవు మంజూరు చేయాలన్నారు. ఒకేరోజు 5 గురు సిబ్బందికి సెలవులు మంజూరుచేసిన మెడికల్ ఆఫీసర్ మీద జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే ఆ అధికారికి మెమో ఇవ్వాలని డీఎంహెచ్ఓ ని ఆదేశించారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మా ణాలను పరిశీలించి, ఏమైన ఇబ్బందులు ఎదురవుతు న్నాయా అని లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకు న్నారు. మేస్త్రి లతో పంచాయతీ సెక్రటరీలు సమావేశా న్ని ఏర్పరచుకొని త్వరగా నిర్మాణాల ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు త్వరగా నగదు జమ అయ్యేలా చూడాలన్నారు. రాజవరం లోని ప్రైమరి పాఠశాలను,అంగన్వాడీకేంద్రాన్ని సందర్శించి చిన్నారు లతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. అంగన్వాడిలో మీరేం నేర్చుకున్నారో చెప్పండి అని, చిన్నారులను అడిగి తెలుసుకొని, డ్రాయింగ్ వేస్తున్న పిల్లలను పరిశీలించారు.

# పామాయిల్ పంటసాగుపై అవగాహన కల్పించాలి

- కెఎన్ బయో సైన్స్ ఆయిల్ ఫామ్ నర్సరీ సందర్శించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, జులై 30(జనంసాక్షి) :** పామాయిల్ పంట సాగుతో రైతు పెట్టుబడి తక్కువ పెట్టి ఎక్కువ ఆదాయం పొందవచ్చని రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. బుదవారం వెంకటాపూర్ మండలం జవహర్ నగర్ దగ్గరలోని కె ఎన్ బయోసైన్స్ ఆయిల్ ఫామ్ నర్సరీని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నర్సరీ విస్తీర్ణం ఎన్ని ఎకరాలు? నర్సరీలో ఎన్ని మొక్కలు పెంచారు? ఎన్ని నాటుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి? ఈ సంవత్సరం రైతులకు నాణ్యమైన మొక్కలు ఉన్నాయా ? తదితర విషయాలపై జిల్లా ఉద్యాన అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం రైతులకు నర్సరీలో ఒక సంవత్సరం వయస్సు మొక్కలను పెంచి ఇవ్వగా, ఇంకా 1,17,000 మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఒక మొక్క 1.2 మీటర్ ఎత్తులో, 12 ఆకులు కలిగి నాణ్యమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయని జిల్లా ఉద్యాన అధికారి దండు సంజీవరావు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించి ఎక్కువ ఎకరాల్లో నాటించాలని ఉద్యాన అధికారులకు ఆదేశించారు. నర్సరీ నిబంధనల మేరకు నాణ్యమైన మొక్కలను రైతులకు సకాలంలో అందించాలని, నర్సరీ నిర్వాహకులకు, నర్సరీ కంపెనీ వారికి కలెక్టర్ ఆదేశించారు. అన్ని రికార్డులు సిద్ధంగా ఉంచాలని నర్సరీ ఇంచార్జికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ ఇంచార్జి ఉద్యాన అధికారి జె శ్రీకాంత్, నర్సరీ నిర్వాహకుడు కర్నాకర్, ములుగు, వెంకటాపూర్ ఆయిల్ ఫామ్ కంపెనీ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ నవీన్ నాయక్, జైన్ డ్రిప్ కంపెనీ ప్రతినిధి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# వల్మిడి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రైతుల ధర్నా



**పాలకుర్తి, జూలై 30(జనంసాక్షి) :** విద్యుత్ సరఫరాల్లో అంతరాయం కలుగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడతో నిరసనగా బుధవారం మండలంలోని వల్మిడి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆ గ్రామ రైతులు ధర్నా చేశారు. రైతులు కొలుపుల సుధాకర్, గుండు శ్రీనివాస్, చెబెల్లి మల్లయ్య, వాసూరి అంజయ్య మాట్లాడారు. వ్యవసాయరంగానికి నిరంతర విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం కలుకగడంతో రైతులు నాట్లు పోసే రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. ఈ విషయంపై ఏఈకి పలుమార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదని వాపోయారు. దీంతో వరినాట్లు నిలిచి పోయాయని గుర్తు చేశారు. విద్యుత్ అంతరాయం లేకుండా ఆ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై సబ్‌స్టేషన్ ఆపరేటర్ను వివరణ కోరగా విద్యుత్ సబ్ స్టేషన్లో జంపర్ కట్ కావడంతో ఆరు ట్రాన్స్ఫార్మర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు, వెంటనే మరమ్మత్తు చేసిన విద్యుత్ సరరా చేస్తున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో చేవెల్లి నరసయ్య, గుట రాజు, శ్రీశైలం, పోలాస బిక్షు ఉన్నారు.

# పాకాలకు నీరు చేరడంతో రైతుల్లో హర్షం

- వరి నాట్లకు సిద్ధమైన అన్నదాతలు..



**ఖానాపురం, జులై 30 (జనం సాక్షి):** పాకాల ప్రాంత వర ప్రదాయిని అన్నదాతలకు ధన్య రాశులు కురిపించే పాకాల చెరువు నీరు 26 ఫీట్లకు చేరుకోవడంతో ఈ ప్రాంత రైతాంగం హర్షం ప్రకటిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పాకాల చెరువులోకి నీరు సమృద్ధిగా చేరుకున్నది. దీంతో ఖానాపురం మండల ప్రజలు రైతులు సంతోషం వ్యక్తం చేశారు పాకాల చెరువులో 26 సీట్లు నీరు చేరడంతో ఈ ప్రాంత రైతాంగం వరి నాట్లు వేయడానికి పంటల సాగుకు సన్నద్ధమయి ముమ్మరంగా వరినట్లు వేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. పాకాల చెరువు కింద పొలాలు ఉన్న రైతులందరూ సంతోషం వ్యక్తం చేశారు చెరువులోకి నీరు 30 ఫీట్ల నీళ్లు వస్తే రెండు పంటలకు సరిపోయే మీరు అందుబాటులో ఉంటుంది. ఇంకా నాలుగు ఫీట్ల నీరు చెరువులోకి వస్తే రెండు పంటలకు నీరు సమృద్ధిగా సరిపోతుంది. పాకాల కట్టమీద పాకాల తల్లికి ఖానాపురం మాజీ సర్పంచ్ తక్కెళ్ళపల్లి రమేష్, దేవినేని వెంకట ప్రసాద్ , రామాపురం మాజీ ఉపసర్పంచ్ కుమార్ , పూజలు చేశారు.

# వైద్య కళాశాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- శానిటేషన్ సిబ్బంది ఆసుపత్రిని శుభ్రంగా ఉంచుకోవాలి
- వైద్యులు సమయపాలన పాటించాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోగ్థు

**తాండూరు, జూలై 30 (జనంసాక్షి) :** తాండూర్ నియోజకవర్గంలో కొడంగల్ కు సంబంధించి కొడంగల్ ప్రభుత్వ వైద్య కళాశాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోగ్థు అన్నారు.బుధవారం తాండూర్ లో కొడంగల్ ప్రభుత్వ వైద్యకళాశాల పనులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లతో కలిసి పరిశీలిం చారు.ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సంబంధించిన మ్యాపును పరిశీలించి, అన్ని రూములకు సీరియల్ నెంబర్లు వేయాలని, సిసి రోడ్లు, క్యాంపౌండ్ వాల్, సిసిటివిలు ఏర్పాటు, సెక్యూరిటీ రూమ్ ఏర్పాటు, వాటర్, లైట్స్, అన్ని మౌలిక సౌకర్యాలతో ఒకవారము వరకు పూర్తి చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ప్రతిరూమును, ప్రతివార్డును తిరిగి అక్కడి



సిబ్బందితో మాట్లాడారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఐసియు, డయాగ్నోస్టిక్ సెంటర్, బ్లడ్ బ్యాంకు, ఎమర్జెన్సీ వార్డ్, జనరల్ వార్డ్,ఐసిటిసి ల్యాబ్, గర్భిణీ లకు చికిత్స అందించే సెంటర్ ను, గొంతు, చెవి, ముక్కుసంబంధించి ఓ పి లను, ఆప్థమాలాజీ. ఆర్థోపెడిక్, బ్లడ్ బ్యాంక్, డెంటల్, ఐ సి.యు,ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాలలో పని చేస్తున్న సిబ్బందితో ఎంతకాలంనుండి పనిచేస్తున్నారు, మీకు ఇంకా ఏవైనాపరికరాలు అవసరమున్నా యా అని పూర్తివివరాలు అడిగి తెలుసు కున్నారు.డాక్టర్స్ సమయపాలన పాటించాలని ఆదేశించారు.అత్యవసర విభాగం సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.శానిటేషన్ సిబ్బంది హాస్పిటల్ని శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.ఓపి ని తనిఖీ చేశారు. మందుల రూమును పరిశీలించి అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. తధనంతరం మాత, శిశు ఆరోగ్య కేంద్రంను పరిశీలించారు. వివిధ విభాగాలకు సంబందించిన గదులను పరిశీలించారు. రోజుకు ఎంతమంది గర్భిణీ స్త్రీలు వస్తున్నారు, రికార్డ్స్ రాస్తున్నారా, సరిపోను మందులు అందుబాటులో ఉన్నాయా, పూర్తివివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించాలని, అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హార్స్ చౌదరి, కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిజిఎచ్ మాలతీ, సూపరింటెండెంట్ సునీత తహసీల్దార్ తార సింగ్, ఆర్ఎంఓ ఆనంద్ గోపాల్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ విక్రమ్ సింహ రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బి. రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ, కాంట్రాక్టర్ చంద్ర శేఖర్ ఇఇ ఉమేష్, సంబంధిత అధికారులు, డాక్టర్ లు, తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్ యూరాలజిస్ట్ ప్రొ.రాంరెడ్డికి ఆత్మీయ సత్కారం



**ఖైరతాబాద్, జూలై 30 (జనంసాక్షి) :** నిమ్స్ యూరాలజి, నెఫ్రాలజీ విభాగం ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ బ్లాక్ 5వ ఫ్లోర్ ట్రామా ఆడిటోరియంలో ప్రొ.రాంరెడ్డికి సన్మాన కార్యక్రమం జరిగింది. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో ప్రఖ్యాత యూరాలజిస్ట్ ప్రొ.రాంరెడ్డిని యూరాలజి విభాగం సీనియర్ ప్రొ.రాహుల్ దేవరాజ్ పర్యవేక్షణలో యూరాలజి మరియు నెఫ్రాలజీ వైద్యులు, సిబ్బం ది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ నగరి బీరప్ప మాట్లాడుతూ డా.రాంరెడ్డి తన 32 సంవత్సరాలు ఆయన రోగులకు అందించిన విశేష సేవలను కొని యాడారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రొ.రాహుల్ దేవరాజ్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొ.శాంతివీర్, నెఫ్రాలజీ హెచ్ఓడి ప్రొ.భూషణ్ రాజు, ప్రొ.గంగా ధర్ , ప్రొ.స్వర్ణలత మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో అదనపు మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రొ.నాగేష్, డా.విద్యా సాగర్ , డా.రామచంద్రయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.చరణ్ రాజ్, డా.రాకేష్, ప్రొ.సాయి సతీశ్, ప్రొ. చంద్ర శేఖర్, ప్రొ.సాయిబాబా మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, ఇతర ప్రముఖ వైద్య నిపుణు లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మర్రిగూడ పోలీస్ స్టేషన్ ఆకస్మిత తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**మర్రిగూడ, జూలై 30 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా, దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో మర్రిగూడ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆకస్మిత తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పని తీరు,పోలీసు స్టేషన్ పరిధిలోని పరిసరాలు, స్థితిగతులు గురించి యస్.ఐ ను అడిగి తెలుసుకుని రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్,స్టేషన్ రైటర్, లాక్ అప్, యస్.హెచ్.ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించి, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు,స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేసి కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని దర్యాప్తులో ఉన్న కేసులను సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం శిక్ష పడే విధంగా కృషి చేయాలని అన్నారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నేర నియంత్రణకు కృషి చేయాలని, బ్లూ కోల్ట్ , పెట్రో కార్ డ్యూటీ లో ఉన్నప్పుడు 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని,స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటుపై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు.సైబర్ క్రైమ్, డయల్ 100



వాటి వినియోగంపై విద్యార్థులు,ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది పని చేయాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి,అక్రమ ఇసుక రవాణా, పిడియస్ రైస్ అక్రమ రవాణా,జూదం లాంటి వాటిపై ఉక్కుపాదం మోపాలని , పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్న వారిపై నిఘా ఉంచి గంజాయి తాగే వారిని, వారికి సరఫరా చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్‌కి వచ్చిన పిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్.ఐ గారిని ఆదేశించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక ఐపీఎస్,ఎస్.ఐ కృష్ణా రెడ్డి మరియు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే..

- రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు

**నాగర్‌కర్నూల్ ఆర్సీ, జూలై 30 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలో ఉన్న బిసి గురుకుల పాఠశాలలో వండిన భోజనం తినిన అనంతరం సుమారు 110 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రభుత్వం ఎంతగా నిర్లక్ష్యం చేస్తోంది అనే దానికి ఇది మరో ఉదాహరణగా నిలిచింది. ఈ ఘటనపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాగర్ కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ గురుకుల పాఠశాల ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా %ూదీవూ% రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ, ఇలాంటి దారుణమైన ఘటనలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఇరవై నేలలోనే రాష్ట్ర వ్యాప్తంగా 94మంది విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారు కాకుండా నిత్యకృత్యంగా మారిన గురుకుల ఫుడ్ పాయిజన్ లపై ప్రభుత్వం కనీస స్పందించలేదు. ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడే ధోరణి కొనసాగితే అది ఎంతో దురదృష్టకరం. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థుల ఆరోగ్య భద్రతపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, జ్యోతిబాపూలే, కె.జి.బి.వి. గురుకులాల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల మరణాలపై సిట్టింగ్ జడ్జితో ప్రత్యేక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన కామన్ మెనూ పథకాన్ని అన్ని విద్యాసంస్థల్లో సమర్థవంతంగా అమలు చేయాలని, హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించేందుకు పర్యవేక్షణను కఠినంగా కొనసాగించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. అద్దె భవనాల్లో, శిథిలావస్థలో నడుస్తున్న గురుకులాలకూ తక్షణమే భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పక్కా భవనాలు నిర్మించాలని. అలాగే సంక్షేమ హాస్టళ్లపై నిరంతర




పర్యవేక్షణ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి గురుకుల పాఠశాల పక్కన అదనపు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలకు విలువలేని విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇప్పటివరకు గురుకులలో చనిపోయిన విద్యార్థుల అందరి హత్యలు ప్రభుత్వ హత్యలే అని, రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యాశాఖ తన దగ్గరే వున్నప్పటికీ గురుకులాల్లో ఇన్ని ఘటనలు జరుగుతున్నా రేవంత్ రెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటు అని ప్రభుత్వం తక్షణమే స్పందించి డిమాండ్లను నెరవేర్చకపోతే %ూదీవూ% రాష్ట్రవ్యాప్తంగా పెద్ద స్థాయిలో ఉద్యమాన్ని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేష్ తేజ, రాష్ట్ర కార్యసమితి సభ్యులు సౌమ్య, అర్జున్, నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ శివశంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారుబాబు, శంతన్, ప్రశాంత్, కల్వకుర్తి నగర కార్యదర్శి వంశీ,అనిల్, సాయి,భరత్, మల్లేష్ యాదవ్, ప్రసాద్ కుమార్, భాను, కీర్తన, కృష్ణవేణి, గాయత్రి, పల్లవి, విద్యార్థులు ఏబీవీ కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మర్రి రాజిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

- అంత్యక్రియల్లో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్ కుమార్



**మర్పల్లి, జూన్ 30 (జనం సాక్షి) :** మర్రి రాజిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి, రైతు సంఘం నాయకుడు మర్రి రాజిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. బుధవారం ఆయన అంత్యక్రియలు సిరిపురం గ్రామంలో జరిగాయి. కుటుంబ సభ్యులను పరామర్శించి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో జాతీయ విపత్తుల మాజీ చైర్మన్ మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గూడెం రాములు యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు సురేష్ యాదవ్, సురేష్, సిరిపురం మాజీ సర్పంచ్ మల్లయ్య, కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన సీపీ




**ఖమ్మం, జూలై 30 (జనంసాక్షి) :** నగరంలోని ప్రకాష్ నగర్‌లో గల పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, పనితీరు పరిశీలించారు. రోడ్ల మరమ్మత్తులు, వర్షాలతో దెబ్బతిన్న సీసీ కెమెరాలను వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. నేరాల నియంత్రణలో కీలకంగా పనిచేస్తున్న సీసీ కెమెరాల ఏర్పాటు పై పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

## చేయూత పింఛన్ల పంపిణీకి కొత్త విధానం

- ముఖ గుర్తింపు ద్వారా అందించాలని నిర్ణయం
- ప్రత్యేక యాప్ రూపొందించిన సెర్ప్ అధికారులు
- చిత్రాలు సరిపోల్చుకొక పలుచోట్ల ఇబ్బందులు పడ్డ పింఛనుదారులు

**బొంరాస్‌పేట, జూలై 30 (జనం సాక్షి) :** చేయూత పింఛన్ల పంపిణీ పోస్ట్ ఆఫీసుల ద్వారా ముఖ చిత్రాలతో గుర్తించి పంపిణీ చేసేందుకు సెర్ప్ అధికారులు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. మండల పరిధిలోని పలు పోస్టు ఆఫీసులలో వృద్ధుల ముఖచిత్రాలు స్కాన్ కాకపోవడంతో ఇబ్బందులుపడ్డారు. ప్రభుత్వము ముఖ గుర్తింపు విధానం తీసుకురావడం వల్ల బోగస్ పింఛన్ల లెక్క తేలుతుందని, వేలిముద్రలు రాని లబ్ధిదారులకు పంచాయితీ కార్యదర్శులు డ్రా చేసి అందిస్తున్నారని, ఇలాంటి వారిలో



ఎవరైనా బోగస్ లబ్ధిదారులు ఉంటే వెంటనే తేలిపోతుందనే ప్రభుత్వము ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చి ముఖ చిత్రాల గుర్తింపు ద్వారా పెన్షన్లు పంపిణీ చేసేందుకు నిర్ణయించింది.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి
- 50 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిక



**బొంరాస్‌పేట, జూలై 30 (జనం సాక్షి) :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండి సత్తా చాటాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు.బుధవారం మండల పరిధిలోని బొట్లవనితండాలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తండాకు చెందిన 50 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోట్ల యాదగిరి,మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి,మాజీ ఎంపిటిసి తిరుపతయ్య, మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్,యువ నాయకులు మల్లేష్ గౌడ్,రవిగౌడ్,నరేష్ గౌడ్, సొంనాథ్,హిరు నాయక్,నరసింహ నాయక్, నెహ్రూ నాయక్, లక్ష్మణ్ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ చైర్మన్‌గా శ్రీనివాస్ రెడ్డి

**పరిగి, జూలై 30 (జనం సాక్షి) :** పరిగి పట్టణంలోని ప్రజా భవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) కమిటీ పరిగి చైర్మన్‌గా కక్కులూరి శ్రీనివాస్ రెడ్డి అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రెడ్డి ని పాలకవర్గ కమిటీ సభ్యులుగా ప్రమాణం చేసిన ఇతర సభ్యులను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అభినందిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వ్యవసాయ రంగం రైతు బాగోగులతో నేరుగా సంబంధమున్న అత్యంత కీలక రంగం. ఎట్మా కమిటీ ద్వారా రైతులకు నూతన సాంకేతికత, శిక్షణలు,ఫార్మింగ్ మోడళ్లపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పై ఉంది.మీరు కమిటీ సభ్యులందరితో కలిసి రైతులకు అండగా నిలవాలి.ప్రతి రైతు బాగుపడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.రైతులకు వ్యవసాయ పరపతి సంఘాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని,వాటిని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని సూచించారు.పరిగి పట్టణంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ కమిటీ నూతన భవన నిర్మాణానికి రూ.25 లక్షల వ్యయంతో త్వరలో శంకుస్థాపన చేయనున్నట్టు



ఎమ్మెల్యే తెలిపారు.ఈ భవనంతో రైతులకు వ్యవసాయ పరికరాలు,సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణల వంటి సేవలు మరింత సమర్థవంతంగా అందించడమే లక్ష్యం అని అన్నారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది వ్యవధిలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని రైతులకు 24వేల కోట్లతో భారతదేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రుణమాఫీ చేసిన ఘనత రేవంత్ సర్కార్కు దక్కిందని పేర్కొన్నారు. అంతేకాకుండా కేవలం 9 రోజుల వ్యవధిలోనే 9000 కోట్ల రైతు భరోసానిచ్చి రైతాంగానికి తమ ప్రభుత్వం రైతులపై ఉన్న చిత్తశు ద్ధికి నిదర్శనం అన్నారు.నిరంతరం రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలుచేసి ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆయిల్‌పామ్ తోటలతో ప్రయోజనాలు ఆయిల్ పాం మొక్కలు నాటిన తర్వాత నాలుగో ఏడాది నుంచి కాపు మొదలై 30ఏళ్ల పాటు ఆదాయం పొందవచ్చు.ఈ మొక్కల పెరిగే వరకు మొదటి మూడేళ్లు అంతర పంటలు సాగు చేసుకోవచ్చు.ఈ తోటకు తెగుళ్లు, చీడపీడల బెడద తక్కువ. తుఫాన్, వడగండ్ల వాన, ప్రకృతి వైపరీత్యాలను సైతం ఈ మొక్కలు సమర్థంగా తట్టుకుంటాయి.అలాగే అడవి పందులు, కోతుల,దొంగల,బెడద ఉండదు అని అన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు పార్థసారథి పంతులు,పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్,పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ,పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి.అయూబ్, డిసిసి ఉపాధ్యక్షులు భీమ్ రెడ్డి,డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్,దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి,పూడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేంద్ర ముదిరాజ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు అనెం ఆంజనేయులు,రాజ పుల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, గోపాల్, తౌరియా నాయక్, అయూబ్, మహిపాల్, పెంటన్న, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ బకాయిలు ఉంటే కేటాయింపులు ఇవ్వొద్దు

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, జూలై 30 (జనంసాక్షి) :** సీఎంఆర్ ధాన్యం పెండింగ్ ఉన్న మిల్లులకు వచ్చే సీజన్ లో ఎట్టి పరిస్థితుల్లో కేటాయించేది లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లో పౌర సరఫరాల శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి 2023 - 24 పెండింగ్ పై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బకాయిలు పెండింగులో ఉన్న మిల్లర్లు గడువులోగా సీఎంఆర్ ధాన్యాన్ని అందించాలని ఆదేశించారు.సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లర్లకు వచ్చే సీజన్‌లో సీఎంఆర్ కేటాయించేది లేదన్నారు.బకాయి ఉన్న మిల్లర్లు 100శాతం బ్యాంక్ గ్యారెంటీ ఇస్తేనే ఆ మిల్లులకు సీఎంఆర్ ధాన్యాన్ని కేటాయించడం జరుగుతుందని తెలిపారు.మిల్లర్లు సీఎంఆర్ ధాన్యాన్ని వేగంగా అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఓ మోహన్ బాబు, ఏసీఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, బెనర్జీ, డీటీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.





# ఒడిదొడుకుల్లో మార్కెట్లు

- టాప్ గెయినర్స్ ఇవే..



భారత ఈక్విటీలు ఈ రోజు క్యూ1 ఫలితాలతో నడిచాయి. 2025 జూన్ 30తో ముగిసిన తొలి త్రైమాసికం ఫలితాలను విడుదల చేసిన తర్వాత సెన్సెక్స్‌లో ఎల్ అండ్ టీ, ఎన్టీపీసీ, ఏషియన్ పెయింట్స్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. దీనికి తోడు భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై సందిగ్ధత, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్యపరపతి విధాన నిర్ణయం ఇన్వెస్టర్లను పక్కకు నెట్టి స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులకు లోనయ్యాయి. సెషన్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 143.9 పాయింట్లు (0.18 శాతం) పెరిగి 81,481.86 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 34 పాయింట్లు లాభపడి 24,855.05 వద్ద ముగిసింది. అదేసమయంలో ఎల్అండ్‌టీ, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, మారుతీ సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్, ట్రెంట్ షేర్లు లాభాల్లో ముగిశాయి. టాటా మోటార్స్, బజాజ్ ఫిన్సర్వ్, కొటక్ మహీంద్రా బ్యాంక్, పవర్ గ్రిడ్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.07 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.52 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ 0.31 శాతం, నిఫ్టీ ఫార్మా 0.01 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 0.24 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ రియల్టీ (0.96 శాతం), నిఫ్టీ ఆటో (0.6 శాతం) అత్యధికంగా నష్టపోయాయి. మార్కెట్ ఒడిదుడుకుల అంచనాలను కొలిచే ఇండియా వీఐఎక్స్ 2.77 శాతం నష్టంతో 11.21 వద్ద ముగిసింది.




## వేధిస్తున్న నైపుణ్యాల కొరత



- భారత్‌లో పూర్తిస్థాయిలో పుంజుకోని ఆయా రంగాలు
- ప్రపంచవ్యాప్తంగా ఏఐ, ఎంఎల్ నిపుణులకు డిమాండ్
- యువత నైపుణ్యాలపై దృష్టి సారించాలంటున్న నిపుణులు

**జనంసాక్షి:** ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేథ (ఏఐ), మెషీన్ లెర్నింగ్(ఎంఎల్) నైపుణ్యాలకు డిమాండ్ అమాంతం పెరగడంతో అందుకు తగ్గట్టుగానే మన దేశంలో, రాష్ట్రంలో ఎడ్ టెక్ రంగం క్రమంగా గణనీయ వృద్ధిని సాధిస్తోంది. ఏఐ కేంద్రీకృత కోర్సుల విస్తరణకు విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య భాగస్వామ్యాలు ఊపందుకుంటున్నాయి. విద్యా రంగంలో, నైపుణ్యాలను పెంచుకునే విషయంలో ఏఐను ఏకీకృతం చేయడానికి ఉద్దేశించి ప్రభుత్వ కార్యక్రమాలు ఈ దిశలో ముందుకు సాగుతున్నాయి. ఏఐ, ఎడ్‌టెక్ మార్కెట్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాబోయే సంవత్సరాల్లో ఈ మార్కెట్ పరిమాణంలో గణనీయమైన పెరుగుదల ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వివిధ పరిశ్రమల్లో ఏఐ నైపుణ్యాలకు ఆదరణ పెరగడంతో ఏఐ, ఎంఎల్ సంబంధిత రంగాల్లో నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులకు అధిక డిమాండ్ ఏర్పడుతోంది. తెలంగాణలో మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో ఏఐ, ఎడ్‌టెక్‌లకు కేంద్రంగా అనేక సంస్థలు ప్రత్యేక కోర్సులు, శిక్షణా కార్యక్రమాలను అందిస్తున్నాయి. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు తమ ఏఐ కోర్సు కేటలాగ్‌లను విస్తరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వపరంగానూ వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, విద్య, చలనశీలత వంటి రంగాల్లో ఏఐను ఉపయోగించడంపై దృష్టి సారిస్తోంది. ఏఐ విద్యకు ప్రోత్సాహంతోపాటు సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో ఏఐ, రొబోటిక్స్ కోర్సులను ప్రవేశపెట్టింది.

## హైదరాబాద్‌లో ఫ్లాట్ల కొనుగోళ్లకు భారీ తాకిడి

**జనంసాక్షి:** నగరంలోని బండ్లగూడ, పోచారం ప్రాంతాల్లో ఉన్న రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఫ్లాట్ల కొనుగోలుకు నగరవాసుల నుంచి తాకిడి పెరిగింది. నాగోలు బండ్లగూడ ప్రాజెక్టులోని 159 ఫ్లాట్ల కోసం దరఖాస్తు చేసుకోడానికి మంగళవారం చివరి రోజు కావడంతో ఆసక్తి ఉన్నవారు డీడీలతో క్యూ కట్టారు. బండ్లగూడ, పోచారంలలో ఫ్లాట్ల కోసం సుమారు 1,900 మందికి పైగా దరఖాస్తు చేశారు. చివరి రోజు మంగళవారం 600కుపైగా దరఖాస్తులు రావడం విశేషం. సాయంత్రం 5 గంటల వరకు క్యూలైన్లలో ఉన్నవారి నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. గత తరహాలో కాకుండా లబ్ధిదారులు తమకు నచ్చిన ఫ్లాట్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. ఆ ఫ్లాట్ కోసం ఒకరి కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే లాటరీలో తీసి వచ్చిన వారికి కేటాయిస్తారు. ఈ కేటాయింపు ప్రక్రియకు సంబంధించిన లాటరీని బుధవారం బండ్లగూడ ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించారు. బండ్లగూడలో ఫ్లాట్ కోసం దరఖాస్తు చేసుకుని లాటరీలో రానివారు, పోచారం ప్రాజెక్టులోని ఫ్లాట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం తెలిపారు. బండ్లగూడలో ప్రాజెక్టులో ఈఎండీ చెల్లించినట్లు ఇచ్చిన రసీదును పోచారం ప్రాజెక్టులో సమర్పించి అక్కడి ఫ్లాట్ల కొనుగోలుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో తొర్రూర్, బహదూర్ పల్లి, కుర్మల్ గూడ ప్రాంతాల్లో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో జరిగే ఓపెన్ ప్లాట్ల విక్రయానికి సంబంధించిన వేలంలో.. బండ్లగూడలో పొందిన రసీదుతోనే పాల్గొనవచ్చని ఆయన వివరించారు. ఘట్‌కేసర్ పోచారం ప్రాంతంలోని 601 ఫ్లాట్ల కొనుగోలు దరఖాస్తుకు చివరి తేదీ ఈ నెల 31 కాగా.. లాటరీ ప్రక్రియ ఆగస్టు 1, 2వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గౌతం పేర్కొన్నారు.



## వీరికి రూ.కోట్ల వేతనాలు.. వారికి కొలువుల కోతలు

**జనంసాక్షి:** టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 2026 ఆర్థిక సంవత్సరంలో మొత్తం సిబ్బందిలో 2% మంది ఉద్యోగులను తొలగించే ప్రణాళికలను ప్రకటించిన నేపథ్యంలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు వేదికగా కంపెనీ సీఈఓ కృతివా సన్ వేతన భత్యాలను కోట్ చేస్తూ పోస్టులు వెలుస్తున్నాయి. ముఖ్యంగా కంపెనీ లాభదాయకంగా ఉంటూ ఇలా లేఆఫ్స్ ప్రకటిస్తుండడంపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాలు వేదికగా టీసీఎస్ సీఈఓ కృతివాసన్ రూ.26.52 కోట్ల ప్యాకేజీపై తీవ్ర చర్చ సాగుతోంది. ఈ సంవత్సరంలో ఆయన మొత్తం ప్యాకేజీ బేస్ జీతం రూ.1.39 కోట్లు, బెనిఫిట్స్ అండ్ అలవెన్స్‌లు రూ .2.12 కోట్లు, కమిషన్లలో రూ.23 కోట్లుగా ఉన్నాయని కొందరు పోస్ట్ చేశారు.

## కార్డే కదా అని గీకేస్తే మొదటికే మోసం

### క్రెడిట్ కార్డు ఉంది కదా అని రెచ్చిపోతున్నారు!

**జనంసాక్షి:** భారత్‌లో క్రెడిట్ కార్డు రుణ సంక్షోభం పెరుగుతోంది. ప్రముఖ క్రెడిట్ బ్యూరో సీఆర్ఐఎఫ్ హై మార్క్ దీనికి సంబంధించిన డేటాను విడుదల చేసింది. బ్యాంకుల నుంచి తీసుకున్న క్రెడిట్‌కార్డుల బిల్లులు కట్టలేక డిఫాల్ట్‌లు అధికమవుతున్నట్లు తెలిపింది. అన్‌సెక్యూర్డ్ లోన్ల చెల్లింపులు బ్యాంకింగ్ వ్యవస్థకు ప్రమాదకరంగా మారుతుందని పేర్కొంది. 2025 మార్చి నాటికి 91 నుంచి 360 రోజుల వరకు చెల్లించని క్రెడిట్ కార్డు రుణాలు రూ.33,886 కోట్లకు పెరిగాయి. ఇది ఏడాది ప్రాతిపదికన 44% పెరిగింది. 91-180 రోజుల గడువు కార్డు రుణాలు రూ.29,983.6 కోట్లు (2024లో రూ.20,872.6 కోట్ల నుంచి పెరిగింది)గా ఉంది. పోర్ట్‌ఫోలియో ఎట్ రిస్క్ (పీఏఆర్) 2024లో 6.9 శాతంగా ఉంది కాస్తా ఇప్పుడు 8.2 శాతానికి పెరిగింది. 181-360 రోజులు గడువు ముగిసిన పీఏఆర్ 0.9 శాతం నుంచి 1.1 శాతానికి పెరిగింది. కొన్నేళ్లుగా డిజిటల్ విస్తరణ, ఫైనాన్షియల్ టెక్నాలజీ ఇన్నోవేషన్, పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో భారత క్రెడిట్ కార్డ్ మార్కెట్ అధికమైంది.



**డిఫాల్ట్‌లు ఎందుకు పెరుగుతున్నాయి?**

**ఆకర్షణీయమైన ఆఫర్లు:** క్యాష్ బ్యాక్ రివార్డులు, ఎయిర్ పోర్ట్ లాంజ్ యాక్సెస్, నో కాస్ట్ ఈఎంఐలు ఆదాయానికి మించి ఖర్చును ప్రోత్సహిస్తున్నాయి. **లైఫ్‌స్టైల్ ద్రవ్యోల్బణం:** క్రెడిట్ కార్డులు స్టేటస్ సింబల్స్‌గా మారాయి. ఇది వినియోగదారులను బారీగా ఖర్చు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. ఆర్థిక **నిరక్షరాస్యత:** చాలా మంది వినియోగదారులకు బిల్లింగ్ సైకిల్స్, లేట్ పేమెంట్ లేదా కాంపౌండింగ్ వడ్డీ ఎలా పనిచేస్తుందో అవగాహన లేదు. క్రెడిట్ కార్డు ఎన్‌పీఏలు (నిరర్థక ఆస్తులు) పెరగడంతో బ్యాంకింగ్ వర్గాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) హెచ్చరిస్తోంది. అన్ సెక్యూర్డ్ లెండింగ్: క్రెడిట్ కార్డులు స్వభావరీత్యా అధిక రిస్క్ కలిగి ఉంటాయి. ఎందుకంటే తిరిగి చేసే చెల్లింపులపై ఎలాంటి పూచీకత్తు ఉండదు. మొండిబకాయిలు పెరగడం వల్ల బ్యాంకులు నష్టాల్లోకి జారుకుంటున్నాయి. 2023లో ఆర్‌బీఐ క్రెడిట్ కార్డు రుణాలపై రిస్క్ పెంచింది. సంభావ్య నష్టాలను పూడ్చడానికి బ్యాంకులు ఎక్కువ మూలధనాన్ని కేటాయించవలసి వస్తుంది. డిఫాల్ట్‌లు పెరిగేకొద్దీ బ్యాంకులు రుణాలు జారీ చేయడంలో మరింత జాగ్రత్తలు వహించాలి. క్రెడిట్ కార్డులను ఆర్థిక సాధనాలుగా పరిగణించాలి. కానీ ఉచితంగా వచ్చే డబ్బుగా భావించకూడదు. అధిక వడ్డీ ఛార్జీల నుంచి తప్పించుకోవడానికి సకాలంలో పూర్తి బకాయిలు చెల్లించాలి. మెరుగైన క్రెడిట్ స్కోర్ కోసం సకాలంలో చెల్లింపులు చేయాలి. అందుకు క్రెడిట్ రిపోర్టులను పర్యవేక్షించాలి. బిల్లింగ్ సైకిల్స్ ఎలా పనిచేస్తాయో తెలుసుకోవాలి. ఆఫర్లు, ఈఎంఐలపై అవగాహన పెంచుకోవాలి.

# రాకాసి అల..

**చరిత్రలోనే అత్యంత ఎత్తైన సునామీ**
**ఘటనలో అరకిలోమీటరు వరకు ఎగసిన సముద్ర కెరటాలు**

**జనంసాక్షి:** సునామీ.. 2004 డిసెంబర్ 26వ తేదీన హిందూ మహాసముద్ర తీర దేశాల్లో విధ్వంసం సృష్టించే దాకా ఈ విపత్తు గురించి సామాన్య ప్రజలకు పెద్దగా తెలియదు. తాజాగా రష్యాలో సంభవించిన భారీ భూకంపం, సునామీ హెచ్చరికల నేపథ్యంలో ఫసిఫిక్ తీరంలోని 30 దేశాలు గజగజ వణికిపోతున్నాయి. రాకాసి అలలు తీర ప్రాంతాలను ఇప్పటికే పలు ప్రాంతాలను ముంచెత్తాయి. ఈ నేపథ్యంలో చరిత్ర ఇప్పటిదాకా చవిచూసిన శక్తివంతమైన సునామీ ఏదో చూద్దాం.. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్.. భూకంపాలు, అగ్నిపర్వతాలు ఎక్కువగా సంభవించే ప్రాంతం. ఈ రీజియన్‌లో ఉన్న రష్యా కామ్చట్కా ద్వీపకల్పం వద్ద రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత భూకంపం సంభవించి.. పసిఫిక్ తీర దేశాల అంతటా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. జపాన్, అలాస్కా, హవాయి వంటి ప్రాంతాల్లో అలలు 3-4 మీటర్ల(9-13 అడుగుల) ఎగసిపడ్డాయి. ప్రపంచంలో ఇప్పటిదాక సంభవించిన శక్తివంతమైన భూకంపాల లిస్ట్‌లో.. ఇవాళ్టి రష్యా భూకంపానికి ఆరో స్థానం దక్కింది. అయితే.. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సునామీల జాబితాను ఓసారి పరిశీలిస్తే.. 2004.. ఇండోనేషి యా (సుమాత్రా)లో సంభవించిన 9.1 తీవ్రత భూకంపం. ఈ భూకంపం ధాటికి సునామీ 13 దేశాల తీరాలను ముంచెత్తి 2,30,000 మందిని బలిగొంది. 2011.. 9.0 తీవ్రతతో సంభవించిన భూకంపం జపాన్ (టోహోకు) తీరాన్ని ముంచెత్తించింది. ఈ ధాటికి ఫుకుషిమా అణు ప్రమాదం సంభవించడంతో పాటు 18,500 మంది మృతి చెందారు. 1960.. చిలీ (వాల్డివియా) 9.5 తీవ్రతతో భూకంపం. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన భూకంపం ఇది. ఈ ప్రభావం పసిఫిక్ మహాసముద్రం అంతటా కనిపించింది. 1883.. ఇండోనేషియా (క్రాకటోవా) అగ్నిపర్వత విస్ఫోటనం ధాటికి బారీ అలలు ఎగసిపడ్డారు. మొత్తం 36,000 మంది మృతి చెందారు. ఈ పేలుడు శబ్దం.. 4,800 కిలోమీటర్ల దూరం దాకా వినిపించింది!!. సునామీ అనేది జపనీస్ భాషకు చెందింది. దానికి అర్థం హార్బర్ కెరటం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు 100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్‌తో ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పుమరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. పసిఫిక్ మహాసముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి. 1896.. జపాన్ (సాన్‌రికు)లో 8.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. 125 అడుగుల అలలు ఎగసిపడ్డాయి. ఈ సునామీ ధాటికి 22,000 మంది మృతి చెందారు. ఈ సునామీ ప్రభావంతో.. హవాయిలో 25 అడుగుల ఎత్తు మేర అలలు ఎగసిపడ్డాయి. చరిత్రలోనే అత్యంత ఎత్తైన సునామీ(%వీవస్త్రు ంబఋఎఱ%).. 1958 అలాస్కా (లిటుయా బే)లో జులై 9వ తేదీన సంభించింది. రిక్టర్ స్కేల్‌పై 7.8 నుంచి 8.3 తీవ్రతతో సంభవించిన ఈ భూకంపం ధాటికి.. 914 మీటర్ల (3000 అడుగుల) నుంచి కొండచరియలు విరిగిపడ్డాయి. 90 మిలియన్ల టన్నుల రాళ్లు ఒక్కసారిగా గిల్‌బర్ట్ ఇంటెల్ ఉపనదిలోకి పడిపోయాయి. దీంతో ఓ పెద్ద కొండ ఎత్తు మేర నీరు అలలాగ ఎగసిపడింది. సుమారు 1,720 అడుగుల (524 మీటర్లు) అల.. లిటుయా బేను ముంచెత్తింది. ఇది న్యూయార్క్ ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ కంటే ఎక్కువ!. ఇదే ప్రాంతంలోని లిథుయా గ్లేసియర్ వద్ద కొంత మంచు కూడా విరిగినట్లు ప్రత్యక్ష సాక్షుల వివరాలు చెబుతున్నప్పటికీ.. ప్రధాన అలను ఏర్పరచినది రాళ్ల పతనం మాత్రమే. అయితే ఇక్కడ జనసాంద్రత.. అదీ ఆ సమయంలో తక్కువగా ఉండేది. అందుకే మెగా సునామీ ముంచెత్తినా కేవలం ఐదుగురే మరణించారు. వీళ్లంతా పడవలో ప్రయాణిస్తుండగా మృత్యువాత పడ్డారు. అయితే మరో ఇద్దరు అనూహ్యంగా ఈ విలయం నుంచి ప్రాణాలతో బయటపడడం గమనార్హం. 1868.. పెరూ(చిలీ) 8.5 తీవ్రత భూకంపంతో సునామీ ముంచెత్తి 25,000 మందిని బలిగొంది. ఇది కూడా హవాయిపై ప్రభావం చూపెట్టింది.





## తీరానికి కొట్టుకొస్తున్న భారీ తిమింగలాలు

**టోక్యో:** జపాన్‌ను సునామీ తాకింది. బుధవారం రష్యా తీరంలో 8.8 తీవ్రతతో సంభవించిన శక్తివంతమైన భూకంపం కురిల్ దీవులు, జపాన్‌లోని హక్కైడో తీరప్రాంతాలలో సునామీకి కారణంగా నిలిచింది. అమెరికాలోని కాలిఫోర్నియా, అలాస్కా, హవాయి న్యూజిలాండ్ వైపు ఉన్న ఇతర తీరాలకు కూడా సునామీ హెచ్చరికలు జారీ చేశారు. జపాన్ వాతావరణ సంస్థ నివేదిక ప్రకారం తూర్పు తీరంలోని ఇషినోమాకి ఓడరేవును 50 సెంటీమీటర్ల ఎత్తులో సునామీ తాకింది. ఇది ఇప్పటివరకు నమోదైన అత్యంత పెద్దదయిన అల. పసిఫిక్ తీరం వెంబడి దక్షిణా నికి, హక్కైడో నుండి టోక్యోకు, పలు ఈశాన్య ప్రాంతాలకు సునామీ కదులుతున్నప్పుడు 40 సెంటీమీటర్ల ఎత్తు వరకు అలలు ఏర్పడ్డాయి. అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## 43 ఓటీటీలను నిషేధించాం

నియంత్రించేందుకు చట్టపరమైన, నైతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టిన చర్యల్లో భాగంగానే 43 ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లను నిషేధించినట్లు పేర్కొన్నారు. ఓటీటీ వేదికలు చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను ప్రసారం చేయరాదని తెలిపారు. ప్రసారం చేసే కంటెంట్‌ను వయస్సు ఆధారంగా వర్గీకరించాలని సూచించిన మంత్రి.. ఇది ఐటీ చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారమే జరగాల్సి ఉంటుందన్నారు. పిల్లల వయస్సుకు తగని రీతిలో ఉన్న కంటెంట్‌ను నియంత్రించేందుకు తగిన రక్షణ చర్యలు, యాక్సెస్ నియంత్రణ చర్యలను అమలు చేయాలని ఓటీటీ వేదికలకు సూచించారు. చట్టాలను ఉల్లంఘించేలా కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న 43 ఓటీటీలపై సంబంధిత మంత్రిత్వశాఖలతో సంప్రదింపుల అనంతరం నిషేధం విధించినట్లు తెలిపారు.

## మీ తప్పు లేకుంటే ముందే ఎందుకు స్పందించలేదు?

కదా? అని అసహనం వ్యక్తం చేసింది. న్యాయపరమైన తప్పులు జరిగినప్పుడు చర్య తీసుకునే హక్కు చీఫ్ జస్టిస్‌కు ఉంటుందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. మార్చి 14న జస్టిస్ యశ్వంత వర్మ నివాసంలోని స్టోర్ రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. రాత్రి 11:43 గంటలకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని చెల్లాచెదురుగా పడి ఉన్న నగదును గుర్తించారు. అనంతరం ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నగదు వీడియోలను రికార్డ్ చేసి ఢిల్లీ పోలీసులు.. సీనియర్ అధికారులకు పంచారు.

## ఈ మర మనుషులు.. కేవలం రూ.5 లక్షలే!

- ఇంట్లో మనిషిలా, ఇంటి పనిమనిషిలా రోబోలు
- అందుబాటులోకి తెచ్చిన చైనా కంపెనీ

**జనంసాక్షి:** భలే మంచి చౌక బేరము.. రూ.5.12 లక్షలకే హ్యూమనాయిడ్ రోబో అంటోంది చైనాకు చెందిన ఓ కంపెనీ. రోబో.. అంటేనే ఖరీదైన వ్యవహారం. అందులోకి, అచ్చం మనిషిలా ఉండి, మనిషి చేయగలిగే చాలా పనులు చేసే హ్యూమనాయిడ్ రోబో అంటే.. ఇంకా ఖరీదు. కానీ.. అస్సలు కాదు అంటోంది చైనా దిగ్గజం యూనిట్రీ రోబోటిక్స్. రోబోల తయారీలో మంచి పేరున్న ఈ కంపెనీ ఆర్1 హ్యూమనాయిడ్‌ను తయారుచేసింది. దీని ధర కేవలం 5,900 డాలర్లు (రూ.5.12 లక్షలు) మాత్రమేనట. కంపెనీ గతంలో అందుబాటులోకి తెచ్చిన జీ1తో పోలిస్తే కొత్త మోడల్ ధర 63 శాతం తక్కువ కావడం విశేషం. ఈ హ్యూమనాయిడ్ ఎత్తు 121 సెంటీమీటర్లు, వెడల్పు 35.7 సెం.మీ. మందం 19 సెం.మీ. కేవలం 25 కేజీల బరువే ఉండటం కూడా వాడకందారులకు చాలా సౌలభ్యం. వాయిస్ గుర్తించేందుకు నాలుగు మైక్రోఫోన్స్, అల్ట్రావైడ్ యాంగిల్ విజువల్స్ కోసం బైనాక్యులర్ కెమెరా పొందుపరిచారు. వైఫై 6, బ్లూటూత్ 5.2 కనెక్టివిటీ ఉంది. బ్యాటరీ ఒకసారి రీచార్జ్ చేస్తే రోబో గంటపాటు పనులు చక్కబెడుతుంది. మాన్యువల్ రిమోట్ కంట్రోల్‌తో పనిచేస్తుంది. పూర్తి కస్టమైజేబుల్.. అంటే కస్టమర్ కోరిన విధంగా మార్పులు చేసి కూడా తయారు చేస్తారు. యూనిట్రీ రోబోటిక్స్ ఆర్1 హ్యూమనాయిడ్.. పరుగెడుతుంది, నడుస్తుంది, పిల్లిమొగ్గలు వేస్తుంది, చేతుల మీద నిలబడుతుంది. మనం ఇచ్చే వాయిస్ ఆదేశాలకు ప్రతిస్పందిస్తుంది. పరిసరాలను అర్థం చేసుకుంటుంది. ప్రయోగాలకు అనువుగా ఇది పనిచేస్తుంది. అంటే టెక్ కంపెనీలు ఈ హ్యూమనాయిడ్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు వీలు కూడా ఉండటం దీనిలోని మరో ప్రత్యేకత. ఆఫీసులు, ఇంటి పనుల కోసం పని మనుషులను పెట్టాలనుకునేవాళ్లు దీన్ని ట్రై చేయొచ్చు అంటోంది కంపెనీ. ఫ్యాక్టరీలు, ఇంటి పనులకు సంబంధించి హ్యూమనాయిడ్‌ల తయారీలో ఇంతవరకు అమెరికన్ కంపెనీల ఆధిపత్యం ఉండేది. ఇప్పుడు చైనా కంపెనీలు ఈ రేసులోకి 'తక్కువ ధరకే' ట్యాగుతో వచ్చాయి. ఇవి పై రెండు రకాల పనులతోపాటు మిలటరీలో కూడా ఉపయోగపడతాయట. చైనాలోని పరిశోధనా ప్రయోగశాలలు, పాఠశాలల్లో వాడుతున్న యూనిట్రీ కంపెనీ తయారీ జీ1 రోబో ధర 16,000 డాలర్లుగా ఉంది. మరింత అధునాతన, పెద్ద సైజులో ఉండే హెచ్1 మోడల్ ధర 90,000 డాలర్ల కంటే ఎక్కువ. అందరికీ అందుబాటు ధరలో ఏకంగా 5,900 డాలర్లకే ఇప్పుడు ఆర్1 హ్యూమనాయిడ్‌ను తీసుకొచ్చింది. ఇది సంక్లిష్ట హ్యూమనాయిడ్‌ల విభాగంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. మీరు ఉదయం లేవగానే మీ కదలికలను రోబో గుర్తిస్తుంది. కాఫీ మెషీన్‌ను ఆపరేట్ చేస్తుంది. ఒకవేళ మీకు కళ్లజోడు అలవాటు ఉంటే.. అది ఎక్కడ ఉన్నా తెచ్చి మీ చేతికి ఇస్తుంది. ఆ రోజు చేయాల్సిన మీ షెడ్యూల్‌ను చదువుతుంది. మీ బిడ్డకు సైన్స్, మ్యాథ్స్.. ఇలా ఏదైనా సబ్జెక్టులో సందేహాలు ఉంటే సమాధానాలతో సహాయపడుతుంది. సంభాషణను సరదా క్విజ్‌గా కూడా మారుస్తుంది. అమ్మమ్మ, తాతయ్యల వంటి పెద్దలకు.. ఎత్తైన షెల్ఫ్ నుండి మందులను తీసుకొచ్చి చేతిలో పెడుతుంది. ఇంటికి బంధువులు, స్నేహితులు వస్తే వారిని ఆకట్టుకోవడానికి పిల్లిమొగ్గల వంటివి వేస్తుంది.



### ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు దిగిరాకుంటే

## ప్రత్యేక పాలస్తీనాకు ఐరాసలో మద్దతిస్తాం

**లండన్:** పాలస్తీనా విషయంలో ఫ్రాన్స్ దారినే బ్రిటన్ సైతం అనుసరిస్తోంది. కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించకుంటే ప్రత్యేక పాలస్తీనా ఏర్పాటుకు వచ్చే సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితిలో జరిగే సర్వప్రతినిధి సభలో ప్రవేశపెట్టే తీర్మానానికి మద్దతిస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. ఈ దిశగా ఇజ్రాయెల్ చర్యలు తీసుకోకుంటే పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని ఆయన ప్రకటించారు. అదే సమయంలో, హమాస్ తన వద్ద ఉన్న బందీలందరినీ తక్షణమే విడుదల చేయాలని కోరారు. కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకం చేసి, ఆయుధాలను అప్పగించాలన్నారు. భవిష్యత్తులో గాజాలో ఎటువంటి భూమిక పోషించబోమనే హామీని హమాస్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఇదే సరైన అదను అని స్టార్మర్ తెలిపారు. ఇటీవలే ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ సైతం రెండు దేశాల విధానానికి మద్దతు ప్రకటించడం గమనార్హం.





# కలికోట సూరమ్మ చెరువు కాల్వల పనులు త్వరలో ప్రారంభం

- ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష సమావేశం
- పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యా ప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు



**మేడిపల్లి/కథలాపూర్, జులై 30 (జనంసాక్షి):** కలికోట సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాల్వల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం బీమారం మండల కేంద్రంలో బీమారం, మేడిపల్లి, కథలాపూర్ మండలాల ప్రజలకు జలప్రదాయని చేసే కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పురోగతిపై జిల్లా కలెక్టర్ సత్యా ప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి ఆది శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ, ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించినట్లు ఆది శ్రీనివాస్ వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 3 ఎకరాల భూసేకరణ నష్టపరిహారాన్ని జిల్లా కలెక్టర్‌తో చర్చించి రైతులకు చెల్లించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు 2005లో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్-2, ఫేస్-1లో భాగంగా రూ.1731 కోట్లతో మంజూరైందని గుర్తు చేశారు.

రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టు నిర్మాణం ఇప్పుడు శరవేగంగా సాగుతుందని, గతంలో నిధులు మంజూరైనా పనులు పూర్తి కాలేదని ఆయన విమర్శించారు. 2018 ఎన్నికల సమయంలో అప్పటి మంత్రి హరీష్‌రావు రూ.200 కోట్లతో శంకుస్థాపన చేసి, ఆ దసరాకు నీరిస్తామని హామీ ఇచ్చినా, పదేళ్లలో ఎలాంటి పురోగతి లేదని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున 37 సార్లు ఆందోళనలు చేసినట్లు, అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రాజెక్టును సందర్శించి, అధికారంలోకి వస్తే వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు వేగవంతమయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తూ, రాష్ట్ర బడ్జెట్‌లో రూ.350 కోట్లు కేటాయించినట్లు ఆది శ్రీనివాస్ వెల్లడించారు.

2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓట్ల కోసం భూసేకరణ నిధులు లేకుండానే శంకుస్థాపన చేసిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుడి, ఎడమ కాల్వల నిర్మాణం కోసం 500 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసి, మొదటి విడతగా రూ.10 కోట్ల నిధులు జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో కాల్వల నిర్మాణం త్వరలో పూర్తవుతుందని, గత ప్రభుత్వం రూ.75 కోట్ల కాంట్రాక్టర్ బకాయిలను కూడా ప్రస్తుత ప్రభుత్వం చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధి చేస్తామని మోసం చేసిందని విమర్శిస్తూ, రానున్న రోజుల్లో వేములవాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

# విద్యార్థుల వినతిపై తక్షణమే స్పందించిన కలెక్టర్

- టీసీలు ఇచ్చేందుకు ప్రైవేట్ కళాశాల నిరాకరిస్తోందని ఫిర్యాదు
- అప్పటికప్పుడు ప్రైవేట్ కళాశాలకు వెళ్లి టీసీలు ఇప్పించిన జిల్లా పాలనాధికారి
- కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూలై 30 (జనం సాక్షి) :** ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్‌లో చేరిన విద్యార్థులకు బదిలీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ప్రైవేట్ కళాశాల నిరాకరిస్తోందని బాధిత విద్యార్థులు చేసిన ఫిర్యాదుపై కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తక్షణమే స్పందించారు. అప్పటికప్పుడు కలెక్టర్ తానే స్వయంగా ప్రైవేట్ కాలేజీకి వెళ్లి విద్యార్థులకు టీసీలు ఇప్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లి మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించిన సమయంలో కలెక్టర్ వాహనాన్ని గమనించిన బాధిత విద్యార్థులు కలెక్టర్‌ను కలిసి తమ ఆవేదనను తెలియజేశారు. కమ్మర్పల్లిలోని శ్రీ భాషిత ప్రైవేట్ జూనియర్ కళాశాలలో గత ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం చదివిన తాము, ఫీజు భారం భరించే స్థోమత లేక ఈ ఏడాది స్థానికంగా గల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సెకండ్ ఇయర్‌లో చేరడం జరిగిందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అయితే టీసీ కోసం గడిచిన పక్షం రోజుల నుండి ప్రైవేట్ కాలేజీ చుట్టూ తిరుగుతున్నా, తమకు టీసీ ఇవ్వడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. తాము అన్ని ఫీజులు చెల్లించామని, అయినా కూడా సుమారు 15 మంది విద్యార్థులకు టీసీ ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో టీసీ అందించేందుకు బుధవారం చివరి గడువు అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ అప్పటికప్పుడు ప్రైవేట్ కళాశాలకు వెళ్ళి నిర్వాహకులను నిలదీశారు. విద్యార్థులకు టీ.సీలు ఇవ్వకుండా పక్షం రోజుల నుండి ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు వారికి నచ్చిన కాలేజీలో చదివే స్వేచ్ఛ ఉందని, సెకండ్ ఇయర్ కూడా ఇక్కడే చదవాలని బలవంతం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. విద్యార్థులకు ఇప్పటికిప్పుడు టీసీలు ఇవ్వాలని, లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ ప్రసాద్ ను, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను అక్కడికి పిలిపించుకుని విద్యార్థులకు వెంటనే టీసీలు ఇప్పించి, ప్రభుత్వ కాలేజీలో ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో విద్యార్థులు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ చూపిన చొరవతో నిమిషాల వ్యవధిలో తమ సమస్య పరిష్కారం అయ్యిందని, ఫీజుల భారం పడకుండా, విద్యా సంవత్సరం నష్టపోకుండా తమను ఆదుకున్నారని హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. విద్యార్థుల వినతిపై కలెక్టర్ సత్వరమే స్పందించి, సమస్యను స్వయంగా దగ్గరుండి పరిష్కరించడం పట్ల స్థానికులు సైతం హర్షం వ్యక్తం చేశారు.

# సబ్ సెంటర్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి



- సబ్ సెంటర్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 30.(జనంసాక్షి) :** సబ్ సెంటర్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సిరిసిల్ల జిల్లాలో మంజూరైన 16 పిసెచ్‌సి సబ్ సెంటర్ల నిర్మాణ పనుల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సిరిసిల్ల జిల్లాలో మంజూరైన 5 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలలో 3 పిసెచ్‌సిలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చామని,మరో పి.హెచ్.సి ప్రారంభానికి సిద్ధంగా ఉందని, గంభీర్ రావు పేట రూఫ్ దశలో ఉందని అధికారులు వివరించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, సిరిసిల్ల జిల్లాకు మంజూరైన 16 సబ్ సెంటర్ల మంజూరు కాగా 5 సబ్ సెంటర్ల నిర్మాణానికి స్థల సమస్యలు ఉన్నాయని తెలుసుకున్న కలెక్టర్ సంబంధిత మండల తహసిల్దార్ లతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి భూ సమస్యలను పరిష్కరించారు. పిసెచ్‌సి సబ్ సెంటర్ నిర్మాణ పనులు అదేవిధంగా గంభీరావుపేట్ పిహెచ్సి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ పంచాయతి రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

పిసెచ్‌సి, సబ్ సెంటర్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు అందుబాటులో పెట్టిందని, పనులు ఆలస్యం కాకుండా ప్రత్యేక చొరువతో పని చేయాలని అన్నారు. అగ్రహారం, తిప్పపూర్ బస్టాండ్ ప్రాంతంలో కొత్త సబ్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని అన్నారు.సమావేశంలో ఈ ఈ పిఆర్ సుదర్శన్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకోవాలి





- ఏరియా జీఎం బండి వెంకటయ్య
- గైరుహాజరు ఉద్యోగులకు జీఎం కౌన్సిలింగ్

**యైటింక్లయిన్ కాలనీ జూలై 30 (జనంసాక్షి) :** ప్రతి ఒక్క ఉద్యోగి తమ హాజరు శాతాన్ని పెంచుకొని సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని సింగరేణి సంస్థ కల్పిస్తున్న సదుపాయాలు మరెక్కడ లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎం బండి వెంకటయ్య గైరుహాజరు ఉద్యోగులకు సూచించారు. ఆర్జీ-2 ఏరియాలో పని చేస్తూ 2024 సం.రంలో 100 మాస్టర్ల కంటే తక్కువచ 2025 జూన్ వరకు 50మాస్టర్ల కంటే తక్కువ హాజర్లు చేసిన ఉద్యోగులకు సింగరేణి యజమాన్యం, సింగరేణి సేవా సమితి ఆద్వర్యంలో సిఇఆర్ క్లబ్ నందు గైర్హాజరు అవుతున్న ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. బుధవారం ఈ కౌన్సిలింగ్ 60మంది కార్మికులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం బండి వెంకటయ్య హాజరై ఉద్యోగులకు సానుభూతి దృక్పథంతో సమగ్రమైన మార్గదర్శకత్వాన్ని అందించారు. కౌన్సిలింగ్‌లో ఉద్యోగుల, వారి కుటుంబ సభ్యుల అభిప్రాయాలను కూడా స్వీకరించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, విధులు సక్రమంగా నిర్వహించినట్లైతే సహాయ సహకారాలను అందిస్తామని, కానీ విధులకు హాజరు కావడం ప్రాధాన్యత కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఉద్యోగులు విధులకు హాజరు కావడంలో నిర్లక్ష్యం చేస్తే దానివల్ల వ్యక్తిగతంగా వారికి, అలాగే సంస్థకు నష్టం కలుగుతుందన్నారు. సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం మీ అందరి అదృష్టమని మీ తల్లిదండ్రులు ఉద్యోగం చేసిన సమయంలో ఉన్న కష్టమైన పనులు ప్రస్తుతం లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇప్పటికైనా ఉద్యోగులు ప్రతినెల 22మస్టర్ల చేయాలని సూచించారు. ఈ కార్యక్రమములో ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ శ్యామ్సన్, డిజిఎం (పర్సనల్) పి.అరవింద్ రావు, డా॥ మహిపాల్, డివైపిఎం నందికొండ వంశీధర్, సీనియర్ పర్సనల్ అధికారి సాధన్, సంక్షేమాధికారులు సాయికృష్ణ, నరేష్, సీనియర్ సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్, పిట్ సెక్రెటరీలు, సేవా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### శారీరక, మానసిక ఆరోగ్య అభివృద్ధికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుంది

**-పోతన కాలనీలోని పతాంజలి యోగ మందిర్‌పునః ప్రారంభం**

నిత్య జీవితంలో శారీరక, మానసిక ఆరోగ్య అభివృద్ధికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఏరియా సేవా అధ్యక్షురాలు బండి వనజావెంకటయ్య అన్నారు. బుధవారం పోతన కాలనీలో ఉన్న పతాంజలి యోగ మందిర్ ఆధునీకరణ చేసి పునః ప్రారంభించి మాట్లాడరు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎంవెంకటయ్యతో హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉద్యోగుల, వారి కుటుంబ సభ్యుల శారీరక, మానసిక ఆరోగ్య అభివృద్ధికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆధునీకరించిన యోగ మందిర్ స్థానిక ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకునేందుకు మార్గాన్ని చూపుతుందని అన్నారు. ఆనంతరం జీఎం మాట్లాడుతు మహిళలు, పెద్దలు, పిల్లలు అందరూ యోగ సాధనలో భాగస్వాములై హాయిగా జీవించేందుకు ఈ మందిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ బి. శ్యాంసన్, డిజిఎం (సివిల్) ధనుంజయ, డివైఎస్ఇ వినయ్ సాగర్, సివిల్ ఇఇ ప్రతాపగిరి రాజు, సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్ పోతన కాలనీ మహిళలు, సేవా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన డీఏఓ

**ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు : మోహన్ రెడ్డి**

పెద్ద కొడప్గల్ జులై 30 (జనంసాక్షి):



పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాప్‌లోని స్టాకు రిజిస్టర్లను, గోదాములలో నిల్వ ఎరువులను, లైసెన్సులను పరిశీలించారు. తదనంతరం డీఏఓ మాట్లాడుతూ.. ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. రైతులు పంటకు వేయాల్సిన ఎరువుల కంటే అధికంగా ఎరువులు వేస్తున్నారని, దానిపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు నానో యూరియా, డీఏపీ వాడాలని సూచించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయి స్తే రైతులు తమకు సంప్రదించాలని, అట్టి దుకా ణంపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ టెక్నికల్ సంతోష్, వ్యవసాయ శాఖ మండల అధికారి కిషన్, తదితరులు ఉన్నారు.

# ముఖ్యమంత్రిని ఆహ్వానించిన ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ

**నవంబర్‌లో శ్రీ కాసుగంటి నారాయణరావు ఆర్ట్స్, సైన్స్ కళాశాల 60 వసంతాల ఉత్సవాలు**



**జగిత్యాల బ్యూరో, జులై 30,(జనం సాక్షి)**

శ్రీ కాసుగంటి నారాయణరావు ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల జగిత్యాల ఏర్పడి 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులుగా జగిత్యాల ఎమ్మెల్సీ ఎల్ రమణ గారు ఎమ్మెల్యే సంజయ్ సంజయ్ కుమార్ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని హైదరాబాదులో కలిశారు. ఈ కళాశాలకు ఉన్నటువంటి గొప్ప చరిత్రను గత 60 సంవత్సరాలుగా స్థానిక పేద బడుగు వర్గాల విద్యార్థినీ విద్యార్థులకు విద్య దానం చేసి ఎంతో గొప్ప మహనీయులను తయారు చేసిందని ముఖ్యమంత్రి కి వివరించారు. కళాశాల ఏర్పడినప్పుడు ప్రిన్సిపాల్ గా గొప్ప విద్యావేత్త డాక్టర్ కొండలరావు కళాశాలను ప్రారంభించారని తెలిపారు. ఈ కళాశాలలో విద్యను అభ్యసించి పూర్వ విద్యార్థులు దేశ విదేశాల్లో అనేక రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వైస్ ఛాన్సలర్గా ,విద్యావేత్తలుగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, డాక్టర్లుగా, రాజకీయ నాయకులుగా, డాక్టర్లుగా, పరిశోధకులుగా, విద్యావేత్త లుగా, కవులుగా వ్యాపారవేత్తలుగా, ఎదిగారని అనేక రంగాల్లో రంగాల్లో ఉన్నారని తెలిపారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ నెలలో జరగబోయే కళాశాల 60 వసంతాల ఉత్సవాలకు ముఖ్య అతిథిగా గౌరవ ముఖ్యమంత్రి ఆహ్వానించామని తెలిపారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చాలా ఆనందం వ్యక్తం చేసి సానుకూలంగా స్పందిస్తూ 60 వసంతాల వేడుకలకు తాను వస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కావలసిన మహిళ వసతిగృహం, పురుషుల వసతి గృహం, పోస్ట్ గ్రాడ్యుయేషన్ నూతన కోర్సులను నివేదిక ప్రవేశపెట్టుట కు ముఖ్యమంత్రి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య అరిగెల అశోక్ మాట్లాడుతూ కళాశాల త్వరలో నిర్వహించు కోబోయే కళాశాల 60 వసంతాల లకు రాష్ట్ర ముఖ్యమంత్రి రాబోతున్నందున హర్షం వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కళాశాల అభివృద్ధికై కృషి చేస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కళాశాల సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# పాము కాటు మందు కూడా అందుబాటులో ఉంచండి

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్
- మద్నూర్ మండలంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జులై 30 (జనం సాక్షి) :**

జిల్లాలోని ప్రతీ అస్పత్రిలో పాము కాటు మందు కూడా అందుబాటులో ఉంచాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలో బుధవారం అయన పర్యటించి పలు అభివృద్ధి, పర్యవేక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా మద్నూర్ గ్రామంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ని సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై నేరుగా రోగులు మరియు వైద్య సిబ్బందితో మాట్లాడి సమాచారం పొందారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా వైద్య సిబ్బంది నిరంతరం నిరంతరం అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని, సాధారణ మందులతోపాటు పాముకాటు, ఇతర అత్యవసర మందులు కూడా ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, సానిటేషన్ పనులు నిరంతరం చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. తదుపరి హండే కేలూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి, 100 శాతం మార్కింగ్ అవుట్‌లు చేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా నిరంతరం పర్యవేక్షణ చేసి ఇండ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసుకునేలా లబ్ధిదారులకు సహకరించాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల తో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించి, లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇసుక మరియు మొరం సరఫరాకు ఏమైనా ఇబ్బంది కలిగితే వెంటనే ఎంపీడీవోకు , తాసిల్దార్‌కు తెలియజేసి సమస్య పరిష్కరించాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామ పంచాయతీలలో ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించి, త్రాగునీటిని క్లోరినేషన్ చేయాలని, డ్రైనేజీలలో నీరు నిలువ ఉండకుండా పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. తదుపరి పెద్ద ఎక్లారా గ్రామంలోని గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినిలతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్, డివిజనల్ పంచాయతీ అధికారి సత్యనారాయణ, హౌసింగ్ డిఇ గోపాల్, తహసిల్దార్ ముజీబ్, ఎంపీడీవో, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అందరికీ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు11కేవి నూతన బ్రేకర్లు ప్రారంభం


- జగిత్యాల ఎస్ఇ బొంకూరి సుదర్శనం



**భీమారం, జూలై 30(జనంసాక్షి):** రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు11కేవి నూతన బ్రేకర్లు ప్రారంభించినట్లు జగిత్యాల జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం తెలిపారు. జగిత్యాల జిల్లాలోని మన్నెగూడెం సెక్షన్ పరిధిలో వెంకట్రావుపేట, ఒడ్యాడ్ సబ్ స్టేషన్లలో రూ.15 లక్షల విలువైన రెండు నూతన అదనపు 11కేవీ బ్రేకర్లను ఎస్ఇ ప్రారంభించారు. నిరంతర విద్యుత్ సరఫరా, అభివృద్ధి పనులలో భాగంగా గత కొంత కాలంగా ఒకే బ్రేకర్ పై రెండు 11కేవి ఫీడర్లు ఉండడం వల్ల విద్యుత్ అంతరాయం ఎక్కువ ఉండేది ప్రస్తుతం ఆ సమస్యని ఒక ఫీడర్ కి ఒక బ్రేకర్ ప్రతిపాదించి రెండు నూతన బ్రేకర్లు ఛార్జ్ చేసి విద్యుత్ అంతరాయం సమస్యను పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేసిన అధికారులకు రెండు గ్రామాల వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. తదనంతరం రెండు సబ్ స్టేషన్లలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పలు పండ్లు, పూల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిఈ లు గంగారాం, మధుసూదన్, గోపి కృష్ణ, ఏడిఈ లు రఘుపతి, రాజు, ఏఈ అశోక్, సబ్ ఇంజనీర్ ఎక్కల్ దేవి హరిప్రసాద్, గుత్తెదారు మనోజ్, మన్నెగూడెం విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరంతర ప్రక్రియగా నూతన రేషన్ కార్డుల జారీ

- రేషన్ కార్డుతో పేద కుటుంబాలకు 10 లక్షల కవరేజితో ఆరోగ్యశ్రీ లబ్ది
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**మేడిపల్లి, భీమారం,జులై 30(జనంసాక్షి):** నిరంతర ప్రక్రియగా నూతన రేషన్ కార్డుల జారీ కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. బుధవారం రోజున జిల్లా కలెక్టర్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి మేడిపల్లి, భీమారం మండల కేంద్రలలో లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమేడిపల్లి మండలంలో నూతనంగా 479,కొత్త సభ్యులు పేర్లు చేర్చినవి 1273, భీమారం మండలంలో 411 పేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, అదే సమయంలో ప్రస్తుతం ఉన్న 1077 రేషన్ కార్డులలో కొత్త సభ్యులను జమ చేస్తున్నామని తెలిపారు. పేద ప్రజలు జీవనం కొనసాగించాలంటే రేషన్ కార్డు చాలా ముఖ్యమైనదని ఇచ్చిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగ పడుతుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, ఎవరైనా అర్హులు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిశీలించి రేషన్ కార్డు మంజూరు చేస్తామని అన్నారు. గత పది సంవత్సరాలుగా ఒక పేద కుటుంబానికి రేషన్ కార్డు, ఇండ్లు ఇవ్వలేదని అన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తున్నామని అన్నారు. నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి, సివిల్ సప్లై అధికారి జితేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎమ్మార్వో, ఎంపిడిఓ పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈఈ అనిల్

**రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు**



**జగిత్యాల బ్యూరో, జులై 30, (జనం సాక్షి) :** కోరుట్ల కు చెందిన కాంట్రాక్టర్ వెంకటేశం కు సంబందించిన రూ 23 లక్షల బిల్లు కోసం పంచాయతీరాజ్ ఏ ఈ ఈ అనిల్ రూ 18 వేలు లంచం డిమాండ్ చేయాగ, వెంకటేశం రూ 10 వేల ఇస్తానని, మొదటగా 3 వేలు ఇచ్చి, అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రాయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు మిగతా 7 వేల రూపాయలు తీసుకుంటుండగా అనిల్ కుమార్‌ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



## వరల్డ్ కప్ హీరోపై వేటు

### లక్నో బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్

ఐపీఎల్ 19వ సీజన్‌కు ముందు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పలు ఫ్రాంచైజీలు తమ కోచింగ్ సిబ్బందిని మార్చుకుంటూ కొత్త వారితో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో తెగతెంపులు చేసుకున్న భరత్ అరుణ్, లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) బౌలింగ్ కోచ్‌గా నియమితులయ్యారు. మూడేళ్లుగా కేకేఆర్ బౌలింగ్ దళాన్ని పర్యవేక్షించిన ఆయన, చెన్నై సూపర్ కింగ్స్‌తో చేరతారనే పుకార్లు వైరల్ అయినప్పటికీ, సంజీవ్ గొయెంకా బృందం తెలివిగా అడుగులు వేసి ఆయనతో ఒప్పందం కుదుర్చుకుంది.
ఈ నేపథ్యంలో, ప్రస్తుత బౌలింగ్ కోచ్‌గా ఉన్న వరల్డ్ కప్ హీరో జహీర్ ఖాన్‌ను లక్నో వదిలించుకోనున్నట్లు సమాచారం. భరత్ అరుణ్ రెండేళ్లపాటు ఎల్ఎస్‌జీతో కొనసాగనున్నారు. గత సీజన్‌లో జహీర్ ఖాన్‌తో ఏడాది కాంట్రాక్టు కుదుర్చుకున్న లక్నో, ఆయన నేతృత్వంలో పేస్ బౌలింగ్ యూనిట్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. పేసర్ల వైఫల్యంతో ప్రత్యర్థి జట్లకు భారీ స్కోర్లు సమర్పించుకుని, లక్నో ప్లే-ఆఫ్స్‌కు చేరలేక పోయింది. ఈ కారణంగా జహీర్ ఖాన్ కాంట్రాక్టును పొడిగించేందుకు యాజమాన్యం సుముఖంగా లేదు. అందుకే, భరత్ అరుణ్‌ను నియమించడం ద్వారా బౌలింగ్ దళాన్ని బలోపేతం చేయాలని లక్నో నిర్ణయించింది. వచ్చే ఏడాది జరిగే 19వ సీజన్‌లో భరత్ అరుణ్ ఆధ్వర్యంలో లక్నో బౌలింగ్ యూనిట్ గొప్పగా రాణిస్తుందని యాజమాన్యం ఆశిస్తోంది.





# అమీ తుమీ

## నేడు భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య కీలక టెస్టు

- భారత జట్టు నెగ్గితే సిరీస్ 2-2తో డ్రా
- శార్దూల్ ఠాకూర్‌కు మొండిచేయి!?
- కుల్దీప్ యాదవ్ తుది జట్టులో చేరే అవకాశం

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో భారత్ ఓడిపోకుండా ఉండాలంటే లండన్‌లోని ఓవల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే నిర్ణయాత్మక చివరి టెస్టులో గెలవాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ నెగ్గితే సిరీస్ 2-2తో డ్రా అవుతుంది, లేకపోతే సచిన్ టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీని కోల్పోతుంది. ఈ సిరీస్‌లో 2-1తో ముందున్న ఇంగ్లాండ్‌పై భారత్‌కు ఈ టెస్ట్ గెలవడం కీలకం. చివరి టెస్ట్‌లో భారత జట్టు ప్లేయింగ్ 11లో పలు మార్పులు ఉండవచ్చని మాజీ క్రికెటర్ వసీం జాఫర్ అంచనా వేశాడు. జస్ప్రీత్ బుమ్రా స్థానంలో మరో బౌలర్ ఆడే అవకాశం ఉందని, అర్ష్‌దీప్ సింగ్‌కు టెస్ట్ అరంగేట్రం చేసే ఛాన్స్ దక్కవచ్చని జాఫర్ తన ప్లేయింగ్ 11లో పేర్కొన్నాడు. అర్ష్‌దీప్‌తో పాటు ఈ సిరీస్‌లో సాయి సుదర్శన్, ఆకాష్ దీప్, అన్షుల్ కాంబోజ్ ఇప్పటికే అరంగేట్రం చేశారు. జాఫర్ తన జట్టులో సాయి సుదర్శన్‌కు నమ్మకంగా అవకాశం కల్పించాడు, అయితే సాయి నాల్గవ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో తొలి ఓవర్‌లోనే డకౌట్ అయ్యాడు. అలాగే, అరంగేట్రం మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లోనూ డకౌట్‌తో ప్రారంభించాడు. జాఫర్ తన ప్లేయింగ్ 11లో ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్, అన్షుల్ కాంబోజ్‌లకు చోటు కల్పించలేదు. శార్దూల్ ఈ సిరీస్‌లో రెండు టెస్ట్‌లలో కేవలం రెండు వికెట్లు తీసుకోగా, మూడు ఇన్నింగ్స్‌లలో 46 పరుగులు మాత్రమే చేశాడు. అన్షుల్ కాంబోజ్ నాల్గవ టెస్ట్‌లో అరంగే ట్రం చేసినప్పటికీ, జాఫర్ జట్టులో అతడికి అవకా శం ఇవ్వలేదు. ఓవల్ గ్రౌండ్‌లో భారత్ ఇప్పటివరకు 15 టెస్ట్‌లు ఆడగా, కేవలం రెండు మ్యాచ్‌లలో గెలిచింది, ఇంగ్లాండ్‌పై ఐదు, ఆస్ట్రేలియాపై ఒక ఓటమి చవిచూసింది, తొమ్మిది మ్యాచ్‌లు డ్రా చేసుకుంది. ఇంగ్లాండ్ గడ్డపై భారత్ విజయాలు సాధించడం సవాలుగా ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వసీం జాఫర్ ఎంచుకున్న భారత ప్లేయింగ్ 11లో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్, ఆకాష్ దీప్ ఉన్నారు.

## బెన్ స్టోక్స్, జోఫ్రా ఆర్చర్ అవుట్!

### ఐదో టెస్టు కోసం ఇంగ్లాండ్ జట్టు ప్రకటన

ఇంగ్లండ్ భారత్‌తో జరిగే ఐదో టెస్ట్ కోసం తమ ప్లేయింగ్ లెవెన్‌ను ప్రకటించింది. ఆశ్చర్యకరంగా, కెప్టెన్ బెన్ స్టోక్స్ జట్టు నుంచి అవుట్ అయ్యారు. బెన్ స్టోక్స్ స్థానంలో ఓలీ పోప్ ఐదో టెస్ట్‌లో కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ప్లేయింగ్ లెవెన్‌లో స్టోక్స్ స్థానంలో యువ స్టార్ బ్యాట్స్‌మన్ జాకబ్ బెథెల్‌కు అవకాశం లభించింది. స్టోక్స్‌తోపాటు స్పిన్ ఆల్ రౌండర్ లియామ్ డాసన్ కూడా ఐదో టెస్ట్ నుంచి వైదొలిగాడు. భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదో టెస్ట్ మ్యాచ్ జులై 31 నుంచి ఆగస్టు 4 వరకు లండన్‌లోని కెన్నింగ్‌టన్ ఓవల్‌లో జరుగుతుంది. ఇంగ్లండ్ ఈ టెస్ట్ మ్యాచ్ కోసం నలుగురు ఫాస్ట్ బౌలర్లను తమ ప్లేయింగ్ ఎలెవెన్‌లో చేర్చింది. ఇంగ్లీష్ జట్టులో ఒక్క స్పిన్నర్ కూడా లేకపోవడం కూడా ఆశ్చర్యకరం. అదే సమయంలో, భారత జట్టు ఈ మ్యాచ్‌లో ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉంది. ఇంగ్లండ్ డేంజరస్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ కూడా ఐదో టెస్ట్ నుంచి దూరమయ్యాడు. అతని స్థానంలో యువ ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్ ప్లేయింగ్ ఎలెవెన్‌లో చేరాడు. మొత్తం నలుగురు ఆటగాళ్లను ఐదో టెస్ట్ నుంచి తొలగించారు. ఇందులో ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్, కెప్టెన్ బెన్ స్టోక్స్, స్పిన్ ఆల్ రౌండర్ జోఫ్రా ఆర్చర్ ఉన్నారు. వీరందరి స్థానంలో జాకబ్ బెథెల్, గస్ అట్కిన్సన్, జేమీ ఓవర్టన్, జోష్ టంగ్ ప్లేయింగ్ ఎలెవెన్‌లో చేరారు. ఐదో టెస్ట్ కోసం ఇంగ్లండ్ ప్లేయింగ్ ఎలెవన్- జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఓలీ పోప్ (కెప్టెన్), జో రూట్, హ్యారీ బ్రూక్, జాకబ్ బెథెల్, జేమీ స్మిత్ (వికెట్ కీపర్), క్రిస్ వోక్స్, గస్ అట్కిన్సన్, జేమీ ఓవర్టన్, జోష్ టంగ్.భారత్, ఇంగ్లండ్ మధ్య టెస్ట్ సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్ట్ మ్యాచ్ లండన్‌లోని కెన్నింగ్‌టన్ ఓవల్‌లో జూలై 31న ప్రారంభమై ఆగస్టు 4 వరకు జరుగుతుంది. ఆతిథ్య ఇంగ్లండ్ సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో ఉంది. సిరీస్‌ను కోల్పోకుండా ఉండాలంటే టీమ్ ఇండియా ఈ మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాలి, ఒకవేళ ఈ టెస్ట్ డ్రాగా ముగిసినా సిరీస్ ఇంగ్లీష్ జట్టుకే దక్కుతుంది.

**5వ టెస్ట్ కోసం ఇంగ్లాండ్ ఆడే 11:** జాక్ క్రాలే, బెన్ డకెట్, ఒల్లీ పోప్ (కెప్టెన్),జో రూట్, హ్యారీ బ్రూక్, జాకబ్ బెథెల్, జామీ స్మిత్ (వికెట్ కీపర్), క్రిస్ వోక్స్, గస్ అట్కిన్సన్, జామీ ఓవర్టన్, జోష్ టంగ్

## దేశం కంటే ఫ్రాంచైజీ క్రికెట్‌కే ప్రాధాన్యం

### అమందా వెల్లింగ్‌టన్




టీ20 క్రికెట్ యుగంలో ఆటగాళ్లు ఫ్రాంచైజీ క్రికెట్‌పై మొగ్గు చూపుతున్నారు. తాజాగా ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు లెగ్ స్పిన్నర్ అమందా వెల్లింగ్‌టన్, జాతీయ జట్టుకు ఆడటం కంటే ఫ్రాంచైజీ క్రికెట్‌నే ఇష్టపడతానని సంచలన వ్యాఖ్యలు చేసింది. సాధారణంగా ఆస్ట్రేలియా ఆటగాళ్లు దేశానికి ప్రాధాన్యం ఇస్తారు, కానీ అమందా మాత్రం అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడటం తనకు ఆసక్తికరంగా లేదని తెలిపింది. ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో పవర్ ప్లే పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడిన అమందా, మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత సంతృప్తి, మరియు సంతోషకరమైన జీవనాన్ని తన తొలి ప్రాధాన్యాలుగా పేర్కొంది. ఫ్రాంచైజీ క్రికెట్‌ను ఎంచుకోవడం గురించి ఆమె ఆశ్చర్యకరమైన వ్యాఖ్యలు చేసింది. అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉండటానికి తాను స్వీయ నిర్ణయం తీసుకున్నానని, ప్రస్తుతం టీ20 లీగ్‌ల రూపంలో అనేక అవకాశాలు ఉన్నందున జాతీయ జట్టుకు మాత్రమే ఆడాలని ఆలోచించడంలో అర్థం లేదని వివరించింది.
"నేనైతే దేశం కంటే ఫ్రాంచైజీ క్రికెట్‌కే ప్రాధాన్యం ఇస్తాను. దీన్ని అపార్థం చేసుకోవద్దు. ఆస్ట్రేలియాకు ఆడటం గొప్ప గౌరవం. అయితే, మ్యాచ్‌ల కోసం ప్రపంచాన్ని చుట్టి రావడం, వివిధ ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహిస్తూ ఇతర దేశాల క్రికెటర్లతో స్నేహ బంధాలు పెంచుకోవడం నాకు ఎంతో ఇష్టం" అని అమందా వెల్లడించింది.

## భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌పై అభిమానుల ఆగ్రహం

ఆసియా కప్ 2025లో సెప్టెంబర్ 14న యూఏఈలో భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్‌పై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ మ్యాచ్‌ను బహిష్కరించాలని సోషల్ మీడియాలో అభిమానులు డిమాండ్ చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత ఈ నిర్ణయాన్ని బీసీసీఐ తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అంశ్ అనే యూజర్ తన ఎక్స్ ఖాతాలో బీసీసీఐని ట్యాగ్ చేస్తూ, పొరుగు దేశం కారణంగా తమ వారిని కోల్పోయిన కుటుంబాలు ఈ మ్యాచ్‌ను ఎలా చూడగలవని ప్రశ్నించారు. ఈ మ్యాచ్‌ను బహిష్కరించాలని, ప్రసారకులకు ఒక్క రూపాయి కూడా వెళ్లకూడదని ఆయన పేర్కొన్నారు. మరో యూజర్, మ్యాచ్ చూడకపోతే ప్రసారకులకు ఆదాయం ఎలా వస్తుందని, దీనిని అందరూ బహిష్కరించాలని సూచించారు. గబ్బర్ అనే వ్యక్తి ప్రభుత్వం, ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తూ, ఈ మ్యాచ్‌పై పార్లమెంట్‌లో చర్చ జరగకపోవడం ఆశ్చర్యకరమని, అసదుద్దీన్ ఒవైసీ మాత్రమే ఈ అంశాన్ని లేవనెత్తారని, ప్రతిపక్షాలు మౌనంగా ఉండటం రెండు వైపులా వెన్న రాసినట్లుందని వ్యాఖ్యానించారు. ఇంకో యూజర్ భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను ట్యాగ్ చేస్తూ, ఆయనను దేశభక్తుడిగా భావించామని, కానీ ఈ మ్యాచ్‌పై ఆయన మౌనం నిరాశ కలిగించిందని, పహల్గామ్ దాడిలో మరణించిన వారి కుటుంబాల బాధను వీడియో ద్వారా చూపిస్తూ ప్రశ్నించారు. #BoycottAsiaCup హ్యాష్ ట్యాగ్ ట్రెండ్ అవుతూ, బీసీసీఐ ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు.

## పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడేందుకు భారత్ నిరాకరణ


ప్రపంచ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) టోర్నమెంట్‌లో భారత్- పాకిస్థాన్ జట్ల మధ్య జరగాల్సిన సెమీఫైనల్ మ్యాచ్‌ను టీమిండియా బహిష్కరించింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్- పాక్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్న నేపథ్యంలో భారత లెజెండ్స్ ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత్ జట్టు ఇది వరకే గ్రూప్ దశలోనూ పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. దీంతో ఆ మ్యాచ్‌ను నిర్వాహకులు రద్దు చేశారు.



## టీమిండియా స్టాఫ్‌తో పిచ్ క్యూరేటర్ వాదనతో గంభీర్ జోక్యం

ఓవల్ టెస్ట్ వేదికగా భారత హెడ్ కోచ్ గౌతం గంభీర్, పిచ్ క్యూరేటర్ ఫోర్టిస్ మధ్య జరిగిన వాగ్వాదం సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. టీమిండియా బ్యాటింగ్ కోచ్ సీతాన్షు కోటక్ ఈ విషయంపై వివరణ ఇచ్చాడు. ప్రాక్టీస్ సమయంలో ఫోర్టిస్ టీమిండియా స్టాఫ్‌తో దురుసుగా ప్రవర్తించాడని, పిచ్ నుంచి రెండున్నర మీటర్ల దూరంలో ఉండాలని ఘాటుగా చెప్పాడని కోటక్ తెలిపాడు. ఫోర్టిస్ టీమ్ సపోర్ట్ స్టాఫ్‌తో వాదనకు దిగడంతో గంభీర్ మధ్యలో జోక్యం చేసుకుని, తమకు ఏం చేయాలో చెప్పవద్దని ఫోర్టిస్‌కు దీటుగా సమాధానం ఇచ్చాడు. భారత జట్టు సభ్యులు స్పైక్ షూలు ధరించకుండా సాధారణ షూలతోనే పిచ్‌ను పరిశీలించడానికి వచ్చినప్పటికీ, ఫోర్టిస్ వాగ్వాదానికి దిగాడని, దీంతో గంభీర్ వార్నింగ్ ఇచ్చాడని కోటక్ వెల్లడించాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కాగా, అభిమానులు వీడియోపై కామెంట్లు, లైకులు, షేర్లతో చర్చలు జరుపుతున్నారు. అయితే, ఫోర్టిస్ వ్యవహార శైలిపై ఫిర్యాదు చేయబోమని టీమ్ మేనేజ్‌మెంట్ స్పష్టం చేసింది. ఈ వేదికపై గురువారం నుంచి ఇంగ్లాండ్‌తో ఐదో టెస్ట్ ప్రారంభం కానుంది. సిరీస్‌లో 2-1తో ఇంగ్లాండ్ ముందుండగా, ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సిరీస్ 2-2తో సమం అవుతుంది, లేకపోతే 3-1తో ఇంగ్లాండ్ సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది. ఈ లక్ష్యంతో టీమిండియా బరిలోకి దిగుతోంది. మంగళవారం ప్రాక్టీస్‌లో సాయి సుదర్శన్ అందరి కంటే ముందుగా వచ్చి ఎక్కువ సమయం సాధన చేశాడు. నాల్గవ టెస్ట్‌లో అర్ధ సెంచరీతో పాటు డకౌట్ అయిన అతడు ఈ మ్యాచ్‌లో రాణించాలని భావిస్తున్నాడు. అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్ కూడా చాలా సేపు ప్రాక్టీస్ చేశారు. ఏదేమైనా, గంభీర్-ఫోర్టిస్ సంవాదం ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారింది.

## రిలయన్స్ బిడ్డింగ్‌పై త్వరలోనే నిర్ణయం




రిలయన్స్ బిడ్డింగ్‌పై త్వరలో నిర్ణయం జారీ కానుంది. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తమ దేశంలో నిర్వహిస్తున్న ది హండ్రెడ్ లీగ్‌లో ఫ్రాంచైజీల వాటా కొనుగోలుకు ఆమోదం తెలిపింది. లీగ్‌లోని ఆరు జట్లతో ఒప్పందాలను ఈసీబీ అధికారికంగా ఆమోదించగా, మిగిలిన రెండు జట్ల వాటా కొనుగోలుపై నిర్ణయం పెండింగ్‌లో ఉంది. వీటిలో భారత్‌కు చెందిన రిలయన్స్ సంస్థ ఓవల్ ఇన్విన్సిబుల్స్ క్లబ్‌లో 49 శాతం వాటా కోసం బిడ్డింగ్ వేసింది. ది హండ్రెడ్ లీగ్‌లో ఆరు జట్లలో జీఎంఆర్ గ్రూప్ సౌతాంప్టన్ సూపర్ ఛార్జర్స్‌లో 49 శాతం వాటాను, సంజీవ్ గొయెంకాకు చెందిన లక్నో సూపర్ జెయింట్స్ మాంచెస్టర్ ఒరిజినల్స్ (త్వరలో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్‌గా పేరు మారనుంది)లో 70 శాతం వాటాను, సన్‌రైజర్స్ హైదరాబాద్ నార్తర్న్ సూపర్ చార్జర్స్‌లో 100 శాతం వాటాను, నైట్‌హెడ్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ బర్మింగ్‌హామ్ ఫీనిక్స్‌లో 49 శాతం వాటాను, వాషింగ్టన్ ఫ్రీడమ్ వెల్ష్ ఫైర్‌లో 50 శాతం వాటాను సొంతం చేసుకున్నాయి. లియోనార్డ్ కర్టిస్ క్రికెట్ ఆర్థిక నివేదిక ప్రకారం, ఇంగ్లండ్‌లో సర్రే, ల్యాంక్‌షైర్, వార్విక్‌షైర్ వంటి ప్రధాన క్లబ్‌లు 44 శాతం ఆదాయాన్ని సంపాదిస్తుండగా, నార్తంప్టన్‌షైర్, లీసెస్టర్‌షైర్, డెర్బీషైర్ వంటి చిన్న క్లబ్‌లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. ది హండ్రెడ్ లీగ్‌లో ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఎనిమిది జట్లను కొనుగోలు చేయడంతో ఇంగ్లండ్ క్లబ్‌లకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. టీ20 ఫార్మాట్‌ను కొత్త శిఖరాలకు చేర్చిన ఐపీఎల్‌ను మించిన లీగ్ ప్రపంచంలో లేదని చెప్పవచ్చు. భారత్‌తో పాటు విదేశాల్లోనూ సిస్టర్ ఫ్రాంచైజీల ద్వారా పొట్టి క్రికెట్‌ను ఐపీఎల్ యజమానులు శాసిస్తున్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఇంగ్లండ్ క్లబ్ క్రికెట్‌కు ఊపిరిపోసేందుకు ది హండ్రెడ్ లీగ్‌లో వాటాలను కొనుగోలు చేసి తమ సామ్రాజ్యాన్ని విస్తరించారు. ఐపీఎల్ జట్ల భాగస్వామ్యంతో హండ్రెడ్ లీగ్ నిర్వాహకులు రూ.60 వేల కోట్ల ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## విరాట్ కోహ్లీ కెప్టెన్సీ తొలగింపు కోసం ఆర్‌సీబీ భారీ పథకం

### మొయిన్ అలీ సంచలన వ్యాఖ్యలు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫ్రాంచైజీకి ఐపీఎల్ ట్రోఫీ గెలిపించడంలో విరాట్ కోహ్లీ సుదీర్ఘ కాలం కెప్టెన్‌గా ఉన్నప్పటికీ, అనేక సవాళ్లను ఎదుర్కొన్నాడు. 2019లో కోహ్లీ కెప్టెన్సీని తొలగించి, మరో ఆటగాడికి పగ్గాలు అప్పగించేందుకు ఆర్‌సీబీ యాజమాన్యం పథకం వేసిందని మాజీ ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ వెల్లడి క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. 2019 సీజన్‌లో ఆర్‌సీబీ 14 మ్యాచ్‌లలో కేవలం 5 విజయాలతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచి, అభిమానులను నిరాశపరిచింది. ఈ ఘోర ప్రదర్శన నాయకత్వ మార్పుపై ఫ్రాంచైజీలో అంతర్గత చర్చలకు దారితీసింది. ఆ జట్టులో భాగమైన మొయిన్ అలీ ప్రకారం, కోహ్లీ స్థానంలో పార్థివ్ పటేల్‌ను కెప్టెన్‌గా నియమించే విషయాన్ని యాజమాన్యం తీవ్రంగా పరిశీలించింది. "పార్థివ్ దాదాపు కెప్టెన్ అయ్యే స్థితిలో ఉన్నాడు. గ్యారీ కిర్‌స్టన్ కోచ్‌గా ఉన్న చివరి సంవత్సరంలో, పార్థివ్‌కు అద్భుతమైన క్రికెట్ మెదడు ఉందని, అతడిని కెప్టెన్‌గా చేయాలనే చర్చ జరిగింది" అని మొయిన్ మీడియాతో అన్నాడు. అయితే, ఈ మార్పు ఎందుకు జరగలేదో స్పష్టంగా వెల్లడించలేదు. విరాట్ కోహ్లీ 2013లో డేనియల్ వెటోరి నుంచి కెప్టెన్సీ స్వీకరించి, 2021 వరకు జట్టును నడిపించాడు. ఆ సమయంలో 2016లో ఫైనల్‌కు చేరినప్పటికీ ట్రోఫీ గెలవలేకపోయాడు. 2017, 2019 సీజన్లలో జట్టు ఘోరంగా విఫలమవడంతో కోహ్లీ నాయకత్వంపై విమర్శలు వచ్చాయి.

## ఆస్ట్రేలియా పేసర్ జాన్ హేస్టింగ్స్ చెత్త రికార్డు




వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2025 టోర్నమెంట్‌లోని 14వ మ్యాచ్ క్రికెట్ చరిత్రలో ఒక వింత సంఘటన ఎప్పటికీ గుర్తుండిపోతుంది. లీసెస్టర్‌లోని గ్రేస్ రోడ్ మైదానంలో పాకిస్తాన్ ఛాంపియన్స్, ఆస్ట్రేలియా ఛాంపియన్స్ మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ ఛాంపియన్స్ 10 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది. అయితే, మ్యాచ్ ఫలితం కంటే కూడా ఆస్ట్రేలియా ఛాంపియన్స్ పేసర్ జాన్ హేస్టింగ్స్ వేసిన 18 బంతుల ఓవర్ గురించే పెద్ద చర్చ నడుస్తోంది. ఎందుకంటే, ఆ ఓవర్ పూర్తి కాకముందే మ్యాచ్ ముగిసిపోయింది.ఆస్ట్రేలియా ఛాంపియన్స్ తరఫున 8వ ఓవర్ వేయడానికి వచ్చిన జాన్ హేస్టింగ్స్, తన బౌలింగ్‌తో క్రికెట్ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఈ ఓవర్‌లో అతను ఏకంగా 12 వైడ్లు, ఒక నో బాల్ వేశాడు. అంటే, 13 ఎక్స్‌ట్రా బాల్స్. మొత్తంగా అతను 18 బంతులు వేశాడు.. కానీ అందులో కేవలం 5 బంతులు మాత్రమే వేశాడు. ఆ ఓవర్ పూర్తి కాకముందే పాకిస్తాన్ ఛాంపియన్స్ జట్టు సులువుగా లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది. హేస్టింగ్స్ ఈ ఓవర్‌లో 20 పరుగులు సమర్పించుకోవడమే కాకుండా, మ్యాచ్ కూడా ముగిసిపోయింది.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్తాన్ ఛాంపియన్స్ కెప్టెన్ షోయబ్ మాలిక్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అతని నిర్ణయం సరైనదే అని నిరూపితమైంది. ఆస్ట్రేలియా ఛాంపియన్స్ జట్టు కేవలం 74 పరుగులకే కుప్పకూలింది. మొత్తం జట్టు 11.5 ఓవర్లలోనే పెవిలియన్ చేరింది. పాకిస్తాన్ మాజీ స్పిన్ దిగ్గజం సయీద్ అజ్మల్ తన అద్భుతమైన బౌలింగ్‌తో 6 వికెట్లు పడగొట్టగా, ఇమాద్ వసీం 2 వికెట్లు తీసుకున్నాడు. కంగారూ ఛాంపియన్స్ జట్టు తరఫున బెన్ డంక్ అత్యధికంగా 26 పరుగులు చేశాడు.75 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన పాకిస్తాన్ ఛాంపియన్స్ ఓపెనర్లు ఎలాంటి తప్పు చేయలేదు. జట్టు 7.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని సాధించి ఘన విజయం సాధించింది. షర్జీల్ ఖాన్ 23 బంతుల్లో 32 పరుగులు, షోయబ్ మక్సూద్ 26 బంతుల్లో 28 పరుగులు చేసి జట్టుకు ఏకపక్ష విజయాన్ని అందించారు. అద్భుత ప్రదర్శన చేసిన సయీద్ అజ్మల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ మ్యాచ్ పాకిస్తాన్ అద్భుతమైన విజయానికి గుర్తుండిపోవడమే కాకుండా, జాన్ హేస్టింగ్స్ వేసిన 18 బంతుల ఓవర్ క్రికెట్ చరిత్రలోని అత్యంత వింత క్షణాలలో ఒకటిగా నిలిచిపోయింది.

## ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం కల్పించాలి

- ఆధార్ బేస్ హాజరులో ప్రభుత్వ వైద్యులు నమోదవ్వాలి
- ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యులతో సమీక్ష



**ఖమ్మం, జూలై 30 (జనం సాక్షి) :**
మెరుగైన సేవలతో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం కల్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యులతో ఆసుపత్రుల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. జిల్లాలో 4 ఏరియా ఆసుపత్రులు, 3 సామాజిక ఆరోగ్య కేంద్రాలు వైద్య విధాన పరిషత్ ద్వారా నిర్వహింప బడుతున్నాయన్నారు. సత్తుపల్లి, మధిర, కల్లూరు ఏరియా ఆసుపత్రుల నూతన భవనాల నిర్మాణం పూర్తయి, ప్రారంభానికి సిద్ధం అయ్యాయన్నారు. ప్రారంభానికి ముందే త్రాగునీరు, పవర్ సప్లయి, టాయిలెట్స్ తదితర మౌళిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండేట్లు, చిన్న చిన్న పనులు మిగులు ఉంటే యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. త్రాగునీటికి మిషన్ భగీరథ ద్వారా ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్యుల హాజరు సక్రమంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో వైద్యులందరూ ఆధార్ ఆధారిత హాజరు యాప్ లో నమోదు అవ్వాలని అన్నారు. అనుమతి, సమాచారం లేని గైర్హాజరు అవరాదని, క్షేత్ర స్థాయిలో వెళ్ళవలసి వస్తే, హాజరు నమోదు పిదప వెళ్లాలని అన్నారు. ప్రతిరోజూ హాజరు నివేదిక సమర్పించాలని కలెక్టర్ అన్నారు. అందుబాటులో ఉన్న పరికరాల ఆడిట్ చేయాలని, మరమ్మత్తుల్లో ఉన్న పరికరాల వివరాలు దృష్టికి తేవాలని, ప్రతి పరికరం పనిచేసే విధంగా మరమ్మతులు పూర్తిచేసుకుని, సమర్ధవంతంగా వినియోగించుకోవాలన్నారు. అవసరమైన మందులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఏవైనా మందులు అందుబాటులో లేక,సరఫరా లేకుండా ఉన్నట్లయితే, స్థానికంగా కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని, బయటి మందులు రోగులకు రాయకూడదని అన్నారు. పరీక్షలు టి హబ్ కు పంపేవి కాకుండా, ఆసుపత్రుల్లో కిట్లు ఉన్నవి అక్కడే చేయాలని కలెక్టర్ తెలిపారు. టెస్టింగ్ పరికరాలు కావాల్సినవి అందుబాటులోకి తెస్తామన్నారు. మేజర్ ఆపరేషన్లు చేపట్టాలన్నారు. బ్లడ్ బ్యాంక్, డయాలసిస్ యూనిట్, మార్చురీల ఏర్పాటుకు అవసరమైన చోట ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వ వైద్యులు సేవాదృక్పథంతో పనిచేయాలని, తమ వైఖరి మార్చుకోవాలని కలెక్టర్ అన్నారు. ఒక్కొక్కటిగా గ్యాప్ లన్ని పూరిస్తామన్నారు. ఉన్న వనరులను సమర్ధవంతంగా వినియోగించుకొని మంచి ఫలితాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లు, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వరరావు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలకు కృషి తోడైతే అద్భుత విజయాలు

- 2024 ఐఏఎస్ బ్యాచ్‌లో 11వ ర్యాంక్ సాధించిన సాయిశివాని అభినందించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, జూలై 30 (జనంసాక్షి) :**
మనలో ఉన్న పట్టుదలకు, కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యం అవుతాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. 2024 ఐఏఎస్ బ్యాచ్ లో 11వ ర్యాంక్ సాధించిన తెలంగాణ, వరంగల్ కు చెందిన ఇ. రాజు, రజిత దంపతుల కుమార్తె ఇ. సాయి శివాని తల్లిదండ్రులతో కలిసి బుధవారం ఖమ్మం కలెక్టరేట్, కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్, సాయి శివాని, ఆమె తల్లిదండ్రులకు శాలువా కప్పి కలెక్టర్ సన్మానించి అభినందనలు తెలిపారు. ఐఏఎస్ బాధ్యతలు, ట్రైనింగ్, పరిపాలన విధులు ఏ విధంగా ఉంటాయో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆమెకు వివరించారు. క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకున్నప్పుడే ప్రభుత్వ అధికారి, తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలరని అన్నారు. అధికారులు ప్రజలకు సేవలు అందించడానికి ఎంతో అవకాశమున్నదని, నేనేం చేస్తున్నాను, సమాజం నా నుండి ఏం ఆశిస్తున్నది, నా పరిధిలో ఏం చేయగలనన్నది ఆలోచించాలన్నారు. ప్రజలు ప్రశ్నిస్తున్నారని, ప్రజలకు జవాబుదారీగా ఉన్నప్పుడే విధుల నిర్వహణ చేయగలమని, వృత్తికి న్యాయం చేయగలమని కలెక్టర్ తెలిపారు. ప్రజల్లో నమ్మకాన్ని ఎప్పుడు కోల్పోవద్దని ఆయన సూచించారు. మనం చేసే పనిలో అనేక ఇబ్బందులు, కష్టాలు వస్తాయని వాటిని తట్టుకుని మళ్ళీ నిలబడాలి అని అన్నారు. సమాజంలో మనకు అనేక మంది స్ఫూర్తిని ఇచ్చేవారు ఉన్నారని, మనల్ని కష్టపడి చదువించిన తల్లిదండ్రులు మనకు స్ఫూర్తిగా ఉంటారని అన్నారు. చిన్నతనంలో తాను సాధారణ విద్యార్థి మాత్రమేనని, జీవితంలో ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఐఏఎస్ ఫస్ట్ ర్యాంక్ పాస్ అయ్యానని అన్నారు. మనకు ఉన్న సామర్థ్యంతో పాటు సరైన సమయంలో కష్టపడి పని చేయడం చాలా అవసరమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.



## చురుకుగా ఖైరతాబాద్ గణేశ్ విగ్రహ పనులు

**హైదరాబాద్, జూలై30 (జనంసాక్షి) :** గణేశ్ ఉత్సవాలు దగ్గర పడుతుండటంతో ఖైరతాబాద్ బడా గణేశుడి విగ్రహం పనులు వేగం పుంజుకున్నాయి. ఈ సంవత్సరం 69 అడుగుల శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. మూడు నెలల ముందే కర్రపూజతో ప్రారంభమైన ఈ పనులు శరవేగంగా ఊపందుకున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో పనులకు ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఖైరతాబాద్ బడా గణేశుడి విగ్రహం తయారీ పనుల గురించి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

# సిట్ దాడుల్లో హైదరాబాద్ శివారులో భారీగా నగదు పట్టివేత

- 12 బాక్సుల్లో భద్ర పరిచిన రూ.11 కోట్ల నగదు సీజ్

**రాజేంద్రనగర్, జూలై 30 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన లిక్కర్ కుంభకోణంలో కీలక మలుపు చోటుచేసుకుంది. మద్యంకేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో కొత్త కోణాలు బయటపడుతున్నాయి. నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టిన సిట్ అధికారులు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. రాజ్ కెసిరెడ్డి సూచన మేరకు 12 బాక్సుల్లో భద్ర పరిచిన రూ.11 కోట్ల నగదును అధికారులు సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారంలోని సులోచన ఫార్మ్ గెస్ట్ హౌస్‌లో అక్రమ మద్యం నగదు డంప్‌ను గుర్తించారు. లిక్కర్‌స్కామ్‌లో ఏ-40 వరుణ్ పురుషోత్తం నోట సంచలన నిజాలు వెల్లడయ్యాయి. అతని వాంగ్మూలం ఆధారంగా తనిఖీలు చేపట్టిన అధికారులకు భారీగా నగదు పట్టు- బడింది. నగదు సీజ్ ఘటనలో చాణక్య, వినయ్ పాత్రపైనా సిట్ బృందం విచారణ చేపట్టింది. రాజ్ కెసిరెడ్డి, చాణక్య ఆదేశాల మేరకు జూన్ 2024లో వినయ్ సాయంతో వరుణ్ రూ.11 కోట్ల నగదు ఉన్న 12 అట్ట పె-÷-టటె-లను



ఆఫీస్ ఫైళ్ల పేరుతో దాచినట్టు- సిట్ అధికారులు గుర్తించారు. నిన్న దుబాయ్ నుంచి వచ్చిన వరుణ్ పురుషోత్తమ్‌ను శంషాబాద్ విమానాశ్రయంలో సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏపీ మద్యం స్కామ్‌లో రాజ్ కెసిరెడ్డి వసూళ్ల బృందంలో వరుణ్ కీలక వ్యక్తి. అతడి నుంచి సిట్ అధికారులు కీలక సమాచారం రాబట్టారు. వరుణ్‌పై విజయవాడ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ కూడా జారీ చేసింది. వరుణ్ పురుషోత్తం నేరాన్ని అంగీకరించి నిజాలు బయటపెట్టడంతో లిక్కర్ స్కామ్‌కి చెందిన భారీ నగదు నిల్వల విషయం వెలుగులోకి వచ్చింది. మరి కొన్ని చోట్ల సిట్ సోదాలు నిర్వహించే అవకాశముంది. వైకాపా ప్రభుత్వంలో ముఖ్య నేతల పాత్రపై కూడా సిట్‌కు కీలక సమాచారం లభ్యమైనట్టు- తెలుస్తోంది. పూర్తి ఆధారాలతో త్వరలో కొందరు పెద్దతలకాయల పాత్ర కూడా బయటపడే అవకాశముందని సమాచారం. హైదరాబాద్‌లో సిట్ అధికారులు సోదాలు చేసి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ స్కాంలోవరుణ్ ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ కేసులో ఎ1గా ఉన్న కేశిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు వరుణ్, ఎ12 చాణక్య రూ. 11 కోట్లని 12 అట్టపెట్టల్లో దాచినట్లు- అంగీకరించారు. 2024 జూన్‌లో ఈ మొత్తం దాచినట్లుగా అధికారులు గుర్తించారు. శంషాబాద్ మండలంలోని కాచారం గ్రామంలో ఉన్న సులోచన ఫార్మ్ హౌస్‌లో సిట్ అధికారులు తనిఖీలు చేసి భారీగా అక్రమ మద్యం డంపును స్వాధీనం చేసుకున్నారు. ఈ గెస్ట్‌హౌస్ సులోచన ఫార్మ్స్, ప్రొఫెసర్ తగల బాల్‌రెడ్డి, పేరు మీద ఉన్నట్లు- సిట్ అధికారులు గుర్తించారు. లిక్కర్ స్కాంలో సిట్ అధికారులు దూకుడు పెంచి హైదరాబాద్ నగరంలో భారీగా సోదాలు నిర్వహిస్తున్నారు. నగదు సీజ్ చేసి వరుణ్, చాణక్యలని అదుపులోకి తీసుకుని సిట్ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ విచారణలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

## తమిళనాడు బిజెపి ఉపాధ్యక్షురాలిగా ఖుష్బూ



**చెన్నై, జూలై30 (జనంసాక్షి) :** ప్రముఖ సినీ నటి, భాజపా నాయకురాలు ఖుష్బూ సుందర్‌కు భాజపాలో ముఖ్యమైన పదవి దక్కింది. త్వరలో తమిళనాడు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పార్టీపరంగా ఆమెకు కీలక పదవిని కట్టబెట్టారు. తమిళనాడు భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఆమె నియమితులయ్యారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదంతో కొత్త రాష్ట్ర వర్గాన్ని నియమించినట్లు- ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 14మంది నియమితులు కాగా.. ఈ జాబితాలో ఖుష్బూ సుందర్‌కు చోటు దక్కింది. అలాగే, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ఐదుగురు, రాష్ట్ర కార్యదర్శులుగా 14 మందితో కూడిన జాబితాను నయనార్ నాగేంద్రన్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసుకున్నారు. ఖుష్బూ ప్రస్తుతం జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా, భాజపా జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

# ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరిస్తాం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటారు
- మంత్రి సీతక్కను కలిసిన ఫీల్డ్ అసిస్టెంట్లు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరిస్తామని, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుది నిర్ణయం తీసుకుంటారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. సచివాలయంలో మంత్రి సీతక్కతో ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశమయ్యారు. పదేళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం అధికారుల నుంచి మంత్రి సీతక్క వివరాలు తెలుసుకున్నారు. గతంలో వివిధ కారణాలతో విధుల్లోంచి తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, వారిని తొలగించిన సర్క్యులర్‌ను రద్దు చేసి.. తిరిగి విధుల్లోకి తీసుకునే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఇది తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లలో ఎంతో సంతోషాన్ని నింపింది.



### తొలగింపు కారణాలు..

గత ప్రభుత్వ హయాంలో ఫీల్డ్ అసిస్టెంట్లను కొన్ని కారణాలతో విధుల్లోంచి తొలగించారు. ప్రధానంగా, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే ఈ ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీల హాజరు నమోదు, పని ప్రదేశాల పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తారు. అయితే.. హాజరు నమోదులో అక్రమాలు, అవినీతి ఆరోపణలు, పని తీరులో లోపాలు వంటి కారణాలతో వారిని తొలగించారు. అంతేకాకుండా.. కొన్ని సందర్భాల్లో రాజకీయ కారణాలు కూడా వారి తొలగింపునకు దారితీశాయని అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా.. ఫీల్డ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ నేతలతో మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. ఈ చర్చలలో పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ప్రస్తుతం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇస్తున్న జీతాలలో తేడాలు ఉన్నాయని, వాటిని కూడా సవరించి ఒకే విధమైన వేతనాన్ని అమలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ వేతన సవరణ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పరిచే అవకాశం ఉంది.

### బదిలీలు, బీమా సౌకర్యాలపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చలు..

అలాగే.. ఫీల్డ్ అసిస్టెంట్ల బదిలీలపై కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి ఒక తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. వీటితో పాటు.. వారికి హెల్త్ ఇన్సూరెన్స్, వ్యక్తిగత, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడి చర్యలు చేపడతామని ఆమె తెలియజేశారు. ఈ బీమా సౌకర్యాలు, వారికి, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రతను అందిస్తాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ సానుకూల నిర్ణయంతో.. ఇన్నాళ్లుగా తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిరీక్షిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై దోబూచులాట

- కాంగ్రెస్, బిజెపిల తీరుపై మండిపడ్డ వినోద్



**హైదరాబాద్, జూలై 30 (జనంసాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో భాజపా, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని బిఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. ఈ విషయంలో రెండు పార్టీలు ఇంకా మోసం చేయాలని చూస్తున్నాయని అన్నారు. ప్రధాని మోదీ, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అనుకుంటే గంటలోపు బిల్లుకు ఆమోదం లభిస్తుందని పేర్కొన్నారు. శాసనసభ, మండలి బిల్లు ఆమోదించిన అంశంపైనే ఆర్డినెన్స్ సాధ్యం కాదని.. కాంగ్రెస్, భాజపాలు బీసీలను ఎందుకు మోసం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, చట్టసవరణ చేసి తొమ్మిదో షెడ్యూల్‌లో చేరిస్తేనే న్యాయపరమైన రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ల కోసం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రైవేట్ బిల్లు పెట్టొచ్చు కదా అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ అడగరు, మోదీ చేయరు, అన్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 243ఉలోని ఈ క్లాజ్‌కు సవరణ చేసినా కూడా బీసీ రిజర్వేషన్లు సాధ్యమవుతుందని వినోద్ తెలిపారు. ముఖ్యమంత్రిగా ఉండి ధర్నాలు అంటూ డ్రామాలు చేయాల్సిన అవసరం లేదని, రాహుల్ గాంధీతో కలిసి వెళ్లి మోదీని అడగాలని సీఎం రేవంత్‌కు సూచించారు. భాజపాకు చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ హయాంలో ఆమోదించిన, రేవంత్ రెడ్డి హయాంలో ఆమోదించిన బిల్లులను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. బిజెపి కూడా తన చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు.

# దారితప్పిన మహిళా టీచర్ అరెస్ట్

**ముంబై, జూలై30 (జనంసాక్షి) :** విద్యాబుద్ధులు నేర్పాల్సిన మహిళ టీచర్ దారితప్పింది. ఓ విద్యార్థితో అసభ్యంగా ప్రవర్తించింది. దీంతో పోలీసులు అమెను అరెస్ట్ చేశారు. నవీ ముంబై ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 35 ఏళ్ల మహిళ టీ-చర్ ఓ మైనర్ విద్యార్థికి ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు- ఇతర సోషల్ మీడియా అకౌంట్లకు అసభ్యకర సందేశాలు పంపించేది. అంతేకాక.. అతనికి సెమీ న్యూడ్‌గా కాల్స్ చేసేది. దీంతో సదరు విద్యార్థి తల్లిదండ్రులకు ఈ విషయాన్ని చెప్పాడు. వాళ్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. టీ-చర్ ప్రవర్తన తమ కుమారుడి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపించినట్లు- ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు టీ-చర్‌ని అరెస్ట్ చేశారు. ఈ విద్యార్థితోనేనా.. లేక ఇతర విద్యార్థులతో కూడా ఇలాగే ప్రవర్తించేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# జోగులాంబ టెంపుల్‌ను అభివృద్ధి చేయాలి

- రూ. 382.5 కోట్లతో ఆలయం సమూల అభివృద్ధి
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశం
- జోగులాంబ మాస్టర్ ప్లాన్ పై ఎండోమెంటు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అలంపూర్ జోగులాంబ టెంపుల్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జోగులాంబ ఆలయ మాస్టర్ ప్లాన్ పై ఎండోమెంటు ఉన్నతాధికారులతో మంత్రి సురేఖ, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎండోమెంటు డిపార్టుమెంటు ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకటరావు, తెలంగాణ ధార్మిక్ అడ్వజర్ గోవింద హరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... జోగులాంబ ఆలయాల అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు వివరించారు. కృష్ణ - తుంగభద్ర నదుల సంగమ ప్రాంతంలో జోగులాంబ శక్తి పీఠం ఉందని... ఈ టెంపుల్ ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో భక్తులు, సందర్శకులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలోనే వచ్చినా... ఆ మేరకు నిర్మాణ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ టెంపుల్‌ను మూడు విడతల్లో అభివృద్ధి చేస్తున్నామని, మొత్తం రూ. 382.5 కోట్లతో అభివృద్ధి చేపడుతున్నట్టు వివరించారు.

# గురుకుల విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరం



- సమస్యలపై చిత్తశుద్ధి లేని సీఎం రేవంత్ రెడ్డి
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆందోళన

**హైదరాబాద్, జూలై 30 (జనంసాక్షి) :** తెలంగాణలోని గురుకుల పాఠశాలల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులాలను వెంటాడుతున్న సమస్యలు, విద్యార్థుల నిరసనలపై ఆయన తీవ్రంగా స్పందించారు. తెలంగాణ భవిష్యత్ రోడ్డెక్కిందని సీఎం రేవంత్ రెడ్డిపై నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. నాడు కేసీఆర్ పాలనలో గురుకుల విద్యార్థులు ఎవరెస్ట్ శిఖరాలు ఎక్కారు. నేడు ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తమ సమస్యల పరిష్కారం కోసం గురుకుల పాఠశాలల విద్యార్థులు రోడ్లెక్కుతున్నారు అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. గద్వాల జిల్లా అలంపూర్ మండలం పుల్లూరు గ్రామంలోని మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో తాగునీరు రాక ఉప్పు నీరు తాగుతున్నామని, పురుగుల అన్నం తింటు-న్నామని, మరుగుదొడ్లు సరిగ్గా లేక బహిర్భూమికి పంట పొలాల్లోకి వెళుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరడం కాంగ్రెస్ పాలన వైఫల్యానికి నిదర్శనం అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం బడిపిల్లల పాదయాత్రను కూడా బెదిరించి విద్యార్థులను డీసీఎంలో ఎక్కించి వెనక్కి తీసుకెళ్లడం కాంగ్రెస్ సర్కార్ నిర్బంధానికి నిదర్శనం. సంక్షేమ గురుకుల పాఠశాలల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేసింది అని నిప్పులు చెరిగారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలో గురుకుల విద్యార్థులు 150 మంది కలుషిత ఆహారం తిని ఆస్పత్రి పాలయిన ఘటన మరవక ముందే పుల్లూరు విద్యార్థులు రోడ్డెక్కడం ఈ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. గురుకులాల్లో సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. పుల్లూరు గురుకుల పాఠ శాల విద్యార్థుల సమస్యలపై ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు.




# ముగిసిన చంద్రబాబు సింగపూర్ పర్యటన

- నాలుగు రోజులపాటుపెట్టుబడులే లక్ష్యంగా చర్చలు
- పలు సంస్థల ప్రతినిధుల సమక్షంలో ఒప్పందాలు
- పర్యటన ముగించుకుని బయలుదేరిన బాబు బృందం

**అమరావతి, జూలై30 (జనంసాక్షి) :** పెట్టుబడులను ఆకర్షించటం, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు చేపట్టిన సింగపూర్ పర్యటన విజయవంతంగా పూర్తయ్యింది. మంత్రులు నారా లోకేష్ , పి.నారాయణ, టీజీ భరత్ సహా ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి సింగపూర్ లో నాలుగు రోజుల పాటు- అవిశ్రాంతంగా వివిధ సమావేశాలు, రౌండ్ టేబుల్ చర్చల్లో పాల్గొన్నారు. సింగపూర్ లోని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను సందర్శించి వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు వీలుగా అధ్యయనం చేశారు. పర్యటనలో మొత్తం 26 కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు, మంత్రులు హాజరయ్యారు. పర్యటన మొదటి నుంచి చివరి రోజు వరకూ క్షణం తీరిక లేకుండా ఆసాంతం రాష్ట్ర అభివృద్ధి కాంక్షతో నిరంతరం చర్చలు, సంప్రదింపులు జరిపారు. సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాన మంత్రి, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్, అలాగే వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి టాన్ సీ లెంగ్, సెక్యూరిటీ-, హోం వ్యవహారాల మంత్రి కె.షణ్ముగం తదితరులతో సీఎం సమావేశమయ్యారు. ఏపీ-సింగపూర్ మధ్య సహకారాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధిలోనూ భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. గత పాలకుల చర్యల కారణంగా ఏపీ సింగపూర్ మధ్య దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించటంలో ముఖ్యమంత్రి సఫలీకృతం అయ్యారు. సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులు మళ్లీ ఆంధ్రప్రదేశ్ వైపు తిరిగి చూసేలా చేయగలిగారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకునేందుకు వచ్చినట్టు- అక్కడి ప్రభుత్వ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించి చెప్పారు. నవంబరు 14-15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు హాజరుకావాల్సిందిగా సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధుల్ని సీఎం ఆహ్వానించారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370